25-11Pg1exHMNWJQET 1 ONG_25-11Pg1exHMNWJQET.qxd 25/Nov/25 12:19 AM Page 1

సామాజిక
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు

నేటి మీ కపిల్‌చిట్స్‌తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45 years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 294 పేజీలు: 12 వెల: 6.50

# ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం

## వ్యర్థాలను డిస్పోజ్ చేసేందుకు త్వరలో విధాన నిర్ణయం

### సర్క్యులర్ ఎకానమీ విధానాలను ప్రమోట్ చేయాలి

### గాలి నాణ్యతను విశ్లేషించాలి

### ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు: సిఎం చంద్రబాబు



**విజయవాడ, నవంబరు 24. ప్రభాతవార్తప్రతినిధి:** అన్ని రకాల ప్లాస్టిక్‌వ్యర్థాలను డిస్పోజ్ చేసేందుకు ఓ విధాననిర్ణయం తీసుకోవాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో సహా వివిధ శాఖల అధికారులతో సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్యాన్ని నెట్ జీరో స్థాయికి తగ్గించాలి. గాలి, నీరు, ఇండస్ట్రియల్ వేస్ట్, బయో వేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్ వంటి వాటిల్లో వివిధ రకాల అధ్యయనం చేయాలి. ఇందు కోసం టెక్నాలజీని వినియోగించాలి. ఎవరైనా నియమాలను అతిక్రమిస్తే.. సదరు సంస్థలు.. వ్యక్తులకు ముందుగా హెచ్చరికలు జారీచేసి ఆ తర్వాత చర్యలు తీసుకోవాలి. ఇక ప్రత్యేకంగా ప్లాస్టిక్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వివిధ వ్యర్థాలను సర్క్యులర్ పాలసీకి అనుసంధానం చేయాలి. ఇక ప్రత్యేకంగా బయో వేస్ట్ డిస్పోజల్స్ విషయంలో ఏ మాత్రం అలక్ష్యం వహించవద్దు. మొత్తంగా 15,526 హెల్త్ కేర్ ఫెసిలిటీస్ ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా వచ్చే బయో వ్యర్థాలను 48 గంటల్లోగా డిస్పోజ్ చేయాల్సిందే. దీన్ని కచ్చితంగా పాటించాలి. పర్యవేక్షణకు టెక్నాలజీని..సిసి టీవీలను వినియోగించాలి' అని ముఖ్యమంత్రి సూచించారు.ఎయిర్ క్వాలిటీని అన్ని కోణాల్లో విశ్లేషించాలి. ఎయిర్ క్వాలిటీ సిస్టం మానిటరింగ్ కోసం లేటేస్ట్ టెక్నాలజీని వినియోగించుకోవాలి. >>2

# బాలీవుడ్ నటదిగ్గజం ధర్మేంద్ర ఇకలేరు



## 300 పైగా చిత్రాల్లో నటించిన 'పద్మభూషణు'డు

### కొద్ది రోజులుగా అస్వస్థతతో ధర్మేంద్ర

### ఆరు దశాబ్దాల సినీ జీవితంలో షోలే, యాదోంకి బారాత్, షికార్ వంటి సూపర్‌హిట్ చిత్రాలనేకం

### 2004లో బిజెపి ఎంపిగా గెలుపొందిన ధర్మేంద్ర

### అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించిన అమితాబ్, అమీర్‌ఖాన్ తదితర ప్రముఖ నటులు, రాజకీయ నాయకులు

**ముంబయి, సెప్టెంబరు 24:** బాలీవుడ్ ప్రముఖ నటుడు ధర్మేంద్ర (89) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆయన ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నారు. డిశ్చార్జ్ అయ్యాక ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. 300కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన యాక్షన్ కింగ్‌గా, బాలీవుడ్ హీమ్యాన్‌గా గుర్తింపు పొందారు. భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత విజయవంతమైన నటులలో ధర్మేంద్ర ఒకరు. ఆరు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు వచ్చాయి. ధర్మేంద్రకు ఇద్దరు భార్యలు కాగా, ఒకరు ప్రకాశ్ కౌర్, మరొకరు హేమమాలిని. ఆయనకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. >>2



సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# కొత్త సిజెఐగా సూర్యకాంత్

## సుప్రీం 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం

### ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు హాజరు

### తొలి రోజే 15 కేసుల విచారణ

**న్యూఢిల్లీ, నవంబరు 24:** సుప్రీంకోర్టు 53వ ప్రధానన్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ సూర్యకాంత్ చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సిజెఐగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదివారం పదవీ విరమణ చేసిన సిజెఐ బిఆర్ గవాయ్‌స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఈ పదవిలో కొనసాగనున్నారు. సిజెఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణావాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర న్యాయశాఖ మంత్రితో సహా పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. అలాగే ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. సుప్రీం కోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ >>2

# సమాజంలో మార్పుకే నైతిక విలువల విద్య

### మహిళలను గౌరవించేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు

### తల్లిదండ్రుల నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టాలి

### రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో మంత్రి లోకేష్

### హాజరైన ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు



సోమవారం విజయవాడల్లో నైతిక విలువల విద్యాసదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న చాగంటి కోటేశ్వరరావు. చిత్రంలో మంత్రి లోకేష్ తదితరులు

**విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** "నైతిక విలువల ద్వారా సమాజంలో మార్పు తేవాలని చంద్రబాబు నిర్ణయించారు, ముఖ్యమంత్రి తనను పిలిచి సమాజంలో నైతిక విలువలు తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని కేబినెట్ ర్యాంకుతో నియమించారు. ఇది ఒక పవిత్రమైన బాధ్యత" అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖలమంత్రి లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నైతికవిలువలపై రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి వద్ద లైఫ్ లాంగ్ లెర్నర్‌ను నేను. నేను అనేకమంది వ్యక్తులను కలిసినపుడు అంతా కేబినెట్ ర్యాంకు హోదా కావాలని కోరుకునేవారు, అలాంటిది చాగంటికి కేబినెట్ ర్యాంకుఇచ్చినా కనీసం కప్పు కాఫీకూడా తాగలేదు. ప్రభుత్వ వాహనం ఉపయోగించలేదు. ఆయన సెల్ ఫోన్ బిల్లుకూడా ఆయనే చెల్లిస్తున్నారు. అలాంటి గొప్పవ్యక్తి ద్వారా ఈరోజు నైతిక విలువలపై పుస్తకాలు రూపొందించి మీ భవిష్యత్తు కోసం అందిస్తున్నాం" అని వివరించారు.

**నైతిక విలువల ద్వారానే ఉత్తమ పౌరులు**

"మట్టి కుండలామారుతుంది, శిల శిల్పంలా తయారవుతుంది. చిన్న విత్తనం పెద్ద చెట్టుగా ఎదుగుతుంది. అలాగే బడిలో పిల్లలు చదువుతో పాటు నైతిక విలువలు నేర్చితే సమాజంలో ఆశిస్తున్న మార్పును సాధించగలుగుతాం.

అణుశక్తిని బాబులా వాడటం వల్ల హిరోషిమా, నాగసాకీ నగరాల్లో ఎంత వినాశనం జరిగిందో అందరం చూశాం. అదే అణుశక్తిని విద్యుత్ తయారీకి వాడితే దేశానికి వెలుగు, అభివృద్ధి లభిస్తుంది. అలాగే పిల్లలను సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపైనా ఉంది" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**మహిళలను గౌరవించాలి**

"మహిళలను, పెద్దలను గౌరవించాలి. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా నాకు ఈ నైతిక విలువలు నేర్పారు మా తల్లి భువనమ్మ. నా చిన్ననాటి నుంచీ ఆమె నాకు క్రమశిక్షణ నేర్పించారు. ఆమె ఎప్పుడూ కష్టపడాలి, నీవంతు ప్రజలకు సేవచేయాలని మాత్రమే చెప్పారు. ప్రభుత్వంగా చేయాల్సింది మేం చేస్తాం. చాగంటి గారి లాంటి గొప్పవ్యక్తులతో పుస్తకాలు రూపొందిస్తాం. కానీ అది సరిపోదు. మార్పు మన ఇంటి >>2

# ఇక 'ఆరోగ్యాంధ్ర'

### 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ

### వచ్చే నెల సిఎం అధ్యక్షతన సమావేశం

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** బహుముఖ వ్యూహాలతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జరుగుతున్న ప్రయత్నాలను సమీక్షించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి రాష్ట్రప్రభుత్వం 10మంది ప్రముఖ అంతరాజ్తీయ నిపుణులతో ఉన్నతస్థాయి సలహా మండలిని నియమించింది. ఈమేరకు తగు చర్చల అనంతరం వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతిపాదనను సిఎం నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఆమోదించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ లక్ష్యంగా...2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు ముఖ్యమంత్రి విజన్ డాక్యుమెంట్ విడుదల చేసింది. ఈదిశగా ఇప్పటికే ప్రయత్నాలు మొదలయ్యాయి. అత్యధికంగా ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న 10 వ్యాధులకు సంబంధించి ఒక్కోవ్యాధికి అడ్వయిజరీ గ్రూపు ఏర్పాటు చేశారు. వ్యాధుల వారీగాప్రణాళికలను రూపొందించి ఆయా వ్యాధుల భారాన్ని తగ్గించడానికి కృషి జరుగుతోంది. ఆధునిక సాంకేతికతో మెరుగైన వైద్య సేవల్ని అందించడానికి గేట్స్ ఫౌండేషన్, టాటా ఎండి, ఐఐటి చెన్నై మరియు స్వస్థి వంటి సంస్థల భాగస్వామ్యంతో పలు ప్రణాళికలు అమలవుతున్నాయి. వీటితో పాటు పలు ఇతర >>2

## ఐఎస్ జగన్నాథపురం నరసింహస్వామి

# ఆలయ అభివృద్ధికి చర్యలు



నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న ప్రదక్షణ మండపానికి భూమిపూజ చేస్తున్న డిసిఎం పవన్

### రూ. 8.7 కోట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు

### ఆలయ విస్తరణకు 30 ఎకరాలు కేటాయింపు

### మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**కొయ్యలగూడెం, నవంబరు 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత పర్యటనలో ఏలూరు జిల్లా, ఐఎస్ జగన్నాథపురం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి వచ్చినసందర్భంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ ప్రదక్షిణ మండప నిర్మాణంతో పాటు గ్రామం నుంచి కొండ పైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మింపచేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి అంశాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. ఇందుకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి రూ.8.7 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆలయానికి అనుబంధంగా అభివృద్ధిపనులు చేపట్టేందుకు 30 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఇప్పించారు. సోమవారం ఐఎస్ జగన్నాథపురం పర్యటనలో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం రూ.3.5 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న ప్రదక్షణ మండపానికి, రూ.3.7 కోట్ల పంచాయతీరాజ్ రోడ్ అసెట్స్ నిధులతో ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామం నుంచి ఆలయానికి వెళ్లేందుకు నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. >>2

## నకిలీ మద్యం కేసు

# పోలీసు కస్టడీకి ఆరుగురు నిందితులు

**విజయవాడ, నవంబరు 24,ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో ఆరుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. నిందితులను మూడు రోజుల పాటు సిట్ అధికారుల ప్రశ్నించనున్నాఉ. బాలాజీ, సుదర్శన్, కట్టా రాజు, కొడాలి శ్రీనివాసరావు, చైతన్యబాబు, అష్రఫ్‌లను అధికారులు విచారించి సమాధానాలను రాబట్టనున్నారు. కస్టడీ లోకి తీసుకోవడానికి ముందు వారికి వైద్య పరీక్షలను చేయిస్తున్నారు. అందులో భాగంగా వారిని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిని వేర్వేరుగా విచారించనున్నట్లు అధికారులు తెలిపారు. వారిని పోలీసులు పలు అంశాలపై లోతుగా విచారిస్తున్నారు.

## లిక్కర్ స్కాం నిందితుడు

# చెవిరెడ్డి ఆస్పత్రికి..

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ నేత,మాజీ ఎంఎల్‌ఎ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. లిక్కర్ స్కాంలో నిందితుడిగా ఉనన్ర ఆయన ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులోఉన్నారు. కాళ్ల వాపుతో బాధపడుతున్నానని భాస్కరరెడ్డి పోలీసులకు తెలిపారు. ఈమేరకు వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలను నిర్వహించారు. చికిత్స అనంతరం భాస్కర్ రెడ్డిని తిరిగి జైలుకు తరలించనున్నారు. గతంలో జూన్ నెలలో కూడా ఆయన గుండె నొప్పిగా ఉందనడంతో పోలీసులు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సను అందించారు. అయితే ఇటీవలే విజయవాడ ఎసిబికోర్టు కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి,సజ్జల శ్రీధర్‌రెడ్డి,అనిల్‌చోక్రా,చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు,బూనేటి చాణక్యులకు డిసెంబరు 5 వరకు రిమాండును పొడిగించింది.

# అన్నదాత అభివృద్ధికి 5 సూత్రాలు

### నీటి భద్రత, ప్రకృతిసేద్యం, టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ సాయం- సూత్రాలతో రైతే రాజుగా ఉండే రాష్ట్రం నిర్మిస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు



సోమవారం ఘంటసాల గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పటిష్టమైన పంచసూత్ర ప్రణాళికతో ముందుకు వెళుతోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సోమవారం కృష్ణ జిల్లా, ఆవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటసాల గ్రామంలో ..రైతన్న మీకోసం.. కార్యక్రమాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ఆవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.మండలి బుద్ధప్రసాద్‌తో కలసిప్రారంభించారు. ఈసందర్భంగా ఘంటసాల గ్రామంలో రైతులకు పంచసూత్ర ప్రణాళిక ఉద్దేశాన్ని, ఉపయో >>2

## రైతుల పట్ల ప్రభుత్వం

# చిన్న చూపు: జగన్



**విజయవాడ, నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులను చంద్రబాబు ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు.రైతుల కష్టాల పట్ల ప్రభుత్వానికి కనీస కనికరం లేదన్నారు.రికార్డు స్థాయిలో పంటల ధరలు దారుణంగా పతనమైనా ప్రభుత్వం రైతుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని తెలిపారు. కూటమి పాలన కారణంగా నెలకొన్న దారుణమైన పరిస్థితులను తట్టుకోలేక, ప్రభుత్వం నుంచి ఆసరా లేక రైతులు వేసిన పంటలను ట్రాక్టర్లతో దున్నేసే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. రైతుల సమస్యలపై చర్చ జరగకుండా డైవర్షన్ చేయడానికి చేపట్టిన >>2

25-11pg2exHMNWJQETR 2_25-11pg2exHMNWJQETR.qxd 25/Nov/25 12:21 AM Page 1






సోమవారం కోల్‌కతాలో 'సర్' సర్వే చేస్తున్న బూత్ స్థాయి అధికారులు నిరసన ప్రదర్శన జరిపిన దృశ్యం

# ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం

>> ఆ డేటాను అవేర్ - 2.0కు లింక్ చేయాలి. దీన్ని అవేర్2.0 వ్యవస్థకు అనుసంధానం చేయాలి. ఇక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దృష్టిలో పెట్టాలి. ఈ మేరకు అనుమతులిచ్చేందుకు అవసరమైన మార్పులు చేపట్టాలి. రెడ్ జోన్ పరిధిలో ఉన్న పరిశ్రమలకు 12 రోజులు, ఆరేంజ్ జోన్ పరిధిలో ఉన్న పరిశ్రమలకు 10 రోజులు, గ్రీన్ జోన్‌లో ఉన్న పరిశ్రమలకు 3 రోజుల్లో అనుమతులు ఇవ్వాలి. సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు అన్నింటినీ త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. మైనింగ్ పొల్యూష్యన్ విషయంలోనూ ఫోకస్ పెట్టి చర్యలు చేపట్టాలి. రాబోయే రోజుల్లో కాలుష్యాన్ని కూడా అవేర్ లోకి తీసుకుంటాం. మైక్రో ఇరిగేషన్‌లోనూ పంటపొలాల్లో ప్లాస్టిక్ షీట్స్ వినియోగం వల్ల దీర్ఘ కాలంలో రైతులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. దీని కోసం బయో షీట్స్ వేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలి. పొల్యూషన్ కంట్రోల్, పర్యావరణ రక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలి. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయండ్డి అని సీఎం ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అవసరమైన సిబ్బంది కావాలని ఆ సంస్థ ఛైర్మన్ కృష్ణయ్య ముఖ్యమంత్రిని కోరగా దీనికి సీఎం అంగీకరం తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇక 'ఆరోగ్యాంధ్ర'

>> కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య పథకాలు నడుస్తున్నాయి. ఈ ప్రణాళికల అమలు, ఫలితాలను సమీక్షి స్తూ ఆరోగ్యాంధ్ర సాధన దిశగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి 10 మందితో కూడిన ఉన్నతస్థాయి నిపుణుల సలహా మండలి ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకరించారు.

**నిపుణుల సలహా మండలి బాధ్యతలు..**

ప్రపంచ వ్యాప్త విధానాలు మరియు అనుభవాలు, సాంకేతిక నైపుణ్యం, వ్యూహ రచనల మేళవింపుతో రాష్ట్రాన్ని ఆరోగ్య రంగంలో అగ్రస్థానంలో నిలపడానికి సలహా మండలి చేపట్టాల్సిన బాధ్యతలను ప్రభుత్వం ఈ క్రింది విధంగా స్పష్టంగా పేర్కొంది. స్వర్ణాంధ్ర విజన్2047 మేరకు రాష్ట్ర ప్రజలకు పూర్తి ఆరోగ్యం మరియు ఆహ్లాదం కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక రూపకల్పన,చ మాతాశిశు ఆరోగ్య పరిరక్షణ మరియు అసంక్రమిక(ఎన్సీ డీ) వ్యాధుల నిర్మూలనకు అవసరమైన సృజనాత్మకత(ఇన్నోవేషన్)తో కూడిన, విస్తృత స్థాయిలో అమలు చేయగలిగిన మార్గాలను సూచించడం. వివిధ పథకాల పటిష్ట సమన్వయం కోసం సాంకేతికత ఆధారంగా లక్ష్యంగా చేపట్టాల్సిన చర్యల్ని సూచించడం రాష్ట్రాన్ని జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ హెల్త్ హబ్ గా రూపొందించడం

**వచ్చే నెలలో మొదటి సమావేశం.**

డిసెంబరు మధ్యలో ఈ ఉన్నతస్థాయి అంతర్జాతీయ నిపుణుల సలహా మండలి మొదటి సమావేశం సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరుగనుంది. ఈ సమావేశంలో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యానికి సంబంధించి వివిధ అంశాలపై విస్తృత చర్చలు జరుగుతాయి. సలహా మండలి ఏడాదిలో కనీసం రెండు సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. సలహా మండలిలో సభ్యులుగా సర్ పీటర్ పయట్, యుఎన్ ఎయిడ్స్ వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్., డాక్టర్ సౌమ్య స్వామినాథన్, డబ్ల్యుహెచ్ఓ మాజీ ప్రధాన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టేవ్, డీన్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, సింగపూర్ విశ్వవిద్యాలయం, డాక్టర్ గగన్ దీప్ ఖాన్, డైరెక్టర్ , బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఛైర్మన్, ఎఐజి హాస్పిట్ హైదరాబాద్. ప్రొఫెసర్ మార్గరెట్ ఎలిజిబెత్ క్రుక్, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, డాక్టర్ నిఖిల్ టాండన్, ప్రొఫెసర్ ఎయిమ్స్ న్యూఢిల్లీ, రిజ్వాన్ కొయిట, ఛైర్మన్ నేషన్ ఎక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పటల్స్, శ్రీకాంత్ నాదముని, ఖోస్లె ల్యాబ్స్ వ్యవస్థాపకులు. మిస్ ఆర్తి అహుజా, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఉంటారు.

# కొత్త సిజెఐగా సూర్యకాంత్

>> స్వీకార కార్యక్రమం అనంతరం మాజీ సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ తాను వచ్చిన అధికారిక కారును రాష్ట్రపతి భవన్ వద్ద వదిలేసి, తన స్వంత కారులో ఇంటికెళ్లిపోయాడు. అధికారిక కారును కొత్త సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం వదిలివెళ్లినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థలో పేరుకుపోయిన కేసులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. సత్వర న్యాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేసులు భారీగా పేరుకుపోవడం సరికాదని వ్యాఖ్యానించారు. వాటిని పరిష్కరించడం తన ప్రధాన కర్తవ్యమని చెప్పారు. జిల్లా, సబ్-కోర్టుల పనితీరులో ఉన్న సవాళ్లను గుర్తించడానికి హైకోర్టులతో సంప్రదింపులు జరుపుతానని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను విచారించడానికి ఐదు, ఏడు, తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాలను నియమిస్తానని, అతి త్వరలోనే ఈప్రక్రియ పూర్తవుతుందని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కోర్టులపై భారాన్ని తగ్గించడానికి మధ్యవర్తిత్వం, ఇతర ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రాలు, కేంద్రం మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతల చేపట్టిన రోజునే 15 కేసులు విచారించి తనదైన ముద్ర వేశారు. అందరికీ సత్వర న్యాయమందించడమే లక్ష్యమని చెప్పిన మాటలకు కట్టుబడి సిజెఐ కార్యరూపంలోకి దిగారు.

**ఎవరీ జస్టిస్ సూర్యకాంత్ అంటే...**

1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో సూర్యకాంత్ ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బీహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.

# ధర్మేంద్ర ఇకలేరు

>> ఆయన సూపర్ హిట్ చిత్రాల్లో షోలే, ధరమ్ వీర్, సీతా ఔర్ గీతా, చుప్కే చుప్కే, గజబ్, దో దిశాయే, ఆంఖే, షికార్, ఆయా సావన్ ఝూమ్ కే, జీవన్ మృత్యు, మేరా గావ్ మేరా దేశ్, యాదోం కీ బారాత్ సహా మరెన్నో ఉన్నాయి. 1935 డిసెంబర్ 5వ తేదీన జన్మించిన ధర్మేంద్ర అసలు పేరు ధరమ్ సింగ్ డియోల్. సన్నీ డియోల్, బాబీ డియోల్, ఇషా డియోల్ ఆయన సంతానమే. 1960లో దిల్ బీ తేరా హమ్ బీ తేరాతో ధర్మేంద్ర నటుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆయన చివరి చిత్రం ఇక్కీస్ త్వరలో విడుదల కానుంది. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి బిజెపి ఎంపీగా గెలుపొందారు. ఆమిర్ ఖాన్, అభిషేక్ బచ్చన్ వంటి ప్రముఖులు విలే పార్లేలోని శ్మశానవాటికకు చేరుకుని ఆయనకు నివాళులు అర్పించారు. 1935లో పంజాబ్‌లో జన్మించిన ధర్మేంద్ర, 1950ల చివర్లో ఫిల్మ్‌ఫేర్ మ్యాగజైన్ నిర్వహించిన జాతీయ స్థాయి టాలెంట్ హంట్ ద్వారా వెలుగులోకి వచ్చారు. ఎందరో యువకులతో పోటీపడి విజేతగా నిలిచి, సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అందమైన రూపం, సహజమైన నటనతో అనతికాలంలోనే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. రొమాంటిక్ హీరోగా, యాక్షన్ స్టార్‌గా, కామెడీ నటుడిగా ఇలా అన్ని పాత్రలలోనూ అద్భుతంగా రాణించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచారు. తొలి సినిమాకు సంతకం చేసే సమయంలో తనకు పెద్ద మొత్తంలో అడ్వాన్స్ వస్తుందని ధర్మేంద్ర ఎంతో ఆశపడ్డారు. కనీసం 500 రూపాయలైనా ఇస్తారని ఉత్సాహంగా ఎదురుచూశారు. కానీ, నిర్మాత టి.ఎం. బిహారీ, ఆయన సహచరుడు ఠక్కర్ తమ జేబుల్లో ఉన్న డబ్బంతా తీసి కేవలం 51 రూపాయలను ఆయన చేతిలో పెట్టారు. ధర్మేంద్ర స్వయంగా 1977లో ఓ ఉర్దూ మ్యాగజైన్‌లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. వాస్తవానికి ఆయన మొదట షోలా ఔర్ షబ్నమ్ సినిమాకు సంతకం చేసినప్పటికీ, దిల్ భీ తేరా హమ్ భీ తేరేఖి ముందుగా విడుదల కావడంతో అదే ఆయన తొలి చిత్రంగా నిలిచింది. కష్టకాలంలో ఆయనకు అండగా నిలిచింది తొలి చిత్ర దర్శకుడు అర్జున్ హింగోరానీ. చేతిలో ఆ 51 రూపాయలు తప్ప ఏమీ లేని ధర్మేంద్రకు హింగోరానీ తన ఇంట్లోనే ఆశ్రయంకల్పించారు. అంతేకాదు, భోజనానికి కూడా ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత కూడా వీరి బంధం కొనసాగింది. హింగోరానీ తీసిన అనేక చిత్రాలలో, ముఖ్యంగా కె అక్షరంతో మొదలయ్యే టైటిల్స్ ఉన్న కహానీ కిస్మత్ కీ, ఖేల్ కిలాడీ కా, కాతిలోం కే కాతిల్ వంటి సినిమాల్లో ధర్మేంద్రనే హీరోగా నటించారు. కొన్ని చిత్రాల్లో ఆయన కుమారుడు సన్నీ డియోల్ కూడా నటించడం విశేషం. ఫూల్ ఔర్ పత్తర్ చిత్రంతోస్టార్‌గా ఎదిగిన ధర్మేంద్ర, షోలేలో పోషించిన వీరూ పాత్రతో చరిత్రలో నిలిచిపోయారు. చుప్కే చుప్కే తో తన కామెడీ టైమింగ్‌ను నిరూపించుకోగా, యాదోంకీ బారాత్ వంటి చిత్రాలతో యాక్షన్ హీరోగా స్థిరపడ్డారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు గానూ భారత ప్రభుత్వం ఆయన్ను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. తన నటన, నిరాడంబరతతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ధర్మేంద్ర, భౌతికంగా దూరమైనా తన సినిమాల ద్వారా ఎప్పటికీ చిరంజీవిగా నిలిచిపోతారు



సోమవారం అమృత్‌సర్‌లోని స్వర్ణాలయం వద్ద సిక్కులు 'నగర కీర్తన' చేసిన దృశ్యం

# ఆలయ అభివృద్ధికి చర్యలు

>> దీంతో పాటు ఇప్పటికే ఆర్ అండ్ బి శాఖ సహాయంతో పొంగుటూరు, లక్కవరం మధ్య గోతుల మయంగా ఉన్న రహదారికి రూ.1.5 కోట్లతో మరమ్మతులు చేయించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఈ రహదారిని పరిశీలించారు.

**30 ఎకరాల భూమి పత్రాలు ఆలయ అధికారులకు అందజేత**

శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ ృ నరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పవన్ కల్యాణ్ గత పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి భూమి ఇప్పిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 30 ఎకరాల భూ కేటాయింపుకి సంబంధించిన పత్రాలు సోమవారం పవన్ కల్యాణ్ ఆలయ అధికారులకు అందజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్‌కి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హర్షధ్వానాలతో ధన్యవాదాలు తెలియజేశారు.

**ఐ.ఎస్. జగన్నాథపురంలో మ్యాజిక్ డ్రెయిన్ పరిశీలించిన పవన్**

ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐఎస్ జగన్నాథపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు. డ్రెయిన్ నిర్మాణంలో ఎన్ని పొరలు ఉంటాయి? ఎంత లోతులో నిర్మించారు? తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న ఇంటి నుంచి ఒక బిందె నీటిని వంపి పని తీరుని పరిశీలించారు. రూ.77,173 నిర్మాణ వ్యయంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కేవలం మూడు రోజుల్లో ఈ డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేసినట్టు అధికారులు తెలియజేశారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో మురుగు నీటి నిర్వహణ మెరుగుపర్చేందుకు ఈ మ్యాజిక్ డ్రెయిన్ వ్యవస్థను తీసుకువచ్చారు. మలి విడత పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఐ.ఎస్.జగన్నాథపురంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించిన పవన్ కల్యాణ్ పని తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మిగతా గ్రామాల్లో కూడా దశలవారీగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రైతుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు: జగన్

>> పబ్లిసిటీ స్టంటే 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం అని జగన్ అభియోగించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టింగ్‌లో సిఎం చంద్రబాబు ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు.. పంటల ధరలు పతనమై దీన స్థితిలో ధరల స్థిరీకరణకు వెంటనే నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకునే చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ 18 నెలల కాలంలో 16 సార్లు ప్రకృతి విపత్తుల వల్ల రైతులు నష్టపోతే కనీసం ఒక్కసారైనా ఇన్‌పుట్ సిబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. ఉచిత పంటల బీమాను రద్దు చేశారన్నారు. తుపాను సహా ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన, బీమా పరిధిలో లేని లక్షలాది మంది రైతులకు ఏ విధంగా న్యాయం చేస్తారో చెప్పాలన్నారు. అలాగే రైతులకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలను ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. పిఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ రెండేళ్లలో రూ.40 వేలకు రైతులకు ఇచ్చింది రూ.10 వేలు మాత్రమేనని చెప్పారు. చంద్రబాబు మీ దుర్మార్గ పాలనతో రైతుల ఒంటి మీద చొక్కా కూడా లేకుండా చేసారు. ఇప్పుడు మళ్లీ వారి కాలర్ ఎగరేసేలా చేస్తామంటూ ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటు. రైతుల కష్టాలు, కన్నీళ్లు కనిపించకుండా చేసేందుకే 'రైతన్నా.. మీకోసం' పేరుతో డైవర్షన్ పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారు. గత 18 నెలల కాలంలో మీరు రైతుల కోసం ఎక్కడ, ఎప్పుడు నిలబడ్డారో చెప్పాలి" అని జగన్ నిలదీశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ మోసాలను, వంచనను, నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, చంద్రబాబు కాలర్‌తో పాటు ఆయన పార్టీ నేతల కాలర్‌ను పట్టుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని మర్చిపోవద్దని జగన్ తీవ్రంగా హెచ్చరించారు.

# నైతిక విలువల విద్య

>> నుంచే మొదలు కావాలి. తల్లిదండ్రులుగా మనపై ఉన్న పెద్ద బాధ్యత ఇది. తెలుగుభాషలో కొన్ని వాడుక పదాలు ఉన్నాయి.. గాజులు తొడుక్కున్నావా, చీర కట్టుకున్నావా, అడపిల్లలా ఏడవొద్దు అని ఎవరైనా తక్కువగా మాట్లాడితే నాకు చాలా బాధ కలిగేది. అలాంటి మాటలకు పూర్తిగా ఫుల్ స్టాప్ పెట్టాలి. అలాంటి మాటలు ఎవరు మాట్లాడినా మా లోకేష్ అన్నకు చెబుతామని చెప్పండి. మహిళలను గౌరవించినపుడే సమాజం బాగుపడుతుంది.. సినిమాల్లో, వెబ్ సీరీస్‌ల్లో మహిళలను అవమానించే డైలాగులు, సన్నివేశాలు ఉండకూడదు అని సిఎం, ఉప ముఖ్యమంత్రితో చర్చించాం" అని మంత్రి లోకేష్ వివరించారు.

**సమాజంలో మార్పు కోరుకుంటున్నా**

"విద్యాశాఖ మంత్రిగా బాధ్యత చేపట్టిన తర్వాత పాఠ్య పుస్తకాలు పరిశీలించాను. అందులో ఇంటి పనులు చేస్తున్న ఫోటోలన్నీ మహిళలవే కనిపించాయి. వెంటనే అధికారులకు ఆదేశాలు ఇచ్చి, 50-50గా మార్పు చేశాము. పనులు చేస్తున్న మగవారి ఫోటోలు కూడా 50శాతం పెట్టాం. ఇంటిపనుల కూడా ఇద్దరూ సమానంగా చేయాల్సి ఉంది. నేను అమెరికాలో చదుకునేటప్పుడు నా భార్య బ్రహ్మణి నేను ఇంటిపనులు చెరోసగం చేసేవాళ్లం. మాకు ఎలాంటి భేషజం లేదు. అలాంటి మార్పు సమాజంలో రావాలని బలంగా నమ్ముతున్నా అన్నారు.

**తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టండి**

"కెజి నుంచి పిజి వరకు కరిక్యులమ్ ప్రక్షాళన చేస్తున్నాం. అందులో ఇప్పటికే తొలి అడుగు వేశాం. పిల్లలకు అందించే బ్యాగులు, పుస్తకాలు, బెల్ట్‌లపై రాజకీయపరమైన ఆనవాళ్లు లేకుండా చేశాం. వాటిపై ఎక్కడా మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఫోటోలు లేవు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి పేరుతో విద్యార్థులకు కిట్స్ అందించాం. డొక్కా సీతమ్మగారి పేరుతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రతి శనివారాన్ని నో బ్యాగ్ డే గా ప్రకటించాం. మేము బాధ్యత గల ప్రభుత్వంగా పనిచేస్తున్నాం. ఎంతోమంది మహనీయులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నతస్థానాలకు చేరుకున్నారు. మీ అందరిలో ఆ శక్తి ఉంది. తల్లిదండ్రులు ఎంతో త్యాగం చేసి ప్రతిరూపాయి మీకోసం ఖర్చుపెడుతున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. సమాజంలో నైతిక విలువలు చాలా అవసరం అన్నారు.

**మాకు చాగంటి దిశానిర్దేశం చేయాలి**

"మాకు మార్గదర్శకత్వం ఇచ్చి నడిపించాల్సిన బాధ్యత చాగంటిపై ఉంది. 42ఏళ్ల వయసులో తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాను. దీనిని ప్రజలు నాపై పెట్టిన పవిత్రమైన బాధ్యతగా భావిస్తున్నా. మీ డైరక్షన్‌లో పనిచేయడానికి విద్యాశాఖ యంత్రాంగ యావత్తు సిద్ధంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలను అన్ని జిల్లాలు, పార్లమెంటు నియోజకవర్గాలు, అసెంబ్లీ కేంద్రాల్లో నిర్వహించాలన్నది నా ఆలోచన. కేవలం ఉపాధ్యాయులు, పిల్లలతోనే కాకుండా ప్రజలను కూడా భాగస్వాములను చేసి చైతన్యం తీసుకురావాలి.. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల సాధనలో నెం.1గా చేయాలని మేమంతా తపనతో పనిచేస్తున్నాం. నైతిక విలువలుకూడా ఉన్నపుడు ఎపి అన్నిరంగాల్లో అగ్రగామిగా తయారవుతుంది, అందుకు మీరు మాకు మార్గదర్శకత్వం వహించాలి" అని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

ఈ కార్యక్రమంలో ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ ృశా తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత అభివృద్ధికి 5 సూత్రాలు

>> గాలను మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ముఖ్యంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టామన్నారు. వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకురావడం ద్వారా రైతుల సాగును లాభసాటి చేసేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి 29వరకూ "రైతన్నా మీకోసం" పేరుతో కార్యక్రమాలు చేపడతున్నామని, డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు నిర్వహిస్తామని తెలిపారు. ఎప్పుడు ఏ కష్టం వచ్చినా రైతు నిలబడేలా, వ్యవసాయం కొనసాగించేలా ఒక వ్యవస్థ ఉండాలి. రైతుకి భరోసా ఇవ్వగల శాశ్వత పరిష్కారాన్నిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకువస్తున్నారు. ఆ నిర్ణయమే"రైతన్న మీకోసం కార్యక్రమం అని పేర్కొన్నారు.

**ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందాలి..**

రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉండటంతో, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. రైతు బలపడితేనే గ్రామం బలపడుతుంది. గ్రామం బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది. అందుకే ప్రతి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లడం మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని తెలిపారు. రైతు ఆదాయం పెంపు, ఇన్‌పుట్ వ్యయాల తగ్గింపు, పంటలకు హామీ ధర, ప్రకృతి విపత్తుల్లో రక్షణ, మార్కెట్ స్థిరీకరణ, శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తున్నట్టు మంత్రి వివరించారు. అందుబాటు లోన్లు, పంట బీమా, నీటి వనరుల మెరుగుదల, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం, రైతు సేవా కేంద్రాల బలపరచడం వంటి చర్యలు రైతు కుటుంబాల అభివృద్ధి వైపు స్పష్టమైన అడుగులని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు స్వయం సమృద్ధి సాధించే పరిస్థితులను క్రమబద్ధంగా సృష్టిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి రైతు ఇంటికి వెళ్లి పంచసూత్రాలను కనీసం 20 నిమిషాలపాటు వివరించేందుకు పెద్దస్థాయి కార్యక్రమం చేపట్టామని మంత్రి వెల్లడించారు. ఈ పంచసూత్రాలు ఏమిటి? రైతుకి ఎలా మేలు జరుగుతుంది? భవిష్యత్తులో ఎలా స్థిర ఆదాయం వస్తుంది? ఏ ఇబ్బందులు లేకుండా వ్యవసాయం ఎలా ముందుకు సాగుతుంది? అనే విషయాలు ప్రతి రైతుకు స్పష్టంగా చెప్పడం మా లక్ష్యమని తెలిపారు. నీటి పారుదల, రైతు అభివృద్ధికి మొదటి అస్త్రం అని, వ్యవసాయం చేయాలంటే ముందుగా నీరు అవసరం. నీరు లేకపోతే రైతు కష్టమే. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటి రంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నారని వివరించారు.

**యాంత్రికరణ అగ్రిటెక్ రైతు భవిష్యత్ ఆయుధం.**

వ్యవసాయంలో కూలీల ఖర్చులు పెరుగుతున్నాయని, అందుకే యాంత్రికరణ తప్పనిసరి అని మంత్రి అన్నారు. ఒకప్పుడు ట్రాక్టర్ కనిపించినా ఆశ్చర్యపోయేవాళ్లం, ఇప్పుడు ప్రతి గ్రామంలో యాంత్రికరణే ఆధారం, కోత నుండి మోత వరకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు సేవ కేంద్రాలలో అన్ని యాంత్రికరణ పరికరాలు అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని, రైతులు దీనిని వినియోగిస్తేనే లాభాలు ఎక్కువగా వస్తాయని అన్నారు. పంట పండిస్తే సరిపోదు. స్థానికంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఉంటేనే రైతుకి అసలు లాభం వస్తుందని మంత్రి చెప్పారు. అధిక దిగుబడులు వచ్చినా ధరలు రాక రైతులకి జరిగిన ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అండగా నిలిచిందని, బడ్జెట్‌లో 300 కోట్లు పెట్టినా, అవసరాన్ని బట్టి దాదాపు 1000 కోట్లు ఖర్చు చేసి రైతు పంటలు కొనుగోలు చేసామన్న విషయాన్ని జగన్ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ అభివృద్ధిపై జగన్ ఓపెన్ డిబేట్‌కు రావాలని, లేదా అసెంబ్లీకి వస్తే చర్చించుకుందామని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.

## వారం - వర్జ్యం

25-11-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
పంచమి రా.10.54
ఉత్తరాషాఢ రా.11.55,అనూరాధ కార్తె
వర్జ్యం : తె.4.11-5.53
దు.ఉ.8.32-9.17, రా.10.03-10.48
శుభసమయం : ఉ.5.30-6.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు అవసరం. కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం:** కొన్నిన మొండి బాకీలు వసూలవుతాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. సోదరుల నుండి శుభవార్తలు.

**మిథునం:** ఉద్యోగులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

**కర్కాటకం:** సున్నితమైన మనస్తత్వం కలిగిన వారితో కలిసి ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్వల్ప ధనలాభం కల్గుతుంది.

**సింహం:** పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి. సంతానమునకు నూతన విద్యావకాశాలు.

**కన్య :** బంధువర్గంతో ఏర్పడిన విభేదాలు మరింత ఇబ్బందికరంగా మారక ముందే తగు జాగ్రత్తలు పాటించండి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** ఆస్తి వివాదాలుతీరి నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఆహార, ఆరోగ్య నియమాలను పాటిస్తారు.

**ధనుస్సు:** ఉద్యోగాలలో ఎదురైనా ఒడిదుడుకులు తొలగి ఊరట చెందుతారు. ఋణ బాధలు తొలగుతాయి.

**మకరం:** ముద్రణా, ప్రచురణ వ్యాపార రంగాలలోని వారికి అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి.

**కుంభం:** విదేశాలు, విదేశీ వస్తువులు అమితంగా ఆకర్షిస్తాయి. అధిక ధనార్జనకు విదేశీయానమే మేలని భావిస్తారు.

**మీనం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. చేపట్టిన పనులు అనుకున్న విధంగా పూర్తికాగలవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఏ క్షణమైనా జాబ్ క్యాలెండర్

## విభాగాల వారీగా ఖాళీల సమాచార సేకరణ పూర్తి

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏ క్షణమైనా జాబ్ క్యాలెండర్ ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే విభాగాల వారీగా ఖాళీల సమాచారాన్ని సేకరించింది. ఆయా శాఖల్లో మంజూరైన పోస్టులు, ఖాళీలు, కాంట్రాక్టు ఉద్యోగుల పూర్తి వివరాలను సేకరించే పనిలో పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని నిధి హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయిస్తోంది. ఇప్పటికే కొన్ని విభాగాలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. మరికొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయి. ఇందులో ఖాళీల వివరాలను ఆయా విభాగాధిపతులు నిర్ధారించాల్సి ఉంది. అందిన మాచారం మేరకు అన్ని శాఖల్లో దాదాపు 30 శాతం మేర ఖాళీలు ఉన్నట్లు తెలుస్తుంది. వీటిలో కొన్ని పోస్టుల్లో కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారు. డీఆర్‌కు వచ్చే ఖాళీలు 99 వేల వరకు ఉండే అవకాశం ఉంది. మరో 24 విభాగాలు ఖాళీల వివరాలను నిర్ధారించలేదు. అలాగే ఇంకో 21 శాఖల వివరాల నమోదు ప్రాసెస్‌లో ఉంది. ఇవన్నీ పూర్తయితే మొత్తం ఖాళీల లెక్క ఓ కొలిక్కి వస్తుంది

**విభాగాల వారీగా ఖాళీల వివరాలు ఇవే..**

రెవెన్యూ శాఖలో మొత్తం 13 వేల ఖాళీలు ఉన్నాయి. ఈ శాఖలోని 4,787 ఖాళీలను అధికారులు నిర్ధారించారు. ఇందులో నేరుగా నియామకాలకు వచ్చేవి 2,552 వరకు పోస్టులు ఉన్నాయి. ఉన్నత విద్యా శాఖలో 7 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల్లో 3 వేలకు పైగా ఉన్న ఖాళీలను కోర్టు కేసులు తొలగించి భర్తీ చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఉన్న 27వేల ఖాళీల్లో 23 వేల పోస్టులను నియమించుకునే అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగంలో 4 వేలకుపైగా ఖాళీలు ఉండగా.. వీటిల్లో 2,600 పోస్టులు నియామకాలకు సిద్ధంగా ఉన్నాయి. వ్యవసాయ శాఖలో 3 వేలకు పైగా ఖాళీలుండగా.. వీటిలో డీఆర్ పోస్టులు 2,400 వరకు ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖలో 26 వేల వరకు పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. మరో మూడు వేల పోస్టులను ఇన్‌సర్వీస్ పదోన్నతులతో భర్తీ చేస్తారు. మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ విభాగంలో 2,400 ఖాళీలు ఉన్నాయి. వీటిలో 1,820 పోస్టులు భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. పాఠశాల విద్యలో బోధన, బోధనేతర అన్ని రకాల ఖాళీలు కలిపి 30 వేల వరకు ఉండొచ్చని అంచనా. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖలో 10 వేల వరకు పోస్టులు ఉండే అవకాశం ఉంది. ఇక పాఠశాల విద్య శాఖతో సహా దాదాపు 24 విభాగాల్లో ఖాళీల వివరాలను ఇంకా నిర్ధారించలేదు. వీటన్నింటి లెక్కలు తేలితే నిరుద్యోగుల ఆశలు మళ్లీ చిగురించే అవకాశం ఉంది.

# తూర్పు తీరానికి వైజాగ్‌ను ఆర్థిక ఇంజిన్‌గా మారుస్తాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతూ, దేశంలోనే అత్యంత శక్తివంతమైన తీరప్రాంత కేంద్రంగా రూపాంతరం చెందుతోందని ప్రముఖ జాతీయ ఆంగ్ల దినపత్రిక ప్రచురించిన కథనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఈ కథనంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, విశాఖ అభివృద్ధికి తమ ప్రభుత్వ లక్ష్యాలను స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వేగంగా విస్తరిస్తున్న టెక్ రంగం, ఏఎంటిజెడ్ నాయకత్వంలోని మెడ్‌టెక్ హబ్, అద్భుతమైన సహజ సౌందర్యం కలగలిపి విశాఖలో అనంతమైన అవకాశాలకు తలుపులు తెరుస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. గూగుల్ ఎఐ పెట్టుబడుల నుంచి అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌ల వరకు, హిల్‌టెక్ క్యాంపస్‌ల నుంచి కొత్త ఎయిర్‌పోర్ట్, మెట్రో రైల్ నిర్మాణం వరకు ప్రతీ అంశం వైజాగ్ ప్రగతికి నిదర్శనమని ఆయన వివరించారు.

# హైకోర్టు న్యాయమూర్తుల గ్రాట్యూటీ పరిమితి పెంపు

## రూ.20 లక్షల నుండి 25 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ

**విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రభుత్వపు కేంద్ర న్యాయశాఖ లేఖను అనుసరించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులకు గ్రాట్యూటీ పరిమితిని పెంచుతూ రాష్ట్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 1.1.2024 నుండి గ్రాట్యూటీ మొత్తాన్ని రూ.20 లక్షలునుండి రూ.25 లక్షలుకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసినట్లు మంత్రి తెలిపారు.

# ధర్మేంద్ర మృతికి పవన్ సంతాపం

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ నటులు ధర్మేంద్ర కన్నుమూశారని తెలిసి చింతించానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు ధర్మేంద్ర మృతిపై సంతాప ప్రకటన విడుదల చేసారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. హిందీ చిత్ర పరిశ్రమలో తొలి తరం యాక్షన్ హీరోగా సినీ ప్రియులను ఆకట్టుకున్నారు. అందుకే ఆయన్ని యాక్షన్ కింగ్, హీమ్యాన్ అని అభిమానంగా పిలుచుకునేవారు. షోలే, చుప్కే చుప్కే, ధర్మ్ వీర్, సీతా ఔర్ గీత, యాదోం కి బారాత్ లాంటి చిత్రాలతో నటనలో తనదైన శైలి చూపించారు. 2004 నుంచి అయిదేళ్లపాటు పార్లమెంట్ సభ్యుడిగా ప్రజా జీవితంలో ఉన్నారు. ధర్మేంద్ర గారి కుమారులు శ్రీ సన్నీ డియోల్, శ్రీ బాబి డియోల్, సతీమణి శ్రీమతి హేమమాలినికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

# అవగాహన రాహిత్యం



**ఉపయోగంలోకి రాని సొంత నెయ్యిప్లాంట్ !**
**- నిర్వహణ భారమనే రిబ్బన్ కత్తిరింపునకు దూరం!**

**ప్రభాతవార్తప్రతినిధి - తిరుమల:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి నిత్యనైవేద్యాల తయారీనుండి అన్నప్రసాదాల తయారికీ వినియోగించేందుకు అవసరమైన స్వచ్ఛమైన ఆవునెయ్యిని టిటిడినే సొంతంగా సమకూర్చుకునేందుకు ఏర్పాటుచేసిన నెయ్యిప్లాంట్ రెండున్నరేళ్ళుగా ఉపయోగంలోకి రాకపోతోంది. దాదాపు ఇరవైకోట్లరూపాయల వరకు పక్కాభవనం, అత్యాధునిక యంత్రాల కొనుగోలుకు టిటిడి నిధులు వెచ్చించింది. నెయ్యిప్లాంట్‌ను ఎప్పుడో అందుబాటులోకి తీసుకురావాలని గత టిటిడి బోర్డు పెద్దలు నిర్ణయించినా నిర్వహణకు ఆసక్తిచూపేవారే లేకపోవడంతో ఈ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. నెయ్యిప్లాంట్ భవన నిర్మాణాన్ని కూడా ఆప్కాన్స్ సంస్థ చేపట్టింది. అప్పటి బోర్డు ఇందుకు అన్ని రకాల సన్నాహాలు చేసింది. అయితే రిబ్బన్‌కత్తిరించేందుకు ముహూర్తం ఖరారుకాలేదు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ మూడుపూటలా రుచికరంగా నెయ్యితో తయారుచేసే నైవేద్యప్రసాదాలతో బాటు అన్నప్రసాదాలకు స్వచ్ఛమైన ఆవునెయ్యి వినియోగిస్తుంటారు. తిరుపతిలోని ఎస్వీ గోశాలతోబాటు తిరుమలలోని గోశాలలో దేశవాళీ గోవులు 500 వరకు ఉన్నాయి. ఇవన్నీ కూడా గతంలోనే దాతల సహకారంతో గోశాలకు చేర్చారు. వీటితో పాల ఉత్పత్తి పెరిగింది. రెండు వేల వరకు ఆవులు గోశాలలో ఉన్నాయి. ప్రతిరోజూ వీటిద్వారా దాదాపు వెయ్యిలీటర్లపైగా పాలు సేకరిస్తున్నా 700 లీటర్ల వరకు పాలు తిరుమలకు వస్తున్నాయి. అన్నప్రసాదాలతో బాటు తిరుమలలోని క్యూలైన్లు, కంపార్టు మెంట్లలో వేచివుండే భక్తులకు పాలు, టీ,కాఫీ ఈ పాలనే వాడుతూన్నారు. ఇదేగాక ప్రతి శుక్రవారం వేకువజామున మూలవిరాట్టుకు నిర్వహించే అభిషేకసేవలో స్వచ్ఛమైన దేశవాళీ గోవుల పాలనే వినియోగిస్తున్నారు. గతంలో టిటిడికి అవసరమైన ఆవునెయ్యి స్వచ్ఛమైనది రాకపోతుందనే గ్రహించిన టిటిడి అధికారులు సొంతంగా దేశవాళీ గోవుల నుండి సేకరించిన పాలద్వారా నాణ్యమైన నెయ్యిని రాబట్టాలని యోచించారు. తిరుపతిలోని టిటిడి నెయ్యిప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి రోజుకు 2వేల లీటర్లు పాలు అవసరం. దీనిద్వారా 80 కిలోల నెయ్యి తయారుచేయవచ్చునేది నిపుణుల అంచనా. రోజుకు 15వేల లీటర్లు పాలు సేకరిస్తే 650కిలోల నెయ్యి ఉత్పత్తి చేయవచ్చనే ఆలోచనతో తిరుపతిలో ప్లాంట్ నెలకొల్పడం సదుద్దేశం. కానీ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నెలకొల్పినా వినియోగంలోకి తీసుకురాలేకపోతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోని టిటిడి బోర్డు పూర్తిగా వ్యయాన్ని తగ్గించి స్వామివారి నిధులు దుబారా కాకుండా చూస్తున్నా నెయ్యిప్లాంట్‌ను అందుబాటులోకి తెస్తే ఇంకా కొంతవరకు ఖర్చులు తగ్గుతాయి. అంతేగాక స్వచ్ఛమైన ఆవునెయ్యితోనే దేవదేవునికి నైవేద్యప్రసాదాలు తయారీచేసేందుకు మార్గం సుగమమనేది టిటిడి వర్గాల సమాచారం. మరీ టిటిడి బోర్డు, అనుభవజ్ఞుడైన ఇఒ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఈ నెయ్యిప్లాంట్‌ను వినియోగించుకునేలా చూడటంలో మరింత సఫలీకృతులవుతారేమో చూడాల్సిందే.

# తిరుమల సమాచారం

## నేటి పద్మావతి అమ్మవారి పంచమీతీర్థానికి పటిష్ట ఏర్పాట్లు



**తిరుమల,నవంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామి దేవేరి తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరగా అత్యంత పవిత్రంగా జరిగే పంచమితీర్థం మహోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు పుష్కరిణిలో పుణ్యాస్నానాలా చరించేందుకు వేలాదిమంది తమిళనాడు, కర్నాటక, తిరుపతి పరిసరాల మండలాల వాసులేగాక కడప,నెల్లూరుజిల్లాల నుండి మహిళ భక్తులు సోమవారం సాయంత్రానికి తిరుచానూరుకు చేరుకున్నారు. అన్ని దారులు ముందుగా మూసివేశారు. మంగళవారం కావడం, అమ్మవారి పంచమీతీర్థం జరగనుండటంతో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడంలో అటు టిటిడి ఇటు పోలీసుయంత్రాంగం నిమగ్నమైంది. అవసరమైన క్యూలైన్లు, బారీకేడ్లు, పుష్కరిణిలోకి ప్రవేశ,నిష్క్రమణ గేట్లు, సూచికబోర్డులు తదితర చక్కటి ఏర్పాట్లుచేశారు. ఇప్పటికే భక్తులు భారీగా తిరుచానూరు శివార్లలో నిండిపోయారు. రెండువేలమందితో భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేకంగా 50 అన్నప్రసాద కౌంటర్లు, తోళప్పగార్డెన్, నవజీవన్ ఆస్పత్రి, పూడిమార్గంలో, అదనంగా మరో వందవరకు అన్నప్రసాద కౌంటర్లు సిద్ధమయ్యాయి. భక్తులను నియంత్రించి క్రమపద్ధతిలో పుష్కరిణిలోకి అనుమతించేందుకు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాలనుండి భక్తులు పుష్కరిణిలోకి చేరుకునేలా చూస్తారు. నేటి మధ్యాహ్నం 12.10గంటలకు కుంభలగ్నంలో పంచమీతీర్థం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. భక్తులు రోజంతా ఈ పుణ్యస్నానాలాచరించాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ కోరారు. కాగా నేటి ఉదయం తిరుమల శ్రీవారి నుండి పద్మావతిఅమ్మవారికి కాలినడకన సారె తీసుకురానున్నారు.

## మొదటిఘాట్‌లో మరో కారు బోల్తా
### - తమిళనాడు భక్తులకు గాయాలు



**తిరుమల,నవంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరుపతికి తిరుగుప్రయాణమైన తమిళనాడు భక్తుల కారు సోమవారం మధ్యాహ్నం మొదటిఘాట్‌లో అదుపు తప్పింది. రెండవకిలోమీటర్ మైలురాయి వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారుకు బ్రేకులు ఫెయిల్ కావడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న తమిళనాడు భక్తులు నలుగురు స్వల్పగాయాలకు గురయ్యారు. ప్రమాదం జరగడంతో కారు ఘాట్‌లో అడ్డుగా మారడంతో వాహనాలు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్,సిబ్బంది అక్కడకు చేరుకుని వాహనాన్ని తప్పించారు. ప్రమాదం జరిగిన సమయంలో వెనుక వాహనాలు రాకపోవడంతో దిగేఘాట్‌లో ప్రమాదం తప్పిందని భక్తులు తెలిపారు.

## శ్రవణం పిల్లలకు వినికిడి పరికరాలు



**తిరుమల,నవంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని శ్రవణం ప్రాజెక్టులో శిక్షణపూర్తిచేసుకున్న పిల్లలకు అవసరమైన వినికిడి పరికరాలను దాత సహకారంతో అందజేశారు. సోమవారం ఉదయం దాత తిరుపతికి చెందిన నగరం విరాట్ 20లక్షలు రూపాయలు విలువైన 105 వినికిడి యంత్రాలను టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌ద్వారా పిల్లలకు అందజేశారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ తీసుకున్న పిల్లలకు ఈ వినికిడి యంత్రాలు అందజేస్తారు. వీటిద్వారా వినికిడి లోపం లేకుండా చక్కగా ఉపయోగపడుతుందని దాత విరాట్ తెలిపారు.

# నేటి నుంచి కడప జిల్లాలో మూడు రోజుల పాటు జగన్ పర్యటన

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి కడప జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 25,26,27 తేదీల్లో అయన జిల్లాలో పర్యటన షెడ్యూలు విడుదలైంది. వ్యక్తిగత కార్యక్రమాలు,ప్రజాదర్బార్‌తో పాటు పలు కీలక ప్రైవేట్ కార్యక్రమాలలో జగన్ పాల్గొననున్నారు. పర్యటనలో భాగంగా, నవంబర్ 25వ తేదీన ఆయన మధ్యాహ్నం బెంగుళూరు నుంచి ప్రత్యేక వాహనంలో కడప జిల్లా పులివెందులకు చేరుకుంటారు. పులివెందులకు చేరుకున్న అనంతరం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు,పార్టీ కార్యకర్తలు,నాయకులతో ఆయన సమావేశమై వారి సమస్యలను,వినతులనను స్వీకరించే అవకాశం ఉంది. నవంబరు 26వ తేదీన ఆయన పూర్తి స్థాయిలో ప్రైవేట్ కార్యక్రమాలకు కేటాయించారు. ఈ రోజు ఆయన స్థానిక నాయకులకు సంబంధించిన వివాహ వేడుకకు హాజరవుతారు. దీంతో పాటు పలువురిని వ్యక్తిగతంగా లిసి మాట్లాడనున్నారు. అనంతరం, పర్యటన ముగించుకుని నవంబర్ 27వ తేదీన పులివెందుల నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరిగి బెంగుళూరుకు పయనం కానున్నారు. మూడు రోజుల పర్యటన నేపథ్యంలో, పులివెందుల లోని క్యాంప్ కార్యాలయం,పరిసర ప్రాంతాల్లో పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీగా ఏరాట్లు చేస్తున్నారు.

# ఇక స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు

## ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష



**విజయవాడ, నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టంను అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని సీఎం సూచించారు. సోమవారం సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అందిస్తున్న పౌర సేవల్ని, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి స్మార్ట్ ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న డేటా లేక్ ద్వారా సమాచార సేకరణ జరగాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలన్నారు. 25 రకాల వివరాలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలని సీఎం అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలన్నారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు , స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలని సీఎం అన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దని, పౌరులకు చెందిన అన్ని వివరాలనూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌర సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చూడాలని సీఎం సూచనలు ఇచ్చారు.

# లడ్డూ కల్తీపై పవన్ మరోసారి భావోద్వేగ స్పందన

**విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** లడ్డూ కల్తీపై పవన్ కల్యాణ్ మరోసారి బావోద్వేగంగా స్పందించారు. వారు మన నమ్మకాన్ని విచ్ఛిన్నం చేశారని భావోద్వేగంతో ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఐదేళ్ల కాలంలో సగానికి పైగా భక్తులు ఇచ్చిన లడ్డూ నెయ్యి కాని నెయ్యితో తయారు చేశారని సిట్ గుర్తించింది. ఈ అంశంపై మీడియాలో వచ్చిన కథనాన్ని షేర్ చేసిన పవన్ కల్యాణ్.. తన ఆవేదన వ్యక్తం చేసారు. మన తిరుమల కేవలం ఆలయం కాదు అది మన భక్తికి మూలం. గత ప్రభుత్వ హయాంలో (2019-24) అంచనా ప్రకారం 10.97 కోట్ల మంది మీరు.. మీ బంధువులు.. తనతో సహా అందరూ తిరుమల ఆలయానికి వెళ్లామన్నారు. ప్రతిరోజూ 60,000 మంది భక్తులు సామాన్యుడి నుండి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ప్రధాన న్యాయమూర్తితో సహా అత్యున్నత రాజ్యాంగ ప్రముఖుల వరకు వెళ్లారన్నారు. మనం ఎంతో భక్తి భావంతో వెళ్తే.. మునుపటి టిటిడి బోర్డు, అధికారులు మన హృదయాలను విచ్ఛిన్నం చేశారు అని ఆవేదన వ్యక్తం చేశారు. వారు మన భక్తికి ద్రోహం చేశారు.. ప్రతి ఒక్క భక్తుడు మోసపోయాడు. వారు నియమాలను ఉల్లంఘించలేదు మనం వారిపై ఉంచిన పవిత్ర నమ్మకాన్ని వారు విచ్ఛిన్నం చేశారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఘోరంగా కల్తీ చేసి.. మళ్లీ అందులో అది కల్తీ కాలేదు.. ఇది కల్తీ కాలేదని కబుర్లు చెబుతున్నారు.

# సిఎం చంద్రబాబు చర్యలతో వక్ఫ్ ఆస్తుల రక్షణకు మార్గం

### - రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

**సచివాలయం,నవంబర్ 24,ప్రభాతవార్త :** ఉమ్మీద్‌చట్టం అమలు ప్రారంభదశలో ముతవల్లిల నిరసన,న్యాయపరమైన అనిశ్చితి అలాగే ఉమ్మీద్ పోర్టల్లో నెలకొన్న సాంకేతిక సమస్యల వలన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 4,748రిజిస్టర్డ్,10వేలకు పైగా అన్‌రిజిస్టర్డు వక్ ్ఫఆస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియ తీవ్రంగా నెమ్మదించిందని ఏపి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.ప్రస్తుత గడువుతో వేలాది వక్ ్ఫ ఆస్తుల డేటా అప్‌లోడ్ పూర్తి చేయడం కష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు.ఈ నెమ్మ దింపుతో ముస్లీం సమాజంలో ఆందోళన పెరిగిందని తెలిపారు.ఈ మొత్తం పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు నివేదించగానే ఆలస్యం చేయకుండా ఉమ్మీద్ పోర్టల్ అప్‌లోడ్ గడువును మరో 12నెలలు పొడిగించగానే ఆలస్యం రిజిజు జీ కి లేఖ రాశారని వివరించారు. చంద్రబాబు వేగవంతమైన నిర్ణయం వక్ ్ఫ ఆస్తుల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వ స్పష్టమైన,కట్టుదిట్టమైన ధోరణిని చూపుతుందని తెలిపారు.వక్ ్ఫ ఆస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుందో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.ఏ ఒక్క ఆస్తి డేటా కూడా మిస్ కాకుండా అన్ని వివరాలను ఖచ్చితంగా నమోదు చేస్తున్నామని తెలిపారు.వక్ఫ్ ఆస్తులు ఒక తరానికి చెందినవి కాదని తరతరాలకు రక్షించాల్సిన విశ్వాస సంపదని,వాటి రక్షణ తమ కర్తవ్యమే కాదు కట్టుబాటు అని అన్నారు.మొత్తం 14వేలకు పైగా ఉన్న వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్ పూర్తి చేసి భద్రపరచడానికి వక్ ్ఫ బోర్డు సిద్ధంగా ఉందన్నారు.

# సమాజ ఉద్ధరణకు విద్య తోడ్పడాలి

## అమ్మకు చెప్పలేని పని జీవితంలో చేయకూడదు

### విలువల విద్యాసదస్సులో చాగంటి

**విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాజాన్ని ఉద్ధరించడానికి విద్య ఉపయోగపడాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారులు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో నిర్వహించిన "విలువల విద్యాసదస్సు"లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ.. విలువల విద్య గురించి ప్రవచిస్తూ నాకు ఈ కర్తవ్యాన్ని అప్పగించినప్పుడూ సిఎం చంద్రబాబు నాతో ఒక మాట అన్నారు. నైతికత అనేది కుటుంబంలో ప్రారంభం కావాలని అన్నారు. తల్లి మాట వినడం, తండ్రి మాట వినడం, అన్నదమ్ములను ప్రేమించడం ప్రారంభమైతే.. సమాజాన్ని ప్రేమించడం తనంత తానుగా అలవాటవుతుంది. ఇవాళ కుటుంబాల్లో విలువలు తగ్గిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, అవగాహన తగ్గిపోతోంది. కాబట్టి మీరు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగాలు చేసినా, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసినా కుటుంబ విలువలను దృష్టిలో పెట్టుకుని కుటుంబ విలువలు పెరగడానికి దోహదపడే విధంగా మీ ప్రవచనాలు, ప్రసంగాలు చేయాలని సిఎం చంద్రబాబు కోరారు" అని గుర్తుచేశారు. "కుటుంబం అనేది భగవంతుడు మనకు ఇచ్చిన గొప్ప వరం. తల్లి కడుపున పుడతాం. నిజానికి ఈ తల్లి కడుపున పుట్టాలి అని ఎవరూ నిర్ణయించుకోరు. తల్లి కడుపులో 9 నెలలు పెరుగుతాం. కంటికి రెప్పలా తల్లి తన పిల్లలను కాపాడుకుంటుంది. తండ్రి గొప్ప ధనవంతుడు కావొచ్చు, గొప్ప అధికారి కావొచ్చు.. కానీ పుట్టినటువంటి పసిబిడ్డ ఆకలితో ఏడుస్తుంటే.. ఆ పసిబిడ్డకు పాలు పట్టగలిగినటువంటి శక్తి అమ్మకు మాత్రమే ఉంటుంది. బిడ్డను రక్షించుకోవాలనే తాపత్రయం, తిరుగులేని ప్రేమ తల్లికి మాత్రమే ఉంటుంది. అది కేవలం మనిషిలోనే కాదు.. ప్రతి ప్రాణిలో ఉంటుంది. స్త్రీ ప్రాణి ఎక్కడున్నా బిడ్డలను కడుపులో పెంచుకోవడం, కడుపును గర్భాలయం చేయడం, కన్నబిడ్డలకు పాలిచ్చి పెద్దచేయడం, అంత ప్రేమతో స్త్రీ చేసే త్యాగం లేకపోతే సమాజం లేదు. శంకరాచార్యుల వారు అమ్మ మీద మాత్రమే ఐదు శ్లోకాలు చెప్పారు. అమ్మలాంటి ప్రాణి లోకంలో లేదు" అని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ॥అమ్మ అంటే ప్రేమైక మూర్తి. అమ్మలాంటి వ్యక్తి జీవితంలో ఇక దొరకదు. జీవితంలో అన్నిటికన్నా పెద్ద నేరం ఏమిటంటే.. అమ్మకు చెప్పలేము అన్న పని మనం చేయడమే. ఏం పని మనం చేస్తామో ఆ పని అమ్మకు చెప్పగలగాలి. అమ్మకు చెప్పలేని పని జీవితంలో మీరు ఎప్పుడూ చేయకూడదు. భగవంతుడు ఎంతో అమ్మ కూడా అంతే.

# ఆ రోజు చోరీ చేసినా చూడలేదా?

### - విజిలెన్స్‌వాళ్లకు ఎలా చిక్కాడు
### - అప్పటి పరకామణి విధుల్లోని సిబ్బందిని ప్రశ్నించిన సిఐడి

**తిరుపతి,నవంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల కానుకలు లెక్కించే తిరుమలలోని పరకామణిలో 2023 ఏప్రిల్‌లో విదేశీకరెన్సీ చోరీజరిగినా అక్కడి సిబ్బందిగా మీరు చూడలేదా, విధుల్లోని విజిలెన్స్ అధికారి ఎలా పట్టుకున్నాడనే కోణంలో సిఐడి అధికారులు అప్పటి సిబ్బందిని ప్రశ్నించినట్లు తెలిసింది. పట్టుబడిన అతను ఇలా ఎన్నిరోజులుగా ఎంతకాలంగా విలువైన విదేశీ కరెన్సీని చోరీచేసినా మీరెవరు గమనించలేదా అనే ప్రశ్నలు అడిగారని తెలుస్తోంది. అయితే వాళ్ళు విధుల్లో ఉంటే అవేమీ చూడబోమని, లెక్కింపు వరకే భక్తితో దృష్టి పెడతామని చెప్పినట్లు సమాచారం. సోమవారం తిరుపతిలో సిఐడి అదికారులు కొందరు సిబ్బందిని విచారణ చేశారు. సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీ,డిఎస్పీల బృందం వేర్వేరుగా విచారణ చేపట్టి అనేక కోణాల్లో రవికుమార్ తీరుపై సమాధానాలు రాబట్టింది.ఇప్పటికే ఈ కేసు వివాదంలో పూర్వ తిరుమల పోలీస్ అధికారులను సిఐడి విచారణ చేసింది. ఇప్పటికే రవికుమార్ వినియోగించిన సెల్‌ఫోన్‌నంబర్‌పై ,అతని కుటుంబ సభ్యుల ఫోన్‌కాల్స్‌పై, వాట్సాప్ ఛాటింగ్‌లు, ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల వివరాలు, ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన అన్ని రికార్డులను సిఐడి పరిశీలిస్తోంది.

# మరింత మెరుగైన పౌరసేవలు

### గ్రామ, వార్డు సభల ఆమోదంతోనే పనులు చేపట్టాలి : సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు24,ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలు మరింత మెరుగ్గా అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు సమర్థంగా ప్రజల్లోకి వెళ్లాలని సూచనలు జారీ చేశారు. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజామోదం మేరకే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనులు చేపట్టేలా చూడాలని.. అటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గ్రామ సభల అనుమతి లేకుండా పనులు చేపట్టవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. నరేగా పనులకూ ఇదే నిబంధన వర్తించేలా చూడాలని స్పష్టం చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమర్థంగా వివిధ అంశాలను ప్రజల ముందు ఉంచాలని సీఎం సూచించారు. ప్రభుత్వ విభాగాలు సాంకేతికతను మరింతగా అందిపుచ్చుకోవటంతో పాటు సామర్థ్యాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సుపరిపాలన లాంటి మోడల్ ఆఫ్ గవర్నెన్సు ద్వారానే ప్రజల్లో సంతృప్త స్థాయి పెరుగుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మంచి సేవలు అందించటం ద్వారానే దీనిని సాధించవచ్చని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాసంస్థల ఆమోదం తప్పనిసరి అని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) పనులకు సైతం ఇదే నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం ప్రజల్లోకి సమర్థంగా వెళ్లాలని, దీని కోసం మంత్రులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజామోదం మేరకే పనులు చేపట్టాలని, అదేవిధంగా గ్రామాల్లో గ్రామసభల అనుమతి లేకుండా ఎటువంటి పనులూ ప్రారంభించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ పథకాల అమలు నుంచి పౌరసేవల లభ్యత వరకు ప్రతి అంశంలోనూ జవాబుదారీతనం అత్యంత కీలకమని, దీనిపై నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా కపాసిటీ బిల్డింగ్‌కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

# అండర్ 14 హాకీ ఛాంపియన్లుగా కడప జట్లు - విజయవంతంగా రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్




**చంద్రగిరి, నవంబర్ 24 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 హాకీ పోటీలలో వైఎస్ఆర్ కడప జిల్లా బాలురు, బాలికలు జట్లు ఛాంపియన్లుగా సత్తా చాటుకుని రెండు ట్రోఫీలను పట్టుకుపోయారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం మూడవ రోజు జరిగిన ఫైనల్స్ లో బాలుర విభాగంలో వైఎస్ఆర్ కడప - విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో కడప జట్టు 5/1 స్కోర్‌తో ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకుని ట్రోఫీ అందుకున్నది. విశాఖపట్నం జట్టు రన్నరప్‌గా నిలిచింది. అదేవిధంగా బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప జిల్లా - అనంతపురం జట్లు పోటీ పడ్డాయి. ఇందులో కడప జట్టు 4/1 స్కోర్‌తో ఏకపక్ష విజయంతో ట్రోఫీని కైవశం చేసుకున్నది. అనంతపురం జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి హాకీ పోటీలలో విజయం సాధించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. అదేవిధంగా టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల మాట్లాడుతూ బాలికలు వివక్షను అధిగమించడానికి విజయంతో సమాధానం చెప్పాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించడానికి నేటి నుండే సాధన చేయడంపై దృష్టి సారించారు.

# అన్ని జిల్లాల్లో మైనింగ్ కార్యాలయాలు : మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మైనింగ్ కార్యాలయాలు నిర్మిస్తానని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో మైనింగ్‌లో దోచుకున్నారు...గత ప్రభుత్వంలో మైనింగ్‌పై ఆధారపడిన వాళ్ళకి ప్రతి రోజు దినదిన గండంగా గడిచింది....కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పారదర్శకంగా ముందుకు వెళ్తున్నాం. వైసీపీ ప్రభుత్వంలో బలవంతంతగా లాక్కున్న మైన్స్‌ని తిరిగి ప్రారంభించాం.ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. ఇసుక అందుబాటులో లేని ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తునా ్నం...విశాఖలో జరిగిన సమ్మిట్‌లో రికార్డు స్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. గత ఐదేళ్ళలో వచ్చిన పెట్టుబడిదారులను తరిమేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు సీఎం చంద్రబాబు నమ్మకం కల్గించారు. ప్రకాశం జిల్లాలో కూడా పెద్ద ఎత్తున అయితే,వచ్చిన పెట్టుబడులతో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోతోంది అని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం. 05/2025-26 తేది: 20.11.2025
కార్యనిర్వాహక ఇంజనీరు, పి.ఆర్.డివిజన్, మార్కాపురం పరిధిలోని 01 పనికి రూ. 10.00 లక్షలకుగాను MPLADS గ్రాంటు క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు లభ్యమగు తేది: 26.11.2025, మ.3.00 గంటల నుండి 10.12.2025 మ.3.00 గంటల వరకు లభ్యమగును. పూర్తి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, పి.ఆర్.డివిజన్, మార్కాపురం.
DIPR.NO. 18137/CL/ADVT/1/1/2022-23 తేది: 24.11.2025

VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY LIMITED
TN No :- 11/2025-2026/SGM/GM(VIWSCO) dt 24.11.2025
No. of Works = 1 Value of Work - Rs. 99.11 Lakhs
Downloading starting Date : 24-11-2025
Tender Closing Date : 02-12-2025
Further Details at http://tender.apeprocurement.gov.in
O/o GM (VIWSCO) Cell No. 8187898428
Sd/- GM (VIWSCO) Sd/- SGM (VIWSCO)

వార్త

నీతిగా జీవించడమంటే మనం మన మనసు మీద, కోర్కెల మీద అధికారం సంపాదించాలి.

-మహాత్మా గాంధీ


# సమష్టి పోరాటం కావాలి

మాదక ద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. నవ జీవనంతో ఆటలాడుకుంటున్న మాదక ద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. ఏదో ఒక రాష్ట్రం చర్యలు తీసుకుంటే ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించే అవకాశాలు కన్పించడం లేదు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణను రూపొందించి అమలు చేయగలిగితే కొంతమేరకైనా నియంత్రించవచ్చు. ఈ మాదక ద్రవ్యాల వ్యాపారం ఇప్పటికిప్పుడు ప్రారంభమైందని చెప్పడం లేదు. ఏనాటి నుంచో ఉన్నా తమ వ్యూహాలు, ప్రణాళికలు మార్చుకుంటూ ప్రపంచమంతా విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా ఈ వ్యసనం ఇరవైఏళ్లలోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవికప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్‌ద్వారా మత్తు మందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా పద్నాలుగు శాతానికి పెరిగిపోయిందని అధికార లెక్కలే వెల్లడిసున్నాయి. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. రెండు దశాబ్దాల క్రితం భారతదేశంలో కోటి డెబ్భైలక్షల మంది మత్తుమందు వాడకందార్లు ఉండగా ప్రస్తుతం పది, పన్నెండు కోట్లకుపైగా చేరుకున్నట్లు అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. మత్తుమందు వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా పదివేల కోట్ల రూపాయలకుపైగా మత్తు మందులపై ఖర్చుపెడుతున్నట్లు అంచనా. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆమాటకొస్తే భారతదేశంలో ఇదే పరిస్థితి కొనసాగితే మరో దశాబ్దం నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. నిత్యం ఎక్కడో ఒక దగ్గర మత్తుమందులు పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు చేపట్టిన భారీ ఆపరేషన్‌లో రెండువందల అరవైరెండు కోట్ల రూపాయల విలువైన మూడువందల ఇరవై ఎనిమిది కిలోల మెథాన్ పెట్టమైన్ అనే సింథటిక్ డ్రగ్ పట్టుబడింది. ఢిల్లీ శివారులోని ఒక ఫామ్‌హౌస్‌లో ఈ మాదకద్రవ్యాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మొన్న 20వ తేదీన ఎన్‌సిబి అధికారులు దాడి చేయగా కొందరు విదేశీయులు పట్టుబడ్డారు. ఆ విచారణలో ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా మంగ్రౌలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పేరు వెలుగుచూసింది. సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి నాగాలాండ్‌కు చెందిన ఒక మహిళతోసహా ఇద్దరిని అరెస్టు చేసి మరికొందరు అనుమానితులను విచారిస్తున్నారు. ఈ ముఠా వెనుక ఉన్న అసలు నేరస్తుల కోసం గాలిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇలాదేశంలో ఎక్కడో ఒకచోట నిత్యం పట్టుబడుతూనే ఉన్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవైఒక్కవేల కోట్లరూపాయల విలువైన మూడువేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింక్‌లు వెలుగులోకి వచ్చాయి. మత్తుమందు సరఫరా కోట్లడాలర్ల వ్యవహారంలో ఎక్కువభాగం ఉగ్రవాద సంస్థలకే చేరుతున్నదని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఉజ్బికిస్థాన్, మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్‌లోని మత్తు మందు సరఫరాదారులకు గట్టి సంబంధాలు ఉన్నట్లే బయటపడింది. అయితే పట్టుబడుతున్నవి పదోవంతు కూడా లేదని చెప్పొచ్చు. మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకున్నాయి. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తుమందులు ప్రపంచ నలుమూలాలకు విస్తరించడంతోపాటు రసాయనాలు తయారు చేసే యంఫెటామైన్ ట్రైప్‌స్టిమ్‌లెన్స్ ఎక్కడికక్కడ తయారవుతున్నాయి. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతోసంబంధంలేకుండా సరాసరి ఒక ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయించగలిగే 'క్రిప్టో కరెన్సీ' వాడకం సైతం పెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండా పోతున్నది. గతంలో మత్తు మందులు కొనేవారు తెలిసిన వాడకందారులు, నమ్మకం ఉన్నవ్యాపారిని సంప్రదించేవారు. మత్తుమందును తీసుకొని డబ్బును చేతిలో పెట్టేవారు. ఆ వ్యాపారం కూడా అత్యంత రహస్యంగా, మూడోకంటికి తెలియకుండా మత్తు మందు తెప్పించి అప్పగించేవారు. అయితే ఇది అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇండియాలో మారుమూల ప్రాంతంలో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వొచ్చు. మత్తు మందు రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇలా ఈ మహమ్మారి ప్రపంచమంతా విస్తరించింది. మెక్సికో కేంద్రంగా రకరకాల మార్గాల్లో అన్నిదేశాల్లో ప్రవేశిస్తున్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదక ద్రవ్యాలు రెండువేల టన్నుల వరకు ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాలను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. అందుకే ఈ మహమ్మారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడివ్యూహం రూపొందించి నిర్మూలనకు అడుగులు వేయాలి. అంతే కాదు ఈబాధ్యతంతా పాలకులపైవదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ పార్టీలు కలిసికట్టుగా కృషి చేయాల్సిన సమయమిది.

> తోటివారికి మీ వల్ల సాధ్యమైనంత హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్టు చూసుకోవడమే సరైన ప్రవర్తన.
>
> హెచ్. లాంగ్‌ఫెలో



> నీవెవరినోచూచి అనుకరించాలనుకునే కంటే నీకు నీవు సహజంగా ఉండటం ఎంతో శ్రేయోదాయకం.
>
> బెర్నార్డ్ షా



## ప్రజావాక్కు



### విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంచాలి

**భారత** విద్యావ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారింది. దేశంలో కోట్లాదిమంది విద్యార్థులు,లక్షలాదిపాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితిలో, పిల్లలలో జిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది. చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలు వల్లె వేయడంకాదు, ప్రశ్నించడం, అన్వేషించడం, వివిధ కోణాలలోఆలోచించడం అనేదృక్పథాన్నిచిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి. పాఠశాల స్థాయి నుంచే గురువులు విచారణాత్మక పద్ధతులను బోధనా ప్రక్రియలో చేర్చాలి. తరగతి గదిలో చిన్నపాటి అన్వేషణా పనులు, పరిశీలన ఆధారిత కార్యాచరణలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆలోచనాశక్తి విస్తరిస్తుంది. వారు'ఎందుకు', 'ఎలా'దీనికి కారణం ఏమిటి' వంటి ప్రశ్నలు అడగడంప్రారంభిస్తారు. ఈప్రశ్నించేగుణమే సమాజ పురోగతికివిస్తరణకు పునాది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రజాదరణ కలిగిన నాయకుడు కావాలి

**రాజకీయాలలో** శాశ్వతమిత్రులు శాశ్వతశత్రువులు ఉండరనేదిరాజకీయ సంస్కృతిలోనే కానస్తుంది. గతంలో తొమ్మిదిసార్లుబీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన నితిష్ కుమార్ అదృష్టం కలసివచ్చి పదోసారి ముఖ్యమంత్రి అయ్యారు. విశేషమేమంటే ఈయన గతంలో ప్రస్తుతప్రధాని నరేంద్ర మోడీగారితో సంబంధాలు తెంచుకున్నారు. అనేక విషయాలలో విభేదించారు. జీవితంలో బి.జె.పి.తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదన్నారు. ఒకవేళ ఈయన తన అవసరార్ధం మనసు మార్చుకుని బి.జె.పి.లోకి వస్తానన్నా రానీయమని అమిత్‌షా గారనట్టు ఎక్కడో చదివిన గుర్తు. ఈ రెండు పార్టీల నాయకులు గతాన్ని మరచారు. మరల కలసిపోయారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### హెడ్ కుక్ బాధ్యత

గురుకుల భోజనశాల బాధ్యత హెడ్‌కుక్ వహించాలి. డిప్యూటీ వార్డెన్ ఇచ్చిన సరకులను సక్రమంగా వండాలి. డైనింగ్ హాల్ బాధ్యత హెడ్‌కుక్‌కు కూడా కొంత బాధ్యత పెట్టాలి. సరుకులను బ్యాగ్‌లలో ఇంటికి తీసుకోని వెళ్తున్నారు. స్టాక్ రిజిస్టార్ బాధ్యత అన్ని హెడ్‌కుక్‌దే.

- రాపాక రవీందర్, జనగాం

### మాదకద్రవ్యం, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

**జి-20** వేదికపై భారతదేశం పిలుపు జి-20 సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన సమస్యలలో ఒకటైన మాదకద్రవ్యాల అక్రమ రవాణా-ఉగ్రవాదం అనుబంధ పై మరోసారి దృష్టిని కేంద్రీకరించాయి. నేటి సమస్యల్లో ఇది అత్యంత సంక్లిష్టమైనది. అక్రమ మాదకద్రవ్యాల వాణిజ్యంద్వారా ఉగ్రవాద సంస్థలు నిధులు సమకూర్చుకుని ఆయుధాలు కొనుగోలు చేయడం, తమ నెట్‌వర్క్‌లను విస్తరించుకోవడం ఒక బహిరంగ రహస్యంగా మారింది. ఈ నేపథ్యంలో మోడీ ప్రపంచ దేశాలు కలిసి సమగ్ర వ్యూహంతో ముందుకు సాగాలని కోరడం అత్యంత సమయోచితంగా చెప్పాలి. మాదక ద్రవ్యాల వ్యసనాన్ని కేవలం నేరంగా కాకుండా ఆరోగ్య సమస్యగాచూడాలి అనేప్రధానమంత్రి సూచనకూడా ప్రసక్తి వహించేది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### స.హ. చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

**సమాచార** హక్కు చట్టం ఎలా అమలులోకి వచ్చింది, చట్టంతో ప్రజలకు ఉపయోగపడే వివరాలను ప్రభుత్వంతెలుపాలి. సమాచారహక్కు చట్టంకింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల సమాచారం, ఉద్యోగుల విధులు, బాధ్యతలు తదితర సమాచారాన్ని తెలుసుకోవచ్చు. దేశ భద్రత, రహస్య ఇతర ఇబ్బందులు ఎదురయ్యే సమాచారం మినహా అన్నిఇవ్వాలి. ప్రతిప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలు ఉండాలి. ఎవరైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30రోజుల్లో వారికి సమాధానం ఇవ్వాలి. తెల్ల రే షన్ కార్డు ఉన్నవారికి సమాచారం ఉచితంగా ఇవ్వాలి. ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం అంతా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సమాచార కమిషనర్స్ అన్ని జిల్లాలు పర్యటించాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### పర్యవేక్షణ తప్పనిసరి

**ఇప్పటి** కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. నిద్రసరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది. కొన్నిసార్లు అనుచితమైన కంటెంట్ చూసే ప్రమాదం ఉంది. అందుకే తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వాడకాన్ని పరిమితం చేయాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# సెక్స్‌స్కాండల్ బిల్లు ట్రంప్‌ను దెబ్బతీస్తుందా?

**మన ప్రధాని మోడీ ట్రంప్‌కు మంచి స్నేహితుడిగా ఆ మధ్యకాలంలో దగ్గరయ్యారు. కానీ తర్వాత దూరం అయ్యారు. ట్రంప్ రెండవసారి గెలిచిన తర్వాత పూర్తిగా మారిపోయారు. తనకు సహకరించిన భారతీయులను అక్కడ అనేక రంగాల్లో పైకి వస్తున్న వారు అమెరికాలో అగ్రస్థానాలు వహిస్తున్నారని, చిన్నచూపు చూడటమేకా కుండా కిందికి తోసే ప్రక్రియలో చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. బహుశా ఎపిస్టెన్ సెక్స్ స్కాండల్స్ విస్తృత ప్రచారం ఆదేశంలో పొందటంతో,టారిఫ్ వ్యవహారం సాకుతో, అమెరికన్ దేశస్తులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ ఎపిస్టెన్ వ్యవహారం దృష్టి మళ్లించడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అవినీతి భాగోతాలతో పాటు లైంగిక నేరస్థులకు సహకరించే రాజకీయ నాయకులకు ఏదేశంలోనైనా ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్తారు. ప్రస్తుతం ఈ బిల్లు అందుకే రాజకీయ ప్రాముఖ్యత సంతరించుకుంటున్నది.**



రావులపాటి సీతారాం రావు

అనుకోని వృత్తాంతాలు అకస్మాత్తుగా బయటకు రావటం ఎప్పుడో గాని జరగదు. మానవ సంకల్పం వలనా, దైవ సంకల్పం వలనా, చెప్పటం కష్టం! కానీ కనపడని శక్తులు మానవ జాతిలోని బలాలనూ, బలహీనతలూ, బయటపెట్ట తలపెట్టినప్పుడు ఎవరూ ఏదీ ఆపలేరు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్నదదే! రెండవసారి అమెరికా దేశం అధ్యక్షుడిగా ఎన్నికయి తర్వాత క్లిష్ట సమస్య ఒకటి డొనాల్డ్ ట్రంప్ ఎదుర్కోవాల్సి వచ్చింది. దాదాపు ఎన్నో నెలలు, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ రాజకీయ రహస్యాన్ని యు.యస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బయటపెట్టే బిల్లు మీద సంతకం పెట్టక తప్పలేదు. కాంగ్రెసు డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డి.ఓ.జి)ను జెఫ్రీ ఎపిస్టెన్ (పేరు మోసిన ఫైనాన్షియల్ సెక్స్ అఫెండర్‌గా చేసిన నేరాల గురించి జరిపిన దర్యాప్తును బయటపెట్టమని ఆ బిల్లు ద్వారా ఆదేశించడంతో, ఆ బిల్లు పాస్ చేయడానికి ట్రంప్‌కు మరో దారి లేక సంతకం పెట్టాల్సి వచ్చింది. డెమాక్రట్స్, రిపబ్లికన్ పార్టీలోని వారు ఆయన మీద బాగా ఒత్తిడి తేవడం వల్ల ఎపిస్టెన్ సమాచారం రహస్యాల ఉదంతం బయటపెట్టే బిల్లును అందరూ ఒక్కరు తప్ప దాదాపు ఏక గ్రీవంగా ఆమోదించారు. అలాంటి స్థితిలో ప్రెసిడెంట్ ఆ బిల్లు మీద ఆమోదముద్ర వేయక తప్పింది కాదు. క్షుణ్ణంగా తయారు చేసిన అన్ని డాక్యుమెంట్లు ఎపిస్టెన్‌ను గురించి బయట పెట్టడానికి సిద్ధపడక తప్పలేదు. మైనర్ బాలిక రేప్‌తో సహా ఒక వ్యక్తి కోర్టు విచారణను ఎదుర్కోలేక ఆత్మహత్య చేసుకున్న ఉదంతంతోసహా అన్నీ డి.ఓ.డి ముప్పైయి రోజులలోపు బయట పెట్టాలన్న ఆదేశంతోపాటు వ్యక్తుల వివరాలు, అదేవిధంగా ఇబ్బంది కలిగించే విషయాలకు మినహాయింపు ఇవ్వడం కూడా జరిగింది. ఈ బిల్లు ఆమోదం వెనుక ఇంత ఆర్భాటం ఉండటానికి కారణం ఎపిస్టెన్ ట్రంప్‌కు స్నేహితుడవటం వల్లనే. ట్రంప్ ఎపిస్టెన్ నేర పూరిత వ్యవహారాలతో తనకు సంబంధం లేదని, తెలియదని, ఖండితంగా చెప్పినప్పటికిని ఒత్తిడి తగ్గలేదు. ఎన్నో రోజుల క్రిందటే తను సంబంధాలు తెగతెంపులు చేసుకున్నానని ట్రంప్ చెప్పినా ప్రజలూ, లెజిస్లేటర్లూ నమ్మలేదు. నేర పూరిత సంబంధం విషయం ఆ ఎంక్వైరీలో తేలకపోయినా, 20వేల పేజీల ఆ డాక్యుమెంట్‌లో ట్రంప్ పేరు చాలాసార్లు ఉండటం విశేషం. ఈ డాక్యుమెంట్లన్నీ ఎపిస్టెన్ ఎస్టేట్ నుంచి సేకరించినవే. లెజిస్లేచర్ సభ్యులు విడుదల చేశారు. ఎపిస్టెన్ చాలా మందిపెద్దలతో, యు.కె ఫార్మర్ ప్రిన్స్ ఆండ్ర్యూతో సహా సంబంధాలు పెట్టుకున్న విషయాలు ఈ డాక్యుమెంట్ల వల్ల బయటకు వచ్చాయి. స్టీవ్ బానన్, ట్రంప్ పూర్వసలహాదారు, హార్వర్డ్ పూర్వ ప్రెసిడెంట్ హ్యారీ సమ్మర్స్‌ను కూడా ఈ డాక్యుమెంట్లు బయటపెట్టాయి. బాధితుల వివరాలు అనేకం బయటకొచ్చాయి. అయితే ఈ బిల్లుకు ఆమోదం తెల్పుతూనేట్రంప్ మొత్తం వ్యవహారానికి ఒక పీటముడి వేశాడు. అటార్నీ జనరల్ పాంబొండితో (తమ వ్యవహారం నుంచి దృష్టి మళ్లించడానికి) ఇంకా ప్రముఖులు ఎవరెవరితో అంటే బిల్‌క్లింటన్, జె.పి మొర్గాన్, లింక్‌డిన్ ఫౌండరయిన రియిడ్ హాఫ్‌మాన్, (డెమాక్రటిక్ పార్టీలో విరాళాలు ఇచ్చే ప్రముఖుడు) ఛేజ్ బ్యాంక్ లాంటి సంస్థలు ఎపిస్టెన్‌తో ఉన్న లాలూచీల విషయాల్లో కూడా దర్యాప్తుచేసి ఫైళ్లనుబయటకు తీయాలని ఆదేశించాడు. ట్రంప్‌కు ఎపిస్టెన్ నిర్వహించే సెక్స్ వ్యవహారాలతోపాటు లైంగికపరమైన విషయాల్లో సంబంధాలున్నాయని అమెరికన్ సొసైటీ ఎంతకాదనుకున్నా నమ్ముతున్నట్లు కనపడుతున్నది. ట్రంప్‌కు సపోర్టు చేసిన మహిళలను దూరం చేయడానికి వేసిన ఎత్తుగడగా, అసలే అస్తవ్యస్తంగా ఉన్న ట్రంప్ పాలన మీద మరిన్ని నీలినీడలు ప్రసరింపచేయడానికి ఈ ఉదంతం పనికి వస్తుందని మీడియా నమ్ముతున్నది. ఇలాంటి స్కాండల్స్ అమెరికా దేశ ప్రముఖుల విషయంలో చోటు చేసుకోవడం కొత్తేమీ కాదు. వాటర్ గేట్ స్కాండల్ నిక్సన్‌ను అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు ముప్పుతిప్పలు పెట్టింది. బిల్‌క్లింటన్ వ్యవహారాలు విపరీతంగా చెడ్డపేరు తెచ్చుకోవడంతో హిల్లరీ క్లింటన్ అధ్యక్ష పదవికి రెండుసార్లు పోటీ చేసినా (రెండోసారి) 2016లో డొనాల్డ్ ట్రంప్ పైన కూడా గెలవలేకపోయింది. అమెరికాలోని ప్రజలు స్వేచ్ఛా జీవులైనా అక్రమ సంబంధాలు స్కాండల్స్‌లో ఇరుక్కున్నవారి వ్యవహారాల్లో తీవ్రంగా స్పందిస్తారు. రాజకీయాల్లో నైతిక విలువలకు కొంత ప్రాధాన్యత ఇవ్వటం, గమనించదగ్గ విషయం. ప్రపంచ దేశాల్లో క్రమేపీ రాజకీయ విలువలు అడుగంటుతున్న దాఖలాలు కనపడుతున్నాయి. భారతదేశంలో చాలా సంవత్సరాలు స్వాతంత్ర్యం సాధించిన తర్వాత మంచి నడవడిక, మచ్చ లేని జీవితాలు గడిపిన నాయకులను రాజకీయాల్లో ప్రజలు గౌరవించటమే కాకుండా ప్రలోభాలకు లొంగకుండా, శాసన సభలకూ, లోక్‌సభకూ ఎన్నుకొనే వారు. శాసన మండలిలో, రాజ్యసభలో కూడా సాహిత్య, సంగీత స్పోర్ట్స్ లలోనే కాకుండా వివిధ కళారంగాల్లో పేరు తెచ్చుకున్న వారిని నామి నేట్ చేసి గౌరవించేవారు. ఆ రోజులు కనుమరుగవుతున్నాయి. ఎక్కువగా ప్రస్తుతం వాణిజ్యంలో, వ్యాపారాలలో మునిగి తేలుతూ ఆర్థికంగా ఎదిగిన వారు ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తున్నారు. చట్ట సభలలో సభ్యత్వం, ధనసహాయంతో పొందుతున్నారు. రాజకీయ పార్టీలు కూడా ఆ రంగాల్లోని వారికి పెద్ద పీటవేస్తున్నాయి. అవినీతి రాజకీయపరంగా ఇప్పుడు పెద్ద సమస్యగా ఓటర్లూ ప్రజలూ పట్టించుకోవడం లేదు. భారత్‌లో కూడాస్కాండల్స్ మీడియా ద్వారా ప్రజల దృష్టికి వస్తున్నా, ఎందుకోగాని, ఎన్నికలలో గెలిపించడానికి ఓటర్లు సంశయించడం లేదు. బిజినెస్‌మాన్‌గా డొనాల్డ్‌ట్రంప్ అమెరికాలో అత్యున్నత స్థానానికి ఎదిగిన తర్వాతనే రాజ కీయాల్లోకి వచ్చి, రిపబ్లిక్ పార్టీలో ప్రముఖ స్థానం పొంది అనతికాలంలోనే రెండు సార్లు (వరుసగాకాదు) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మొదటి సారి ఎన్నికయినప్పుడే వ్యాపార రంగంలోని వారు, బాగా సహకారం అందించడంతో బిల్‌క్లింటన్ సతీమణి, హిల్లరీ క్లింటన్‌ను రిపబ్లిక్ కాండి డేట్‌గా ఓడించగలిగారు. అక్కడ మన యన్.ఆర్.ఐతోపాటు శాశ్వతంగా నివాసం ఏర్పరుచుకున్న భారతీయులు కూడా ట్రంప్‌కు అండదండలుగా ఉండి ఎన్నికలలో సహకరించా రు. రెండవసారి అధ్యక్షుడిగా గెలిచినప్పుడు భారతదేశ మూలాలు ఉన్న వనితను పెళ్లాడిన జె.డివాన్స్ ఉపాధ్య క్షులయ్యారు. మన ప్రధాని మోడీ ట్రంప్‌కు మంచి స్నేహి తుడిగా ఆ మధ్యకాలంలో దగ్గరయ్యారు. కానీ తర్వాత దూరం అయ్యారు. ట్రంప్ రెండవసారి గెలిచిన తర్వాత పూర్తిగా మారిపోయారు. తనకు సహకరించిన భారతీయులను అక్కడ అనేక రంగాల్లో పైకి వస్తున్న వారు అమెరికా లో అగ్రస్థానాలు వహిస్తున్నారని, చిన్నచూపు చూడటమేకా కుండా కిందికి తోసే ప్రక్రియలో చెడ్డపేరు తెచ్చుకుంటున్నా రు. బహుశా ఎపిస్టెన్ సెక్స్ స్కాండల్స్ విస్తృత ప్రచారం ఆదేశంలో పొందటంతో,టారిఫ్ వ్యవహారం సాకుతో, అమెరికన్ దేశస్తులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ ఎపిస్టెన్ వ్యవహారం దృష్టి మళ్లించడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అవినీతి భాగోతాలతో పాటు లైంగిక నేరస్థులకు సహకరించే రాజకీయ నాయకులకు ఏదేశంలోనైనా ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్తారు. ప్రస్తుతం ఈ బిల్లు అందుకే రాజకీయ ప్రాముఖ్యత సంతరించుకుంటున్నది. •



# 'స్థానిక' ఎన్నికలు యువతకు ఒక సువర్ణావకాశం

బైరబోయిన వెంకటేశ్వర్లు

ఇటీవల బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో ఆలీనగర్ నియోజకవర్గం నుండి గెలిచిన మైథిలి ఠాకూర్, బీహార్ అసెంబ్లీ చరిత్రలో అతిపిన్న వయస్కురాలిగా ఎన్నికైన శాసనసభ్యురాలుగా చరిత్ర సృష్టించింది. ఆమె గెలుపును దేశ యువత స్ఫూర్తిగా తీసుకోవాలి. ప్రపంచ దేశాలతో పోలిస్తే అత్యధిక యువత కలిగిన దేశం మనది. ఎదుగుతున్న యువతే మన దేశబలం. దేశప్రస్తుత వర్తమానం రేపటి భవిష్యత్తుయువత దేనని యువతరం గ్రహించాలి. తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ఢంకామ్రోగనుంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గెలుపు ధీమాలో అధికార, ప్రతిపక్షాలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికలు రాజకీయంగా ఎదగలనుకునే యువతకు ఒక సువర్ణావకాశం అని చెప్పవచ్చు. శాసనసభ సభ్యుల, పార్లమెంట్ సభ్యుల ఎన్నికలతో పోలిస్తే పంచాయితీ ఎన్నికలు భిన్నం. స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులకు ప్రత్యక్షంగా ప్రధాన అధికార, విపక్షాలకు సంబంధించిన పార్టీ గుర్తులు ఉండవు. ప్రధాన పార్టీలు అభ్యర్థులకు మద్దతు తెలిపిన,ఎన్నికల్లో ప్రధాన పార్టీల ప్రభావంతో పాటు ముఖ్యంగా అభ్యర్ధుల వ్యక్తిత్వ కూడా విజయావకాశాలను నిర్ణయిస్తుంది. వారసత్వపు రాజకీయాల పరంపరకు పంచాయతీ ఎన్నికలు వేదిక కావు. రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికల అవకాశాన్ని గ్రామాల్లోని యువత అందరు సద్వినియోగం చేసుకొని రాజకీయ బాటలో తొలి అడుగులు వేయాలి. యువతతో సాధ్యం కానిదంటూ ఏది లేదు. దేశ స్వాతంత్ర్యానికై బానిస సంకెళ్లు తెంచడానికి 23ఏళ్ల యుక్త వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్ వారసులమని యువత గుర్తుంచుకోవాలి. విశాలమైన స్వతంత్ర భారతంలో, శాస్త్ర సాంకేతిక, విద్య వైజ్ఞానిక ,వ్యాపార రంగలోనే కాకుండా దేశ పరిపాలనలో భాగమైన రాజకీయ రంగంలోకి యువత ప్రవేశించాలి. మారుతున్నకాలంతో పాటు అభివృద్ధి చెందిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞనాన్ని,సామాజిక మాధ్యమాలను ఉపయోగించి సుపరిపాలిన అందించే సామర్థ్యం యువతకి ఉందని చాటిచెప్పాలి. నవ సమాజ నిర్మాణం కోసం సమాజంలో మార్పుతీసుకురావడంలో యువత తనదైన శైలి చూపించాల్సిన అవసరం ఉంది. ప్రతి గ్రామపంచాయతీలో ఐదు వందల నుండి వేయికి పైగా కుటుంబాలుంటాయి. వీరిలో వ్యవసాయ,వ్యాపార,విద్య సాంకేతిక, క్రీడ, కళా రంగాల్లో ఆరితేరినవారితో పాటు పి జిలు, పి. ఎచ్.డిలు చదివిన యువతి యువకులుంటారు. వీరందరు గ్రామ ప్రథమపౌరుడిగా ఎన్నిక కావడానికి అర్హులే అని యువత భావించాలి. ఎన్నికల ఆవశ్యకత, సమర్థవంతమైన నాయకత్వపు ఎంపికల గురించి ప్రజలను చైతన్యపరచాలి. జెండాలను మోయడానికి,బ్యానర్లు కట్టడానికి, నేతలకు జై కొట్టడానికే కాకుండా యువత ప్రధాన రాజాకీయ పార్టీలమద్దతుతో లేదాస్వతంత్ర అభ్యర్థిగానైన ఎన్నికల్లో పోటీచేయాలి. ఎన్నికల్లో యువత గెలుపు అవసరం అని ఇతరులకు తెలియచేయాలి. ఉద్యోగాలలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన చట్టాలు అమలు చేయడానికేనని, చట్టాలు మార్చాలన్న, కొత్త చట్టాలు చేయాలన్న అది సాధ్యమయ్యేది రాజకీయ అధికారంతోనే అన్నది యువత గ్రహించాలి. రాజకీయంలోకి రావాలనే ఆసక్తిగల యువత తక్కువే. ఇప్పటికైనా యువత రాష్ట్రంలో జరగబోయే 12500 పైగా పంచాయతీ ఎన్నికలను ఒక రాజకీయ అవకాశంగా భావించి , ఎన్నికలలో పాల్గొని గ్రామాల్లో ప్రధాన సమస్యలైన పేదరిక నిర్మూలన, నిరుద్యోగం వంటి వాటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు ప్రవేశపెట్టిన పథకాల అమలు, గ్రామాల్లో సామాజిక ఆర్థిక అసమానతలు, బాల్య వివాహాలు,మూఢనమ్మకలు, భ్రుణహత్యల వంటి అంశాలపై యువత ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో విష సంస్కృతిల పాకుతున్న మాదక ద్రవ్యాల వ్యాప్తిని నిర్మూలనలో భాగం కావాలి. యువత రాజకీయ ప్రవేశానికి కొన్ని అవరోధాలు కూడా ఉన్నాయి. రాజకీయాల్లో చురుగ్గా ఉండాలంటే గ్రామాన్ని అంటిపెట్టుకొనే ఉండాలి. యువకులతో పోలిస్తే యువతుల భాగస్వా మ్యం చాలా తక్కువ. గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నికైన వారికి గ్రామ అభివృద్ధి పనుల్లో అన్ని అధికారాలున్న వచ్చే నెలవారీ వేతనం తక్కువ ఇది ఒకవిధంగా అవినీతికి దారితీసే అవకాశంఉంది. పంచాయతీ ఎన్నిక పదవీకాలం ఒక కారణంగా చెప్పవచ్చు. కొందరు నేతలు యువతకు డబ్బును మద్యన్ని ఆశచూపి తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ఇలాంటి ఉబిలోనుండి యువత బయటకు వచ్చి రాజకీయ శక్తిగా ఎదగాలి. సమకాలీన ఆలోచనలతోసమాజ మార్పుకోసం రాజకీయాల్లో ప్రవేశించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలి. •

# మహిళల హక్కుల పట్ల అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

ఆధునిక సమాజంలో గృహ హింసలు, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు నానాటికీ అధికం అవుతున్నాయి. అత్మనూన్యతా భావానికి లోనై స్త్రీలు ఆత్మహత్యలు చేసుకోవడం కొనసాగుతూ ఉన్నాయి. వీటిన్నింటినీ అరికట్టే ప్రయత్నంలో 1999 డిసెంబరు 17వ తేదీన ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానాన్ని చేసి, ప్రతి ఏడు నవంబరు 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసావ్యతిరేక దినంగా పాటించాలని తీర్మానించింది. అనాది నుండి అబలలుగా ముద్ర వేయబడిన ఆడవారికి అడుగు వేస్తే ఆపద, గడియ గడియకో గండం, అనుక్షణం ఆందోళన,మహిళలపై అణచివేతలు కొనసాగుతుండడం నిత్యకృత్యాలే అవుతున్నాయి. మహిళలకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించినా వాటిపై సరైన అవగాహన లేకపోవడం, కనీసం వాటి గురించి తెలియకపోవడంతో అతివలు మరింత అన్యాయాలకు గురవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నా ఆచరణలో సాధ్యం కానిపరిస్థితి.పుట్టక ముందే భ్రూణహత్యలు, పుట్టిన తర్వాత వివక్షలు, మగువల జీవితాలను నరకప్రాయం చేస్తున్నాయి. తమపై వివక్షను, వేధింపులను ఎదుర్కోవడానికి వారు ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగాభారతీయ శిక్ష స్మృతిలోని కొన్ని ప్రధాన సెక్షన్‌లు సెక్షన్ 100 ప్రకారం ఆత్మరక్షణ కోసం, ఒక వ్యక్తి మీద దాడి చేస్తే సదరు వ్యక్తి చనిపోయినా మీకు శిక్షపడదు. 166(బి) సెక్షన్ ప్రకారం బాధితురాలికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స ఇవ్వకపోతే సంబంధిత సిబ్బంది, యాజమాన్యం మీద కేసు వేయవచ్చు. 228(ఏ) సెక్షన్ ద్వారా లైంగిక దాడికి గురైన మహిళ అనుమతి లేకుండా మీడియాలో ఆమె పేరు, ఫొటోలు ప్రచురించ కూడదు. అలా చేసిన పక్షంలో సదరుసంస్థపై చర్యలు తీసుకోవచ్చు. 354సెక్షన్ ప్రకారం స్త్రీ శరీరాన్ని లైంగిక ఉద్దేశంతో చూసినా, తాకినా, అవమాన పర్చినా, అనుమతి లేకుండా ఫొటో, వీడియో తీసినా ఈ సెక్షన్ కింద ఫిర్యాదు చేయవచ్చు. 376 సెక్షన్ కింద మహిళల అనుమతి లేకుండా సెక్సులో పాల్గొంటే అది అత్యాచారంగా భావించి అది చట్టరీత్యా నేరం అవుతుంది. ఒకవేళ మైనర్ బాలిక ఆమె ఇష్టప్రకారమే చేసినా పురుషుడికి పోక్సోచట్టం క్రింద సుమారు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష. భార్యఉండగా, మరో పెళ్లి చేసుకుంటే 494 సెక్షన్ ప్రకారం అతని మీద కేసు నమోదు చేయవచ్చు. కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్షపడుతుంది. 498(ఏ) సెక్షన్ ఓ వివాహితను ఆమె భర్తకానీ, భర్త బంధువులు కానీ అదనపు కట్నంకింద



ధన, వస్తు, ఆభరణాలు అడిగితే ఈ సెక్షన్ ప్రకారం శిక్షార్హులు. గృహినులను శారీరకంగా, మానసికంగా,హింసించినా, అందుకు ప్రేరేపించినా, ప్రోత్సహించినా గృహ హింసా చట్టం కింద కేసు వేయవచ్చు. కనీసం మూడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించబడుతుంది. 509 సెక్షన్ మహిళలతో అవమానంగా మాట్లాడినా, సైగలు చేసినా, అసభ్యకర వస్తువులను ప్రదర్శించినా ఈ చట్టం ప్రకారం శిక్షకుఅర్హులు. ఒంటరిగా ఉన్నప్పుడు అసభ్యకరంగా పాటలు పాడుతూ, శబ్దాలు చేస్తూ ఎవరైనా ఇబ్బంది పెడితే సెక్షన్ 294 ప్రకారం వారిపై ఫిర్యాదు చేయవచ్చు. కనీసం మూడు నెలలకు తగ్గకుండా వారికి జైలుశిక్ష, లేదా కొంత జరిమానా వేయవచ్చు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా మహిళను వెక్కిరించినా, అనుకరించినా, వారిపై సెక్షన్ 354(డీ) ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్షపడే అవకాశముంది. పనిచేసే ప్రదేశాల్లోతోటి ఉద్యోగులు గానీ, బాస్ గానీ ఆఫీసు పనుల్లో అలుసుగా తీసుకొని సెక్సువల్ కాంటాక్ట్ కోసం ఇబ్బంది పెడితే 2013 వేధింపుల చట్టం ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. ఒకరి ఫొటోను మార్ఫింగ్ చేసి వారి శరీరాలకు ముఖాన్ని అతికించి ఇబ్బంది కరంగా ఇంటర్నెట్‌లో షేర్ చేస్తున్న సంఘటనలలో సెక్షన్ 499 ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షపడవచ్చు. ఒక మహిళను దౌర్జన్యంగా,బల ప్రయోగం వల్ల తన శరీరంపై ఉన్న దుస్తులను తీసివేసినా, ఆ వ్యక్తికి సెక్షన్ 354(బీ) ప్రకారం 3నుండి7 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. 13/2013 సవరణల చట్టం ద్వారా ఈ సెక్షన్ అదనంగా చేర్చబడింది. ఒక మహిళ, విద్యార్థినికి సంబంధించిన రహస్య వ్యక్తిగత ఫొటోలు తీయడం, వీడియోలు తీసి వాటిని ఇతరులకు పంపించినా 354(సీ) సెక్షన్ కింద ఏడాదినుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. వ్యభిచారానికి, 18 ఏళ్లలోపు బాలికను కొనుగోలు చేసినా సెక్షన్ 373 ప్రకారం పదేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు జరిమానా విధిస్తారు. బాలికను వ్యభిచారానికి మారేందుకు ప్రోత్సహించినా, ప్రలోభ పెట్టినా సెక్షన్ 366(ఏ) కింద పదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించబడుతుంది. నిండు గర్భిణిని చంపాలనే ఉద్దేశంతో చేపట్టిన ఒకచర్య పర్యవసానంగా ఆమె చనిపోతే నేరస్థుడిపై సెక్షన్316 ప్రకారం ప్రాణహరణం కింద, నేరం మోపబడుతుంది. ఆమె మరణించడానికి బదులుగా గర్భంలోని శిశువు మరణిస్తే 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఒక బృందంలోని సభ్యులు ఒక మహిళపై లైంగిక దాడిచేసిన సందర్భాల్లోనూ వారిలో ప్రతివ్యక్తి నేరానికి పాల్పడినట్లే పరిగణించబడుతుంది. సెక్షన్ 376బీ కింద ప్రతి ఒక్కరికీ 20 ఏళ్లు తగ్గకుండా జీవితఖైదు శిక్షవిధిస్తారు. 13/2013 సవరణ చట్టం ద్వారా ఈ సెక్షన్ సవరించబడింది. స్త్రీ, బాలికను గానీ తన ఇష్టానికి వ్యతిరేకంగా ఓ వ్యక్తిని వివాహం చేసుకునేందుకు బలవంతంగా అంగీకరించాలని ఒత్తిడి తేవడం, ఆస్త్రీని అపహరిస్తే బలవంతంగా వివాహం చేసుకునే సెక్షన్ 366 కింద పదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా పడుతుంది. ఇలాంటి చట్టాల ఎన్నో గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలి. అలాగే సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ స్త్రీల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలి. సాటి మనుషులుగా మహిళలకు సామాజిక బాధ్యతగా సహకరించాలి. •

Main tab page 111_Main tab page 111.qxd 11/24/2025 11:52 PM Page 1



## విడిపోతామని వాళ్లు.. వీడనివ్వని వీళ్లు..!

- పోలీసులను ఆశ్రయిస్తున్న యువజంటలు
- కౌన్సెలింగ్‌లో వారిలో మార్పు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రేమ వివాహాలు పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు ఏవైనా సరే మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతున్నాయి. ఏడడుగులు నడిచి కలిసిమెలిసి ఉంటామని అగ్ని సాక్షిగా ఒకటవుతున్న వారు ఆదిలోనే బంధాన్ని తెంచ్చుకుంటున్నారు. తన ఈగోను హర్ట్ చేసిందని యువకుడు, తన మాటకు మర్యాద ఇవ్వలేదని యువతి, పంతంతో పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. మహిళా పోలీసు స్టేషన్, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి జంటలు విడిపోకుండా చూస్తున్నారు. నగరానికి చెందిన ఓ యువతి బాపట్లకు చెందిన ఒక వ్యక్తితో వివాహమైంది. పెద్దలు కుదిర్చిన వివాహం. అంగరంగ వైభవంగా చేశారు. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో కొన్నాళ్లు బెంగుళూరులో, మరికొన్నాళ్లు హైదరాబాద్‌లోనే కాపురం పెట్టారు. ఏమి జరిగిందో ఏమో తెలియదు కాని విడాకులు కావాలని స్టేషన్ మెట్లు ఎక్కారు. పోలీసులు నాలుగైదు సార్లు కౌన్సెలింగ్ ఇచ్చి ఒకటి చేశారు. అయినా వారు ఒకటి కాలేకపోయారు. వివిధ స్టేషన్లకు భార్య భర్తల నుంచి మూడు నాలుగు ఫిర్యాదుల వంతున నెలకు దాదాపు వందకు పైగా వస్తుంటాయి. వాటిలో కేసులు నమోదు అయ్యేది కేవలం 10 శాతమే. మిగిలిన వాటిలో పోలీసులు కౌన్సెలింగ్ ఇఇచ్చి భార్యా భర్తలను ఒకటిగా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కు పైగా పోలీసు స్టేషన్‌లు ఉండగా ఒంగోలు నగరంలో 3, ఒకటి మహిళా పోలీసు స్టేషన్ ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లోనూ భార్యాభర్తల ఫిర్యాదు వస్తూ ఉన్నాయి. వచ్చిన వాటిని నగరంలోని మహిళా పోలీసు స్టేషన్‌కు ప్రతిపాదిస్తుంటారు. వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తూ వివాహ బంధం విశిష్టత, బంధాలు, బంధుత్వాలు గురించి తెలియజేస్తున్నారు. ఒకటి, రెండు, మూడు చివరకు నాలుగో సారి కూడా ఇస్తూ జంట విడిపోకుండా ఉండేందుకు కృషి చేస్తున్నారు. వారిలో మార్పు రాకుంటే కోర్టులో దరఖాస్తులు చేసుకోవాలంటూ సలహాలు ఇస్తుంటారు. లేకుంటే కేసులు నమోదు చేస్తున్నారు. ప్రతి నెలలో ఒక స్టేషన్‌కు సుమారు 8 నుంచి 10 కేసులు భార్యా భర్తల ఫిర్యాదులే ఉంటున్నాయి. చిన్న పాటి గొడవలతో ఈగో దెబ్బతింటున్నట్లు స్టేషన్‌కు వస్తున్నారు. ప్రేమ వివాహం అయినా, పెద్దలు కుదిర్చినది అయినా సరే ఈ జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు పోలీసులు. చివరకు రాజీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు పోలీసులు.

## సీసీఎస్ నుంచి ఇద్దరు పాత నేరగాళ్లు పరారీ

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని కేంద్ర నేర పరిశోధన స్టేషన్ నుంచి సినిమా ఫక్కీలో ఇద్దరు పాత నేరగాళ్లు పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒంగోలుకు చెందిన వీరు గత కొంత కాలంగా ద్విచక్ర వాహనాలు, దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. గంజాయి కేసులను వీరి ప్రమేయం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సీసీఎస్ స్టేషన్‌లో ఉంచి విచారిస్తున్నారు.ఆదివారం ఉదయం వీరిద్దరు పోలీసుల కళ్లుకప్పి స్టేషన్ నుంచి పరారైనట్లు తెలిసింది. స్టేషన్ కింది అంతస్తులోని లాకప్‌లో వీరిని నిర్భందించారు. లాకప్ తాళాలను సమీపంలోనే ఉంచారు. విధి నిర్వహణలో ఉన్న సెంట్రి బయటకు వెళ్లిన సమయంలో వీరిద్దరూ లాకప్‌తాళాలను చాకచక్యంగా తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఈ విషయాన్ని సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. పరారైన నిందితుల్లో నాగూర్‌తో పాటు లస్కర్ అనే ఇద్దరు ముద్దాయిలను పోలీసులు, ఐడీ పార్టీ వారు గాలింపు చర్యలు చేపట్టారు. వీరిలో నాగూర్ గతంలో పలు దొంగతనాలు, దోపిడీల కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇరువురు కలిసి ఇటీవల ఐదు మోటారు సైకిళ్లను దొంగిలించినట్లు తెలిసింది.

## రైతును రాజుగా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

**కొండేపి, ప్రభాతవార్త**



రైతును రాజుగా చేయాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందని కొండేపి వ్యవసాయ అధికారి ఎం మాల్యాద్రి రైతులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం ఈనెల 24 నుండి 29 వరకు జరుగుతున్న నేపథ్యంలో తొలిరోజు మండలంలోని మండలంలోని వెన్నూరు కే ఉప్పలపాడు సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు ప్రణాళికలను వారికి వివరించారు. నీటి భద్రత ద్వారా ద్వారా ప్రతి ఎకరా ఎకరా భూములకు నీరు పుష్కలంగా అందించటం పంటల మార్పిడి ద్వారా డిమాండ్ ఉన్న పంటలను పండించడం చిరుధాన్యాల సాగు పెంచడం పంటల విస్తీర్ణం తెలుసుకోవడానికి, పంటల ఆరోగ్య పరిస్థితిలు అంచనా వేయడానికి టెక్నాలజీ ను వాడుకుందాం. రైతన్నల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలి అని రైతన్నలకు పెట్టుబడి సాయం కింద రెండు విడతల్లో 14వేల రూపాయలు రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం. అదేవిధంగా ప్రతి గ్రామంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల సిబ్బంది ఈ నెల 24 నుంచి 29 వరకు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఓపి కుమార్, గ్రామరైతులు పాల్గొన్నారు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**సీఎస్‌పురం, నవంబర్ 24, ప్రభాతవార్త**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ రైతు సంక్షేమ దిశగా ప్రభుత్వం పని చేస్తుందని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం ముఖ్యంగా అన్నదాత సుఖీభవ రెండు విడతల ప్రయోజనాల గురించి లబ్దిదారులకు రైతన్నలకు వివరించారు. అన్నదాతల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసం ఈ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, పామూరు సింగిల్ విండో చైర్మన్ హరిబాబు, సీఎస్‌పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, బొర్రాజు శ్రీనివాసులు(లాయర్), ఉప్పలపాటి గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇసుకపల్లి తిరుపతయ్య, లక్ష్మణ్, పెద్దన్న, చాందు, పులి రాజశేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

- మంత్రి స్వామికి వినతి

**టంగుటూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**



అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ.20 ఇవ్వాలని, భూ యజమాని సంతకం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ మంత్రి స్వామికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగంలో 2 లక్షల మంది కౌలు రైతులు పంటలు పండిస్తున్నారని, భూ యజమానులకు ముందే కౌలు చెల్లించి, పెట్టుబడులను కూడా కౌలు రైతులే డబ్బులు సమకూర్చుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి కౌలు దారుడికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సాల్మన్, వి.మోజెస్, కే.రమేష్ పాల్గొన్నారు.

## కోవిలంపాడులో పీఎం ఆవాస్ యోజన సర్వే పరిశీలన

**సీఎస్‌పురం, నవంబర్ 24, ప్రభాతవార్త**



మండలంలోని కోవిలంపాడు పంచాయతీలో జరుగుతున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం సర్వేను సోమవారం ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేద కుటుంబాలను గుర్తించి గృహ నిర్మాణం కోసం ప్రభుత్వ పథకం కింద అర్హులను ఎంపిక చేయడం లక్ష్యమని తెలిపారు. సర్వేలో ఇల్లులేని కుటుంబాలు లబ్దిదారులుగా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్దిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేసి ప్రభుత్వం వద్దకు పంపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన వారంతా గ్రామ సచివాలయం సిబ్బంది లేదా గృహ నిర్మాణ శాఖ సిబ్బందిని సంప్రదించి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఫోటో, మొబైల్ నెంబర్ సమర్పించి సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ శివారెడ్డి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ చిరంజీవి, కాలువ నరసయ్య, సందలూరి బాలకాశయ్య, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి - కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రభుత్వ సర్వీసులో చేరిన వారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట పరిహారం, కారుణ్య కోటా కింద ఉద్యోగాలు పొందిన ఇద్దరికి సోమవారం గ్రీవెన్స్ హాల్‌లో ఆయన నియామక పత్రాలను అందించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులో బాధితుడు మాగులూరి రవికుమార్ చనిపోవడంతో అతని భార్య సలోమికి రోడ్లు, భవనాల శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న గురవయ్య చనిపోవడంతో ఆయన కుమారుడు భార్గవ్‌కు ఉద్యోగాలు లభించాయి. విధుల నిర్వహణలో నైపుణ్యం పెంచుకుని ఉన్నత స్థానాలకు ఎదిగేలా పని చేయాలని వీరికి కలెక్టర్ సూచించారు.

# వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- *అర్హులైన ప్రతీరైతుకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలి*
- *అన్నదాత సుఖీభవ ద్వారా 46.85 లక్షల మందికి పెట్టుబడి సాయం*
- *ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్*

**అద్దంకి, ప్రభాతవార్త**





వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతన్న సేవలో మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ఇందులో భాగంగా అద్దంకి నియోజకవర్గంలోని రైతులతో మంత్రి గొట్టిపాటి సమావేశం అయ్యారు. ఇటీవల విడుదల చేసిన అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏటా రైతుల అకౌంట్లలో విడతల వారీగా రూ.20 వేలు జమ చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పథకం అమలుకు ఏటా ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని అన్నారు. ఇనాం భూములు ఉన్న రైతులకు గత ప్రభుత్వం రూ.7 వేలు ఇచ్చిందని.. కానీ కూటమి ప్రభుత్వం వారి ఖాతాల్లో రూ.14 వేలు జమ చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ అద్దంకి మండలం నాగులపాడు గ్రామంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 37 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. అనేక సంస్థల సహకారంతో ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యను ప్రోత్సహించే దిశగా దాతలు ముందుకొచ్చి సైకిళ్లను అందించడం అభినందించదగిన విషయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు దూరం కాకుండా, తరగతులకు గైర్హాజరు కాకుండా ఉండేందుకు, డ్రాపౌట్ల సంఖ్య తగ్గించేందుకు సీఎస్ఆర్ నిధుల సహాయంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నామని ఆయన చెప్పారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 5 వేలకు పైగా విద్యార్థులకు ఇప్పటి వరకు సైకిళ్లను ఉచితంగా అందించామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఇందులో అద్దంకి జూనియర్ కళాశాల విద్యార్థుల కూడా ఉన్నారని గుర్తు చేశారు. కమ్యూనిటీ హాలు ప్రారంభంఅనంతరం నాగులపాడు గ్రామంలో రూ.30 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. స్థానికులకు అంకితం ఇచ్చారు. గ్రామ ప్రజల సామూహిక అవసరాలను తీర్చే వేదికగా ఈ కమ్యూనిటీ హాల్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించిన మంత్రి. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




# ప్రజల సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత







**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రజల సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో గడువు లోగా నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, జాన్సన్, విజయ జ్యోతి, కళావతిలతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా

**- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో గడువులోగా నాణ్యతతో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా పలువురు అర్జీ దారులతో మాట్లాడి అర్జీ పరిష్కారం విధానం గురించి వారి స్పందన తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను నిర్ణీత గడువు లోపు చిత్తశుద్ధితో పరిష్కరించడంతో పాటు దరఖాస్తులు మరలా రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రతి కార్యాలయంలో ఒక నోడల్ అధికారిణి నియమించడం జరిగిందని, సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడమే కాక, వారి సమస్యను సావధానంగా విని నిబంధనల మేరకు, సానుకూల విధానంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమస్య పరిష్కారం అయిన తరువాత పరిష్కార వధానం, దరఖాస్తుదారుల సంతృప్తి చెందారా.. లేదా అన్న విషయాన్నీ అధికారులు స్వయంగా ఫోన్ చేసి తెలుసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ సేవలపై ప్రజలకు అనుకూల అభిప్రాయం ఏర్పడుతుం దన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అధ్యక్షా.. నాకొక అవకాశం..నాదో విన్నపం

- *అజెండాతో మాక్ ఎమ్మెల్యేలు*
- *మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి తొమ్మిది మంది విద్యార్థులు ఎంపిక*
- *విజయవాడలో నేడు, రేపు శిక్షణ*

**ఒంగోలు, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న శాసనసభలో జరిగే మాక్ అసెంబ్లీలో ప్రజావాణిని వినిపించేందుకు మాక్ ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. పాఠశాల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నిర్వహించిన ప్రతిభా, పాటవ పోటీల్లో సత్తా చాటిన వీరిని నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఎంపిక చేశారు. మరొకరిని మార్షల్‌గా ఎంపిక చేశారు. ఇప్పటికే అమరావతికి చేరుకున్న వీరు నేడు, రేపు ప్రత్యేక తర్ఫీదు చేసుకుని 26న మాక్ అసెంబ్లీకి హాజరు కానున్నారు. రాష్ట్రంలో 175నియోజకవర్గాల నుంచి ప్రాథమికంగా ముగ్గురేసి చొప్పున ఎంపిక చేసి రాష్ట్ర విద్యాశాఖకు వివరాలు పంపగా, వారిలో ఒకరి చొప్పున ఎంపిక చేశారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 8 మందితో పాటు మార్షల్ పాత్రకు ఒకరిని ఎంపిక చేశారు. వీరందరిని ఈవో ఏ.కిరణ్ కుమార్, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడలోని లయోలా కళాశాలకు ఆదివారం ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. వీరితో పాటు ఎస్కార్ట్‌గా ఇద్దరు పాఠశాల ఉపాధ్యాయులు బయలుదేరి వెళ్లారు. మాక్ అసెంబ్లీ తిలకించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఎంపికైన విద్యార్థులకు సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇస్తారు. స్పీకర్, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు, ఎమ్మెల్యేలుగా ఎవరు నటించాలనేది శిక్షణ అనంతరం ఎంపిక చేశారు. జిల్లాలో ఎంపికైన వారు వీరే. దర్శి మహ్మద్ ఫరూక్(9వ తరగతి), నాగంబొట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, వైపాలెం ఎం.నవదీప్(10వ తరగతి) త్రిపురాంతకం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గం పరిధిలోని ఎన్.శ్రీను(పదో తరగతి) చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వి.లక్ష్మీ పూజిత(10వ తరగతి) కొత్తపట్నం ప్రభుత్వ పాఠశాల, ఎం.పవన్ కుమార్ (10వ తరగతి) జరుగుమల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఎం.రమ్యశ్రీ(9వ తరగతి) గిద్దలూరు ఉన్నత పాఠశాల, రవి జితేంద్ర(9వ తరగతి) వెలిగండ్ల జడ్పీఉన్నత పాఠశాల, జి.వర్షిత(9వ తరగతి) కలుజువ్వలపాడు జడ్పీ ఉన్నతపాఠశాల, మాస్టర్‌గా కే.నాగరాజు(10వ తరగతి) గణపవరం ఏపీ గురుకుల పాఠశాల వీరందరిని ఎంపిక చేశారు. జిల్లాలోని నియోజకవర్గ పరిధిలో సమస్యలను విద్యార్థినీ, విద్యార్థులు మాక్ అసెంబ్లీలో వివరించనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో చాలా చోట్ల సరైన క్రీడామైదానం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటి అభివృద్ధి, క్రీడల కోర్టుల ఏర్పాటు ఆవశ్యకతను సభలో ప్రస్తావించనున్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలను కూడా సభ దృష్టికి విద్యార్థులు తీసుకురానున్నారు. ఈ మాక్ అసెంబ్లీకి వెళ్లే అవకాశం లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారత రాజ్యాంగం ఆవశ్యకత, గొప్పతనం గురించి, వసతి గృహాల్లో




విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సౌకర్యాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై వీరు చర్చించనున్నారు. పేద విద్యార్థుల చదువు నిమిత్తం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో అసెంబ్లీలో ప్రభుత్వానికి విద్యార్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇస్తామన్నారు. చదువు పూర్తయిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉండడంతో చెడు వ్యసనాల బాట పడుతున్నారు. వాటి కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి అసెంబ్లీలో మాట్లాడుతామన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు

**టంగుటూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

టంగుటూరు పొగాకుబోర్డు ఆవరణలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాస రావు పొగాకు రైతులతో సమావేశమై 2025-26 పంట కాలానికి పొగాకు పంట నియంత్రణ మీద నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశీయంగా, విదేశాలలో ఎఫ్‌సీవీ పొగాకుకు గల గిరాకీని, నిల్వలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 పంట కాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించడం జరిగిందన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం నుండి అమలయ్యే సబ్సిడీల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కాశీ విశ్వనాథ్, యుగంధర్‌రెడ్డి, టంగుటూరు పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షులు పోతుల నరసింహారావు, ఐటీసీ, జీపీఐ పోలిశెట్టి కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**- మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు**



**సీఎస్‌పురం, నవంబర్ 24, ప్రభాతవార్త**

ఎన్నికల ముందు సూపర్ సిక్స్, పలు రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు, ఆయా హామీలు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని కదిరి బాబురావు అన్నారు. సోమవారం శీలంవారిపల్లిలోని కదిరి క్యాంపు కార్యాలయంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో హామీలు అమలు చేస్తామని బాండ్లపై సంతకాలు చేసి మహిళలకు, నిరుద్యోగ యువతీ యువకులకు, రైతులకు, ప్రజలను మోసం చేశారని అన్నారు. అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు ఫీజు రియింబర్స్ మెంట్, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు పలు రకాల పథకాలు సరిగా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. అదే విధంగా వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందని అన్నారు. వైద్య విద్య చదవాలనుకునే పేద విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారం కాశిరెడ్డి, షేక్ అహ్మద్, నున్నా నారాయణ, అన్నంగి కన్నయ్య, జామకాల మాధవరావు, గంజరపల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా నిలుస్తున్న ఎస్సీ కమీషన్ చైర్మన్ కేఎస్ జవహర్

**- జవహర్‌కు అభినందనలు తెలియజేసిన ఎంఎస్‌పీఎస్**



**నాగులుప్పలపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**

చీమకుర్తి మండలంల బండ్లమూడి మాదిగలపై ఈనెల 3వ తేదీన ఆ గ్రామానికి చెందిన అగ్రకులాల రెడ్లు దాడి చేసిన సంగతి విధితమే. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ కే.జవహర్ బండ్లమూడి మాదిగ పల్లెని సందర్శించి, బాధితులకు అండగా ఉంటానని తెలియజేయడం పట్ల, సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ తెలియజేశారు. ఈ ఘటనపై మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో మొట్టమొదటగా స్పందించి, ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, చీమకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి ఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు, దాడి కేసు నమోదు చేయాలని కోరడం, అనంతరం జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్‌రాజును కలిసి, ఆ ఘటనపై తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని, అదే విధంగా వారికి అన్ని రకాలుగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశామన్నారు. గత మంగళవారం 18వ తేదీ విజయవాడలో ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్‌ని కలవడం వారు బండ్లమూడి, బాధితులను సందర్శిస్తానని తెలియజేయడం జరిగింది. ఆ రోజు చెప్పిన విధంగా సోమవారం చీమకుర్తి మండలం బండ్లమూడి మాదిగపల్లెకి వచ్చి బాధితులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, నిందితులను అరెస్టు చేయడం జరిగిందని, ప్రభుత్వ పరంగా రక్షణ చర్యలతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపడతానని వారికి హామీ ఇవ్వడం పట్ల, ఎస్సీ కమీషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ని ఒంగోలులో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ ఆధ్వర్యంలో శాలువా కప్పి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీఎస్ ప్రతినిధులు గద్దె త్యాగరాజు, కొలకలూరి విజయ్ కుమార్, తేళ్ల జయరాజ్, పొగడ్త నారాయణ, సురేష్, ఇమ్మానియేలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- టీడీపీ కన్వీనర్ పోట్ల గోవింద్**



**పుల్లలచెరువు, నవంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని ఐటీ వరంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు మండల టీడీపీ కన్వీనర్ పోట్ల గోవింద్, ముటుకుల సొసైటీ చైర్మన్‌పావులూరి యోగేశ్వరరావు లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నదాత- సుఖీబవ అమలుపై పోట్ల గోవిందు మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర -2047కు అనుగుణంగా మన రాష్ట్ర ప్రగతిని ముందుకు నడిపేందుకు 2047 నాటికి రైతుల తలసరి ఆదాయం 55 లక్షల రూపాయలకు పెంచాలని ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అన్నదాత సుఖీభవ అమలు పట్ల రైతాంగం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# స్వామిత్వపై గ్రామసభలు నిర్వహించాలి

**- ఎంపీడీవో సంజీవరావు**



**పుల్లలచెరువు, నవంబర్ 24, ప్రభాతవార్త**

స్వామిత్వ సర్వేపై గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో సంజీవరావు సోమవారం తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్ రూపొందించినట్లుగా తెలిపారు.ఈనెల 26న మానేపల్లి, అయ్యగానిపల్లి, కొమరోలు, 27న కవలకుంట్ల, మల్లాపాలెం, నరజాముల తండా, 28న ఐటీవరం, ముటుకుల,29న సుద్దకురవ తండా,శతకోడు, డిసెంబర్ 2న పిడికిటివానిపల్లి, నాయుడుపాలెం,3న పెద్ద పీఆర్సీ, ఎండ్రపల్లి, 4న పుల్లలచెరువులో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. గ్రామసభలను డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజనల్ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు.అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని పంచాయతీ సెక్రటరీలను ఆయన ఆదేశించారు.

# రైతన్న మీ కోసం



**దర్శి, నవంబర్ 24, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా రైతన్న మీ కోసం కార్యక్రమం వ్యవసాయ అనుబంధ శాఖల గ్రామ స్థాయి సిబ్బందిచే ఇంటికి సుస్థిర వ్యవసాయం కొరకు 5 అంశాలపై రైతుకు వివరించి వారి నుంచి మెరుగైన మార్పు కొరకు, జీపీఏ పెంపుదలకు సూచనలు, సలహాలు. ఈనెల 24 నుండి 29 వరకు మండలంలోని అన్ని ఆర్ఎస్‌కేలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాధ, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**దర్శి, నవంబర్ 24 ప్రభాతవార్త**

దర్శిలోని కురిచేడు రోడ్డులో గల ఎన్నెస్పీ కాలువ బ్రిడ్జి కింద 40 నుండి 45 సంవత్సరాల లోపల వయసు గల మగ మనిషి మృతదేహం లభ్యమైంది. సదరు మృతదేహం ఉందని దర్శి వీఆర్వో రాయవరపు శ్రీనివాసరావు ఇచ్చిన రిపోర్టు మేరకు దర్శి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు. మృతదేహాన్ని శావాగారంలో ఫ్రీజర్ బాక్స్ లో ఉంచటం జరిగింది. ఒంటిపై ఎటువవంటి బట్టలు గాని పుట్టుమచ్చలు గాని ప్రత్యేక గుర్తులు గాని కనిపించడం లేదు. దయచేసి మృతదేహంను గుర్తించగలరని పోలీసులు కోరారు.

## సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్‌ల కొరకు స్థల సేకరణ





**దర్శి, నవంబర్ 24, ప్రభాతవార్త**

ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్టు అండ్ హెచ్‌ఆర్‌డీ డైరక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసే సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్‌ల స్థల సేకరణ కోసం దర్శి డివిజన్‌లో ఉదయం 33/11 కేవీ మారెళ్ళ సబ్ స్టేషన్, మధ్యాహ్నం బొట్లపాలెం, రాజంపల్లి, శంకరాపురం నందు గల స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.రవి కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## నేడు నాగిరెడ్డి పల్లెలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు, నవంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల నాగిరెడ్డిపల్లె ఫీడర్లోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం 9గంటల నుండి, సాయంత్రం 6గంటల వరకు ఆర్డిఎస్ఎస్ కొత్త లైన్ వేయడం జరుగుతుంది. కావున విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా తెలిపారు.

## ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన కాకి స్వర్ణలత



**ముండ్లమూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేముల నందు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కాకి స్వర్ణలత ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. వీరు డిసెంబర్ 5 నుండి పదవ తేదీ వరకు ఎడ్యుకేటర్ అండ్ టీచర్స్ వర్క్ షాపు నిమిత్తం పంజాబ్ యూనివర్సిటీ చండీఘర్‌లో జరగనున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కి హాజరై సైన్స్ పరంగా తాము తయారు చేసుకున్న ఇన్నోవేటివ్ ఐడియాలను సమర్పించెదురు. ఇలాంటి అరుదైన అవకాశం దక్కించుకున్న తమ పాఠశాల ఉపాధ్యాయురాలిని ప్రధానోపాధ్యాయురాలు గుంపుల టాన్య, మిగతా సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.ఈ సందర్భంగా టాన్య మాట్లాడుతూ ఈ వర్క్ షాపు కు హాజరై సైన్స్ పరంగా మరిన్ని విషయాలను తెలుసుకుని వాటిని విద్యార్థులకు చేరవేయటం ద్వారా విద్యార్థులలో సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంపొందించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, ఒంగోలు డివిజన్ ఉప విద్యాధికారి ఏ.చంద్రమౌళీశ్వర్, ముండ్లమూరు మండల విద్యాశాఖాధికారి షేక్ కాలేషావలి ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## రైతన్న మీకోసం కార్యక్రమం



**ముండ్లమూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలంలోని మండల కార్యాలయం నందు సచివాలయ సిబ్బందికి రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు దర్శి వారు మాట్లాడుతూ రైతులందరికి ప్రభుత్వం ద్వారా అందే ప్రతి పథకం గురించి అవగాహన కల్పించి రైతులకు లబ్ది చేకూర్చడం కొరకు ప్రభుత్వం వారు చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమంను సిబ్బంది అందరూ కలిసి బాధ్యతగా నిర్వహించాలని తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం దర్శి కో ఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాల గురించి పూర్తిగా తెలుసుకొనుటకు ఏపీఏఐఎంఎస్ అనే ఒక యాప్‌ను రూపొందించారని, దాని గురించి రైతులకు అవగాహన కల్పించడం వలన రైతులే నేరుగా విషయాలను తెలుసుకునే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, వ్యవసాయాధికారి తిరుమల రావు, ఎంపీడీవో శ్రీదేవి, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# బృందావనం గ్రామంలో స్వామిత్వ గ్రామసభ




**ముండ్లమూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలం బృందావనం గ్రామ పంచాయతీ నందు స్వామిత్వ ప్రత్యేక గ్రామసభను నిర్వహించడం జరిగింది.సదరు గ్రామసభకు ముండ్లమూరు మండల డిప్యూటీఎంపీడీవో ఆర్.జనార్ధన్ హాజరై గ్రామసభనందు గ్రామంలో గ్రామకంఠ భూముల సరిహద్దులను నిర్ణయించుకోవాలని ఎటువంటి వివాదాలు లేకుండా స్వామిత్వ సర్వేకి అందరూ సహకరించి శాశ్విత భూ హక్కును పొందాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్,ఎంపీటీసీ, గ్రామనాయకులు,సచివాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు రాజకీయ పార్టీల రంగులు పూసుకోవద్దు

**- రిజర్వేషన్‌లో మెరిట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు జనరల్ కేటగిరిలో అవకాశం ఇవ్వాలి**



**దర్శి, నవంబర్ 24, ప్రభాతవార్త**

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజకీయ పార్టీలపై అభిమానం ఉన్నప్పటికి బహిరంగంగా పార్టీ రంగులు పూసుకోవద్దని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. సురేష్‌బాబు ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా దర్శి ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజకీయ పార్టీల ముద్రలు పడితే ప్రభుత్వాలు మారినప్పుడు క్షేత్ర స్థాయిలో కక్ష సాధింపు వేదింపులకు గురవుతున్న పలు సందర్భాలు ఉన్నాయని తెలిపారు. రిజర్వేషన్లలో మెరిట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జనరల్ కేటగిరిలో అవకాశం ఇవ్వకుండా రిజర్వేషన్ల కోటాకు మాత్రమే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఐక్యతతో దళిత ఉద్యోగ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తానం చెన్నకేశవులు, గనిపె రవికుమార్, గుమ్మడి శాంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం

**- రైతును రాజు చేయటమే ప్రభుత్వ లక్ష్యం : ఏఓ కే బుజ్జి భాయి**



**మార్కాపురం, నవంబరు 24, ప్రభాతవార్త**

మార్కాపురం మండలం ఇడుపూరు, వేముల కోట గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కె బుజ్జి బాయి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తాసిల్దారు చిరంజీవి, ఎంపీడీవో బాల చెన్నయ్య,మార్కెట్ యార్డ్ సెక్రటరీ పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న ఐదు ముఖ్య విధానాలను వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. డ్రిప్, స్ప్రింక్లర్ సేద్యానికి సబ్సిడీలు, రైతులకు యంత్రాల సరఫరా, శాటిలైట్ టెక్నాలజీతో పంటల అంచనా వంటి చర్యలు జరుగుతున్నట్టు తెలిపారు. ఎంపీడీవో బాల చెన్నయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు 13 వేల కోట్ల పెట్టుబడులతో 38 యూనిట్లకు ఎంఓయూలు కుదిరినట్లు తెలిపారు. టమాటాతో పాటు వివిధ పంటలకు విలువవృద్ధి, సీసీసీ (కాఫీ-కోకో-కొబ్బరి) ఉత్పత్తులకు ప్రోత్సాహం వంటి అంశాలను వివరించారు. మార్కెట్ యార్డు సెక్రటరీ మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద రైతులకు 14 వేల రూపాయల చొప్పున భారీ స్థాయిలో సహాయం అందించామని వెల్లడించారు. నష్టపరిహారం పెంపు, పీఎం ఫసల్ బీమా యోజన,మార్కెట్ ఇన్‌టర్వెన్షన్ ద్వారా వరి,పప్పులు, టమాటా,ఉల్లి,మామిడి,కోకో కొనుగోళ్లు చేపట్టినట్టు తెలిపారు. కోకో, మామిడి రైతులకు అదనపు బోనస్‌తో కోట్ల రూపాయల లబ్ధి చేకూరినట్లు తెలిపారు.

# లారీ కింద పడి ఓ యువకుడు మృతి





**కంభం, నవంబరు 24 ప్రభాతవార్త :**

వేగంగా వెళుతున్న లారీ కింద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం కంభం మండలం కందులాపురం సెంటర్లో జరిగింది. వివరాల్లోకి వెళితే షేర్.ఆలి(23) అనే యువకుడు స్కూటీపై కంభం వైపు వెళ్తుండగా కందులాపురం సెంటర్లో డివైడర్ దగ్గర ఓ యువకుడు ఆలి నడుపుతున్న ద్విచక్ర వాహనానికి అడ్డు రావడంతో ఆ యువకుడుని ఢీకొట్టిన ఆలీ అదుపుతప్పి అప్పుడే మార్కాపురం నుంచి కడప వైపు వెళ్తున్న లారీ టైర్ల కింద పడటంతో తల మొత్తం ఛిద్రమై అక్కడి కక్కడేమృతి చెందాడు. కుమారుడు మృతి చెందడంతో తండ్రి మదర్ రోధిస్తున్న తీరు అందర్నీ కలిసి వేసింది. కంభం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 11వ వార్డులో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసిన అధికారులు



**గిద్దలూరు, నవంబరు 24, ప్రభాతవార్త**

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో విద్యుత్ స్తంభాలకు క్రాక్స్ వచ్చి ప్రమాదకరంగా ఉండడంతో వార్డు కౌన్సిలర్ సమస్యను శ్యాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వెంటనే స్పందించి కొత్త కరెంటు పోల్స్ మార్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో వార్డ్ కౌన్సిలర్ లోక్కు రమేష్ ఆధ్వర్యంలో కొత్త కరెంటు పోల్స్ మార్చడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మట్టిలో మెరిసిన మాణిక్యం ...

**- జాతీయ స్థాయి కబడ్డీకి మార్కాపురం విద్యార్థి ముండ్ల అభి ఎంపిక**



**మార్కాపురం, నవంబర్ 24, ప్రభాతవార్త**

కర్నూలు జిల్లాలో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచిన మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ముండ్ల అభి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అభి ప్రకాశం జిల్లాకు గర్వ కారణంగా నిలిచాడు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చదువుతున్న అభి జాతీయ జట్టుకు అర్హత సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. త్వరలో జరగనున్న అండర్-17 జాతీయ కబడ్డీ పోటీలలో ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రకాశం జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో పోటీపడిన ముగ్గురు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థుల్లో ముండ్ల అభి మాత్రమే జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాల సిబ్బంది,ఉపాధ్యాయులకుగర్వకారణమైంది.ఈ విజయానికి శిక్షణఅందించిన వ్యాయామ ఉపాధ్యాయులు డి శ్యామలదేవి, పి.దామోదర్‌రెడ్డి, కె ఓబులేసులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అలాగే విద్యార్థి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## సప్పరపు వెంకటేష్ కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేత





**మార్కాపురం, నవంబరు 24, ప్రభాతవార్త**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ క్రియాశీలక సభ్యుడు సప్పరపు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శి స్తూ, ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు అందజేశారు. మార్కాపురం నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కమిటీసభ్యులు వీరిశెట్టి శ్రీనివాసులు ,జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్‌రియాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భం గా వెంకటేష్ కుటుంబానికి ప్రమాద బీమా సదుపాయం అందించడంలో కీలక పాత్ర పోషించిన జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ సప్పరపు వెంకటేష్ మరణం కుటుంబానికి పెద్ద విషాదం. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా నిలబడాలని, జనసేన పార్టీ ఎల్లప్పుడూ మీ కుటుంబానికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి కాశీరామ్ సింగ్, బెల్లంకొండ గోపి, ఉమ్మడి రవీంద్ర, కంబం వెంకట రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దారవీడు గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం

**పెద్దారవీడు, నవంబరు 24, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం పెద్దారవీడుగ్రామంలోరైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పంపిన లేఖలను వ్యవసాయ అధికారి (ఏఓ) రైతులకు అందించి, లేఖలోని అంశాలను వారికి వివరించారు.రైతులను రాజులను చేయటమే ప్రభుత్వ ధ్యేయం అని, అంతిమ లక్ష్యం అని పలువురు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొని అమలు చేస్తున్న పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న సేవల గురించి వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు గొట్టం రామ నారాయణరెడ్డి, మండల పార్టీ మాజీ కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి,ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.రైతుల సమస్యలను తెలుసుకొని,ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ప్రతి రైతు చేరుకునేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# పేకాటరాయులకు రెండు రోజుల జైలు శిక్ష

**గిద్దలూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

పేకాటరాయులకు రెండు రోజుల జైలు శిక్ష రూ.1800లు జరిమానా విధిస్తూ గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భరత్ చంద్ర సోమవారం ఆదేశించారు.ఈ నెల 17వ తేదీ గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేకాట శిబిరంపై గిద్దలూరు సీఐ కె సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి6మంది పేకాటరాయలను అదుపులోకి తీసుకున్నారు.వారి నుండి రూ.1,35,000 నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి భరత్ చంద్ర రెండు రోజులు జైలు శిక్ష, రూ. 1800 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారని అర్బన్ సీఐకే సురేష్ తెలిపారు.

# మట్టి ఖర్చులకు రూ.10వేలు ఆర్థిక సహాయం

**రాచర్ల, నవంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు మీనిగే పాపయ్య (64) అనారోగ్యంతో మృతి చెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రెవిన్యూ సిబ్బంది రూ.10వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు ఆంజనేయస్వామి దీక్షలో ఉండడంతో వారి సిబ్బందితో ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఎస్ రంగయ్య, ఏ శివారెడ్డి, బి కిషోర్ కుమార్, డియోనా, వీఆర్ఏలు ఎస్ అల్లూరయ్య, జి క్రాంతి దీపక్, ఎస్ సోమ సుందర్ రెడ్డి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 26లోపు ఉచిత గ్యాస్ కనెక్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**కొమరోలు, నవంబర్ 24, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా కొమరోలులో ఎలిసా ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ షిప్ ఆఫీస్ వద్ద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందుట కొరకు ఈనెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. నూతన దంపతులకు,గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేదలు ఈ ప్రత్యేక అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.దరఖాస్తు చేసుకోవాల్సిన వారు బిపిఎల్ ఫ్యామిలీ అయ్యి ఉండి రేషన్ కార్డు కలిగి ఉండాలని, కుటుంబ సభ్యుల పేరు మీద గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండరాదని, కుటుంబంలోని వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులై ఉండరాదని, కుటుంబ సభ్యుల పేరు మీద 3,4 చక్రాల వాహనాలు ఉండరాదని తెలిపారు. దరఖాస్తు చేసుకోవలసిన వారు కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంక్ బుక్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తో కొమరోలులోని గ్యాస్ కార్యాలయంకు వచ్చి అర్హతలు పరీక్షించుకొని దరఖాస్తు చేసుకోవలసిందిగా తెలియజేశారు అర్హులైన వారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇవ్వటంతో పాటు,ఉచితంగా గ్యాస్‌స్టౌవ్, రీఫిల్,ఒక గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందించబడును. ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇన్‌స్టాల్ చేయబడునని తెలిపారు. ఇండియన్ గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.898 ధరకే మీ ఇంటి వద్దకు గ్యాస్ సిలిండర్ అందజేయబడును. దరఖాస్తు దారులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కొరకు మొబైల్ నెంబర్లు 79977 99509, 80960 31161 లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### విద్యాకమిటీ చైర్మన్ మృతికి

# నివాళులర్పించిన ఎంఈఓలు



**రాచర్ల, నవంబరు 24 ,ప్రభాతవార్త**

ఆకవీడు ఎంపియుపి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారి 1,2 యస్‌కె మొయినుద్దీన్, వి గిరిధర్ శర్మలు సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాంప్లెక్స్ చైర్మన్ యం.వి.భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు యస్‌యంయస్.మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు చేసిన పనులను గుర్తు చేసుకున్నారు.

7_7.qxd 11/25/2025 12:19 AM Page 1



## కొమరోలు మండలంలో రైతన్నా మీకోసం కార్యక్రమం

**కొమరోలు, నవంబర్ 24, ప్రభాతవార్త**



మండలంలోని గ్రామాల్లో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మరియు అనుబంధ శాఖలైన పశుసంవర్ధక శాఖ, రెవిన్యూ శాఖ, ఇంజనీరింగ్ శాఖ, విద్యుత్ శాఖల గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాలలోని రైతుల ఇంటి వద్దకు వెళ్లి 3,4 కుటుంబాలను ఒక క్లస్టర్ గా చేసి వారికి వివిధ శాఖల ద్వారా అందించే సబ్సిడీ పథకాలు, నీటి వనరుల భద్రత, డిమాండ్ ఆధారిత పంటల ఎంపిక, సాగుకు సంబంధించిన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడకం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, మేలైన విత్తనాల ఎంపిక, కౌలు కార్డులు వలన ఉపయోగాలు, పచ్చి రొట్టె పైరుల యొక్క ప్రాముఖ్యత, అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్, పంటల బీమా, పశువులలో వచ్చు సీజనల్ వ్యాధులు మరియు వాటి నివారణ చర్యలు, ప్రధానమంత్రి సూర్యగర్ మొదలైన వాటి గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి కె.రాజశ్రీ ఎడమకళ్ళు, పురుషోత్తంపల్లి, బొంతపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సందర్శించి రైతులకు సూచనలు తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పి కౌసర్, కె శిరీష, గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు, గ్రామ రెవిన్యూ అధికారులు, వెటర్నరీ సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## రైతన్న - మీకోసం కార్యక్రమంలో ఎంపీడీవో

**హనుమంతునిపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**



మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామం నందు సోమవారం నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు పాల్గని సీఎం సందేశ పత్రాలను రైతులకు అందజేసి వారి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం అదే గ్రామంలో సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన రైతన్న మీ కోసం కార్యక్రమం

**హనుమంతునిపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**



కొత్త ఆలోచనలు పంచుకుంటూ మార్పుకు నాంది పలుకుతూ ప్రభుత్వానికి అన్నదాతలు అందరూ తోడ్పాటును ఇవ్వాలని కోరుకుంటూ సచివాలయ సిబ్బంది ద్వారా వారం రోజుల పాటు అన్ని గ్రామాలలో రైతన్న - మీ కోసం కార్యక్రమం ప్రారంభించడంజరిగిందని మండల వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఒక జట్టుగా ఏర్పడి గ్రామంలోని అందరూ రైతులను వారి ఇంటి వద్ద కలిసి వారి కోసం ప్రభుత్వం చేసిన పనులను కూలంకషంగా వివరించి రైతుల యొక్క సమస్యలు, సలహాలు, కొత్త ఆలోచనలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు ముఖ్యమంత్రి తెలియజేసిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే ఐదు విధానాలతో ప్రభుత్వం కార్యచరణ అమలు చేస్తున్నట్లు రైతులకు సచివాలయ సిబ్బంది తెలియజేశారన్నారు.

## రైతులను ప్రోత్సహించేందుకే రైతన్న మీ కోసం

**- తహసీల్దార్ ఏ.సురేష్**



**కొనకనమిట్ల, నవంబర్ 24, ప్రభాతవార్త**

రైతులను ప్రోత్సహించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతన్న మీ కోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ ఏ.సురేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారి కే.ప్రకాష్‌రావు అధ్యక్షతన జరిగిన రైతన్న మీ కోసం అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతన్న మీ కోసం ఆరు రోజుల వారోత్సవాలు నిర్వహించాల్సి ఉందన్నారు. సచివాలయం సిబ్బందిని గ్రూపులుగా విభజించి రైతుల దగ్గరకు వెళ్లి స్వర్ణాంధ్ర 2047 విజన్‌కి అనుగుణంగా మన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించాలని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మనసులో నుంచి పుట్టిన ఒక మహా నూతనమైన కార్యక్రమం అన్నారు. వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల్లో రైతును రాజును చేసేందుకు ఐదు విధానాలతో కార్యచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొదటిది నీటి భద్రత, రెండోవది డిమాండ్ ఆధారితి పంటల గురించి వివరించారు. మూడవది అగ్రిటెక్, నాలుగవది ఫుడ్ ప్రాసెసింగ్ రైతుల పంటలు విలువలు పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలని తెలియజేశారు. ఐదవది ప్రభుత్వం నుంచి రైతున్నకు పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ, రాష్ట్ర ప్రభుత్వం రూ.14000 కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు మొత్తం కలిపి రూ.20వేలు రూపాయలు రైతులు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఆరు రోజులు పాటు అన్ని గ్రామాలలో అవగాహన కల్పిస్తూ వాళ్ల స్థితిగతులు మార్చాలని పేర్కొన్నారు. పశువైద్యాధికారులు శ్రీకాంత్‌రెడ్డి, రాజ్యలక్ష్మీ, కృష్ణమోహన్‌లు పశుసంవర్ధకశాఖ నుంచి రైతులకు కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. మధ్యాహ్నం పంటల సాగుకు ప్రభుత్వం అందించే రాయితీల గురించి ఉద్యాన అధికారి రమేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వీఏఏలు, వీహెచ్ఏ, విద్యుత్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు. కొనకనమిట్లలో రైతన్న మీ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**మార్టూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

బాపట్ల జిల్లాలోని సమగ్ర శిక్ష లో పని చేస్తున్న వివిధ విభాగాల వారికి గత ఆరు సంవత్సరాల నుంచి జీతాలు పెరగకుండా, ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కొరకు బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నా చౌక్ వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పని చేస్తున్న శ్రమ దోపిడికి గురవుతున్న అన్ని విభాగాల వారికి ఉద్యోగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో పాటుగా, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ గ్రాడ్యుటీ, హెల్త్ బెనిఫిట్స్, మెడికల్ లీవ్‌లు, చైల్డ్ కేర్ లీవ్‌లు అందించాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంచాలని, గత ప్రభుత్వంలో చేసిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని అదే విధంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పార్ట్ టైం టీచర్స్ పదాన్ని తొలగించి, రోజు మొత్తం సేవలను అందిస్తున్న వారికి తగిన వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు అన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పట్ల ఎటువంటి స్పందన లేకుండా ఉన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించని యెడల ఈ ఉద్యమాన్ని పలు దశలుగా తీవ్ర రూపంలో డిసెంబర్ 10వ తేదీన ఛలో ఎస్పీడీ కార్యక్రమం చేపట్టనున్నామని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు అధ్యక్షులు మజుంధర్, సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షులు గద్దె రమేష్, జిల్లా నుంచి పలువురు పార్ట్ టైం టీచర్స్, సీఆర్పీలు, అకౌంటెంట్స్, ఎంఐఎస్, మెసెంజర్స్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**కురిచేడు, నవంబర్ 24, ప్రభాతవార్త**



మండలంలోని ఆవులమంద కొత్తూరు చెరువు వద్ద ద్విచక్ర వాహన దారుడు అదుపు తప్పి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన సోమవారం నాడు చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. త్రిపురాంతకం మండలం ముడివేముల గ్రామానికి చెందిన కే.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆవులమంద నుంచి ముడివేములకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొత్తూరు చెరువు కట్టపై వాహనం అదుపు తప్పి అతను రోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని ప్రధమ చికిత్స అనంతరం వైద్యశాలకు తరలించారు.

## వాసవిక్లబ్, వాసవి మహిళా క్లబ్‌లకు నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**సంతనూతలపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**



సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో 2026వ సంవత్సరానికి వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్‌లకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు అధ్యక్షత వహించారు. వాసవిక్లబ్ నూతన అధ్యక్షులుగా వేమూరి ఆంజనేయులు, సెక్రటరీగా శిఘాకొల్లి రాజేష్, కోశాధికారిగా పామిడి సుధాకర్, గౌరవ అధ్యక్షులుగా వేమూరి వెంకట శేషారావులను ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలుగా వేమూరి వీర వెంకట నాగమణి, సెక్రటరీగా శిఘాకొల్లి జయశ్రీ, కోశాధికారిగా గాదంశెట్టి శ్రీలక్ష్మీ, గౌరవ అధ్యక్షురాలుగా గ్రంధి సులోచనలను ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవిక్లబ్, వాసవి మహిళ క్లబ్స్ అభ్యున్నతకు పాటుబడి ఉత్తమ అవార్డులు సాధనకు నడుం బిగించిన ప్రస్తుత వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతిలను ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, జీఎల్ ప్రసాద్‌రావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు జి.శరత్‌బాబు, చక్కా యానాది శెట్టి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బిశెట్టి శ్రీనివాసరావు తదితరులు తమ తమ ప్రసంగాల్లో అభినందించారు. అదే విధంగా 2026 సంవత్సరానికి వాసవి క్లబ్ అధ్యక్షులుగా వేమూరి ఆంజనేయులు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలుగా వేమూరి వీర వెంకట నాగమణి తదితరులకు వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి జీఎల్ ప్రసాద్‌రావులు ఈ సందర్భంగా నియామక పత్రాలను అందజేశారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ 2026 సంవత్సరపు నూతన ప్రెసిడెంట్ శిద్దా సూర్య ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్‌ల నూతన కమిటీలు మరింతగా అభివృద్ధికి పాటుపడాలని వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు తన ప్రసంగంలో కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ప్రతినిధులు, పలువురు మహిలలు, ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్త శిద్దా దంపతులను సత్కరించిన వాసవి క్లబ్ బృందం

**సంతనూతలపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**



ఒంగోలులో సోమవారం నాడు పారిశ్రామికవేత్త వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నూతన ప్రెసిడెంట్ శిద్దా సూర్య ప్రకాష్‌రావు, జయశ్రీ దంపతులను సంతనూతలపాడుకు చెందిన వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్రప్రసాదరావు ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. శిద్దా సూర్య ప్రకాష్‌రావు, జయశ్రీల వివాహ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వారిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్రప్రసాదరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి జి.లక్ష్మీ ప్రసాదరావు, వాసవి క్లబ్ నూతన సెక్రటరీ శిఘాకొల్లి రాజేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చక్కా సుబ్బరాయుడు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ తదితరులు పాల్గొని శిద్దా దంపతులను సత్కరించిన వారిలో ఉన్నారు.

## రైతన్న మీ కోసంలో భాగంగా సీఎం చంద్రబాబు సందేశ పత్రాలు రైతులకు అందజేత

**సంతనూతలపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలంలోని 'రైతన్న మీ కోసం' కార్యక్రమంను సోమవారం నాడు అన్ని రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో టీం సభ్యులు అయినటువంటి పశు సంవర్ధకశాఖ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ పీఏసీఎస్, మార్కెటింగ్ అధికారులు, నీటి సంఘం సభ్యులు, ఫ్రోగ్రెసివ్ ఫార్మర్స్ వీరందరూ ప్రతి రైతు కుటుంబాన్ని కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సందేశ పత్రాలను అందజేశారు. రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు 5 విధానాలతో కార్యచరణ అమలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని, మండలంలోని మంగమూరు, కామేపల్లి వారిపాలెం గ్రామాలలో జరుగుతున్నటువంటి రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో పావని మాట్లాడుతూ రైతన్న మీ కోసం 6 రోజుల వారోత్సవాలలో ఈనెల 24వ తేదీ నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం 29వ తేదీ వరకు జరుగునని తెలిపారు. రైతన్న మీ కోసం రైతు కుటుంబాల సర్వేని గ్రామ వ్యవసాయ సహాయకులు సమర్ధవంతంగా నిర్వహించి ఈ కార్యక్రమం యొక్క 5 విధానాల కార్యచరణ అయినటువంటి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి రైతన్నకు పెట్టుబడి సాయం తదితర అంశాల గురించి రైతులకు అవగామన కల్పించాలన్నారు. పెట్టుబడి తగ్గించి అధిక లాభం పొందే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించాలని తెలియజేశారు. పాడి రైతులకు కూడా సాంకేతిక సలహాలు అందించి వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఏవో పావని తెలిపారు. ఈ క్యాక్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉన్నటువంటి గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులకు ఏపీఏఐఎంఎస్ రైతు యాప్‌ను కూడా రైతులు యొక్క యాండ్రాయిడ్ ఫోన్లలో ఇన్స్టాల్ చేసి, తద్వారా యాప్‌లోని రైతు సేవలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలియజేశారు. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ రైతులు వద్ద ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాల వివరాలను ఎఫ్ఎంఐఎస్ యాప్ నందు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

**అద్దంకి , నవంబరు 24,ప్రభాతవార్త**





రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ మండలంలోని నాగులపాడు గ్రామంలో వీరిలో కొప్పుల కోటయ్య అనారోగ్యంతో బాధపడుతుండ టంతో సోమవారం వారి నివాసానికి వెళ్లి కోటయ్య ను పరామర్శించి, ఆరోగ్య విషయమై వాకబు చేశారు. అదే విధంగా జ్యోతి సుబ్బులు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు, మాజీ ఎంపీటీసీ పచ్చా సింగయ్య ఆపరేషన్ చేయించుకోగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగితెలుసుకున్నారు, మంగమూరి బ్రహ్మయ్య ఇటీవలే కాళ్ళకు ఆపరేషన్ చేయించుకోగా వారి ఇంటికివెళ్లి పరామర్శించారు, మంగమూరి అరుణ ఇటీవలే క్యాన్సర్ ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుండటంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వేముల వసంతరావు మాతృమూర్తి అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి నివాసానికి వెళ్లి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు.

## రైతులకు అండగా రైతన్నా మీకోసం కార్యక్రమం



**పొన్నలూరు,నవంబరు 24, ప్రభాతవార్త**

రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారికి అండగా నిలిచేందుకే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఈ. నిర్మలా కుమారి అన్నారు. మండలంలోని గ్రామాలలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పొన్నలూరులో మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మలా కుమారి మాట్లాడుతూ అన్నదాతలకు రానున్న కాలంలో వ్యవసాయ శాఖ,అనుబంధ శాఖల ద్వారా రైతులకు మేలు చేయాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. అదేవిధంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వాటికి ప్రభుత్వ మద్దతు మరియు పాడి రైతులకు అండగా నిలిచి రైతులకు మేలైన యాజమాన్య పద్ధతిలో అధిక ఉత్పాదకత సాధించాలని ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు.మండల వ్యవసాయాధికారి వి.రాము మాట్లాడుతూ ఈ కార్యక్రమం 24 వ తేదీ నుండి డిసెంబర్ 3వ తేదీ వరకు అన్నీ రైతు సేవా కేంద్రాలలో జరుగుతుందని ,రైతుకుటుంబాల సమాచారాన్ని సేకరించి వారివివరాలని ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా మండలపార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబయ్య, పొన్నలూరు నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్,పశు వైద్యాధికారి డాక్టర్ పి.శివరామ కృష్ణ, ప్రకృతి వ్యవసాయాధికారి ఎస్తేరు రాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు టి.వి.వి నారాయణ అన్ని శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## స్వామిత్వ ద్వారా కుటుంబ ఆస్తికి రక్ష



**తాళ్లూరు, నవంబరు 24,ప్రభాతవార్త**

స్వామిత్వ సర్వే ద్వారా గ్రామంలోని నివాస గృహాలు, ఇంటి స్థలాల హద్దులకు సంబందించి హక్కు దృవీకరణ పత్రం పొందే అవకాశం ఉందని జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో పి అజిత అన్నారు. తాళ్లూరు లోని సచివాలయం వస్సోమవారం స్వామిత్వ సర్వేలో గుర్తించిన నివాస ఆవాసాలు, స్థలాలకు సంబంధించిన హద్దుల ధృవీకరణ నిర్ధారణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులపై స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడానికి స్వామిత్వ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇది ఆర్థిక స్వాలంబన, బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు.అలాగే వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతన్న మీ కోసం కార్యక్రమం అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఐ వెంకటేశ్వరరెడ్డి,సర్పంచ్ మేకలచార్లెస్ సర్జన్,నాయకులు కైపు రామకోటిరెడ్డి, మండల వ్యవసాయాధికారి బి ప్రసాదురావు, పంచాయతీకార్యదర్శి షేక్ షహనాజ్ బేగం,సచివాలయ సిబ్బంది. గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూల స్థంభం వ్యవసాయ రంగం

**- రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి**

**అద్దంకి , నవంబరు 24,ప్రభాతవార్త**

రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూల స్థంభం వ్యవసాయ రంగం అని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నాగులపాడు గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం లో మంత్రి వ్యవసాయ సిబ్బందితో కలిసి రైతుల ఇంటి వద్ద వెళ్ళి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సందేశం అందించారు. యాప్‌లో రైతుల వివరాల నమోదు పరిశీలించారు. ప్రభుత్వం రైతులకొరకు విత్తనం దగ్గర నుండి పంట అమ్ముకునే వరకు అండగా నిలిచిందని ఇప్పటికే అన్నదాత సుఖీభవ, పి యం కిసాన్ నిధులు 14 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. జనవరి లో మరో 6 వేల రూపాయలు అందిస్తామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కొరకు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం క్వింటాల్ కి గ్రేడ్ తి రకం 2389 రూపాయలు 24 గంటలు లోపే రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి సాగు కి మంచి చేసే ముఖ్యమంత్రి 5 సూత్రాలు తెలియజేశారు. రైతులను రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రీయ పద్ధతులతో వ్యవసాయం చేసే విధం గా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అర్హులు అయి ఉండి అన్నదాత సుఖీభవ పథకం రాని రైతులు వివరాలు





సర్వేలో సేకరించి వారికి కూడా పథకం వర్తించే విధంగా చేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అన్నపూర్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు బిఎఫ్రాయిము, ఈ.ఈ నల్లూరి మస్తానరావు, తహసీల్దార్ శ్రీ చరణ్,మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, మండల ఉద్యాన అధికారిణి ఎస్ దీప్తి, బాపట్ల శాస్త్రవేత్త ఏడుకొండలు,గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని,సర్పంచ్ మంగమూరి రాజేశ్వరి,కరిపరమేశ్,నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు,గ్రామ రెవెన్యూ అధికారి అనంత లక్ష్మీ,గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను రాజులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**- క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి**

**హనుమంతునిపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**

రైతులను రాజులుగా తీర్చిదిద్దమే సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వం ఆలోచనని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి తెలిపారు. సోమవారం హనుమంతునిపాడు మండలం హాజీపురం గ్రామం నందు నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొని సీఎం సందేశత్రాలను రైతులకు అందజేసి వారి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. హాజీపురం బూత్ కన్వీనర్ గాయం రామిరెడ్డి, నీటి సంఘం వైస్‌ప్రెసిడెంట్ గాయం సుబ్బారెడ్డి,డి.గాయత్రి, వీఆర్వో ఝాన్సీ,మల్లిఖార్జున రెడ్డి, రబ్బాని బేగం, రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



8_8.qxd 11/25/2025 12:21 AM Page 1



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

### - 172 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, నవంబర్ 24, ప్రభాతవార్త**

ప్రజల సమస్యలను వేగవంతంగా సమర్ధవంతంగా పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించి మొత్తం 172 అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. అర్జీలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, విద్యుత్ సమస్యలకు సంబంధించి అర్జీలు అధికంగా వచ్చినట్లు తెలిపారు. సంబంధిత శాఖల ద్వారా వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

**మండలాల వారీగా వచ్చిన అర్జీలు :**

హెచ్ఎంపాడు 30,వెలిగండ్ల 14,సీఎస్‌పురం 21, పీసీపల్లి 31,పామూరు 9,కనిగిరి మండలంనుంచి 30, కనిగిరి అర్బన్‌నుంచి 37 అర్జీలు వచ్చాయి. కనిగిరి మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో తాగునీటి పైపులైన్లు, వీధి దీపాలు, సైడు కాలువలు ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ వినితిపత్రం అందజేశారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో పలువురు అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కొండ కృష్ణారెడ్డి, బజాజ్ ఓబుల్‌రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, బుల్ల బాలబాబు, షేక్ రెహమాన్, పాతూరు నాగ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువలకు శాశ్వత పరిష్కారం చూపిన ఈవో అరవిందరెడ్డి





**పామూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డు ట్రెండ్స్ ఎదురుగా డ్రైనేజీ వాటర్ ప్రవాహానికి నిరంతరం ఆటంకం ఏర్పడి డ్రైనేజీ వాటర్ నిలిచిపోయి షాపులలోకి పోతున్న సమాచారం స్థానికులు పామూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డికి సమాచారం ఇవ్వగా డ్రైనేజీ శుభ్రం చేసి వ్యక్తులను ఇతర ప్రాంతాల నుంచి పామూరు రప్పించి సోమవారం సాయంత్రం మొదలుకొని అర్ధరాత్రి వరకు కాలువలను శుభ్రం చేయడం జరిగింది. గతంలో ఎంతో కాలం నుంచి ఆ ప్రాంతంలోని డ్రైనేజీ కాలువలను క్లీన్ చేయనందువల్ల ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విషయం తెలుసుకొని సోమవారం ఈవో జీవీ అరవిందరెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త కేవీఆర్, టీడీపీ నాయకులు బత్తుల సత్యనారాయణ దగ్గరుండి డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. ఈవో నిర్ణయంతో డ్రైనేజీ కాలువలకు శాశ్వత పరిష్కారం కలగడం శుభ పరిణామం అని, ఈవోను పట్టణ ప్రజలు అభినందించారు.

## రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న యారవ రమా శ్రీనివాస్



**పామూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు పామూరు మండలంలోని పడమర కట్టకిందపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం నగదు పడిన లబ్దిదారులను కలిసి రైతన్న మీ కోసం యాప్‌లో నమోదు చేసిన కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్. శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని సకాలంలో రైతులకు కావాల్సిన యూరియా కూటమి ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ కట్టకిందపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ వీఆర్వో శివశంకర్, అగ్రికల్చర్ ఆఫీసర్, గ్రామరైతులు పాల్గొన్నారు.

## నటుకుల వినోద్ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు సరుకులు

### - పంపిణీ చేసిన నటుకుల లక్ష్మీ చైతన్య



**పామూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

పామూరు గ్రామంలో పొట్టి శ్రీరాములు వీధిలో నటుకుల వినోద్‌కుమార్ 45వ పుట్టిన రోజు సందర్భంగా నటుకుల వినోద్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం జరిగే కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కూడా నటుకుల వినోద్ కుమార్ జువెలరీ నందు వారి సతీమణి(భార్య) నటుకుల లక్ష్మీ చైతన్య పేదలకు, పామూరు గ్రామ పంచాయతీ పారిశుధ్య,స్వచ్ఛ భారత్ కార్మికులకు 200 మందికి నిత్యవసర వస్తువులు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా బీజేపీ సీనియర్ నాయకులు కొండిశెట్టి వెంకట రమణయ్య, తెలుగుదేశం నాయకులు పందిటి హరీష్ పాల్గొని వారందరికి నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరి సుభద్ర, తెలుగు టీచర్, పంచాయతీ శానిటరీ మేస్త్రీ, యాట రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేని మస్జిద్, హుస్సేనియా మదర్స నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర



**పామూరు, నవంబర్ 24, ప్రభాతవార్త**

పామూరు పట్టణంలోని ప్రతిభ స్కూల్ వద్ద డాక్టర్ మౌలానా షరీఫ్ హుస్సేని, పట్టణ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో హుస్సేని మస్జిద్, హుస్సేనియా మదర్సా నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్వాహకులను అభినందించిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి. ఈ సందర్భంగా డాక్టర్ ముక్కు ఉగ్ర మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి పేదలకు అన్నదానం చేస్తూ, రక్తం అవసరమైన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారికి క్తదానం చేస్తూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఎన్నో పేద కుటుంబాలకు నిత్యవసరాలు, ఔషధాలు మానవసేవే మాధవసేవ అనే విధంగా ముందుకు సాగుతున్న మౌలానా అభినందనీయుడని ఆయన అన్నారు. ఇలాంటి గొప్ప నిర్మాణం తన చేతుల మీదుగా ప్రారంభం కావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, షేక్ షంషూర్, షేక్ గౌస్ భాషా, కావేరి రసూల్, పత్తు మస్తాన్, కోడిగుంపల నాయబ్ రసూల్, ముబీనా మౌలాలి, పులి నాయబా, షేక్ చాంద్ భాషా, బుజ్జి బాయ్, షేక్ నాయబ్ రసూల్, కోఆప్షన్ సభ్యులు తడికమల్ల సుబ్బారావు, బిల్డర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, గుంటుపల్లి శ్రీనివాసులు, పలువురు పట్టణ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం

### - రైతన్న మీ కోసం కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు అండగా ప్రభుత్వం





**పెద్దదోర్నాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

రాష్ట్రాన్ని సంక్షోభంలో నుంచి సంక్షేమం తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన పల్లె పల్లెకు చేరుకుంటుందని, ప్రత్యేకంగా రైతన్నకు మీకోసం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తుందని యర్రగొండ పాలెం నియోజకవర్గటీడీపీ ఇన్‌చార్జిగూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. రైతన్న మీ కోసం కార్యక్రమం యర్రగొండ పాలెం నియోజకవర్గంలోని చిన్న గుడిపాడు గ్రామంనుంచి యర్రగొండపాలెం నియోజకవర్గటీడీపీఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభంలో ముంచిందని, తెలుగుదేశం ప్రభుత్వంలోముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షోభం నుంచి సంక్షేమం వైపు పాలన అందిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఎన్నికల ముందు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే జాతికి అంకితం అంటూ బూటకపు నాటకం ఆడి రైతులను బురిడి కొట్టించే ప్రయత్నం చేశారని, తీరా చూస్తే వెలిగొండ ప్రాజెక్టు పనులు అసంపూర్ణంగా ఉన్నాయని, ప్రస్తుతం వాటిని చక్కదిద్దడానికి వేలకోట్ల రూపాయలు చంద్రబాబునాయుడు సమకూర్చూ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు తాగునీరు సాగునీరు అందించాలని వేగవంతంగా పనులు చేయిస్తున్నాడని, 15 రోజులకు ఒక సారి, ఇరిగేషన్‌శాఖ మంత్రి కలెక్టర్, అధికారులతో సమీక్షలు జరిపి ప్రాజెక్టు పనులు ఉరుకులు పరుగులతో చేయిస్తున్నారని తెలుగుదేశం ప్రభుత్వం చెప్పింది చేస్తుంది చేసింది చెబుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రైతుకు అందించే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారి టీఎల్ ప్రసూనాదేవి, మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్, వీఆర్వో వెలిదండ నాగేశ్వరరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్ ప్రజాదర్బార్

### - ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఉమాకాంత్



**కనిగిరి, నవంబర్ 24, ప్రభాతవార్త**

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించేందుకు సీజీఆర్ఎఫ్(కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ ఫోరం) ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం 26వ తేదీన కనిగిరిలో నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఉమాకాంత్ తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ ప్రజాదర్బార్‌కు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేలు(రిటైర్డ్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి) హాజరై వినియోగదారుల ఫిర్యాదులను నేరుగా స్వీకరించి పరిష్కార సూచనలు చేయనున్నారని ఆయన వివరించారు. విద్యుత్ బిల్లింగ్‌లో పొరపాట్లు, అధిక బిల్లులు, మీటర్ లోపాలు, కనెక్షన్ల ఆలస్యం, వోల్టేజీ సమస్యలు, తరచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదులను రాతపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఉమాకాంత్ కోరారు.

## బారాహిమాం వర్ధంతి సందర్భంగా పేదలకు భోజన వసతి

### - స్నేహహస్తం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం



**కనిగిరి, నవంబర్ 24, ప్రభాతవార్త**

కనిగిరి మండలం తాళ్లూరు పంచాయతీ మాజీ వైస్ సర్పంచ్ షేక్ బారా హిమాం తొలి వర్ధంతి సందర్భంగా స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని ఆయన కుమారుడు రహీం భాష నిర్వహించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుధీర్‌బాబు మాట్లాడుతూ బారాహిమాం వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలోని శుభ సందర్భాల్లో పేదలను గుర్తించి సేవ చేయాలన్నారు. ప్రార్ధించే పెదవుల కంటే సాయం చేసే చేతులే సమాజానికి అవసరం. సహాయం కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. వారికి తోడుగా నిలవడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రహీం భాష, కాజా రహంతుల్లా, ఫకీర్ భాష, అల్లుడు ఖాశీం వలి, ప్రభుత్వ వైద్య సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు కాశీం పీరా, మొహిద్దిన్, గోపిశెట్టి బాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో తాగునీటి సమస్యపై ప్రజా దర్బార్‌లో అర్జీ

### - ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి వినతి చేసిన టీడీపీ నాయకులు



**కనిగిరి, నవంబర్ 24, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో తీవ్రంగా ఏర్పడిన తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్‌లో స్థానికులు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వెన్నా శ్రీనివాసులురెడ్డి స్థానిక ప్రజలతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వార్డులోని చాలా బోర్లల్లో నీరు లేకపోవడంతో పాటు 1000 అడుగుల లోతు బోర్లు వేసినప్పటికి నీరు లభించకపోతున్న పరిస్థితిని ఆయన వివరించారు. నవంబర్ 15వరకు మున్సిపాలిటీ ద్వారా మూడు ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగిందని, అయితే 16వ తేదీ నుంచి అకస్మాత్తుగా ఆ చర్య నిలిచిపోయిందని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని పేర్కొన్నారు. తాగునీరు ప్రజల కనీస అవసరమని, వెంటనే మళ్లీ మూడు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. ప్రజల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెల వెంకటరెడ్డి, చరంచర్ల రాంబాబు, రమణ పాల్గొన్నారు.

## సీవీఆర్ దంత వైద్యశాల(ఒంగోలు) అధినేత డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి తల్లి భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల, ఇన్‌చార్జి గూడూరి



**పెద్దదోర్నాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

ఒంగోలులో నివాసముంటున్న పెద్దదోర్నాల మండలం చిన్న గుడిపాడు గ్రామానికి చెందిన సీవీఆర్ దంత వైద్యశాల అధినేత చిట్యాల వెంకటేశ్వరరెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సోమవారం చిన్నగుడిపాడు గ్రామానికి విచ్చేసి డాక్టర్ సీవీఆర్ తల్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సీవీఆర్ దంత వైద్యశాల అధినేత డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ కూటమి నాయకులు, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి భద్రత కోసమే.. పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత

### - ఎస్సై మహేష్




**పెద్దదోర్నాల, నవంబర్ 24,ప్రభాతవార్త**

ట్రాఫిక్ నిబంధనలు రూపొందించబడినవి ప్రతి ఒక్కరి బాధ్యత కోసమేనని, వాటిని ఖచ్చితంగా పాటించడం ప్రతి పౌరుడి బాధ్యతని వాటిని ఖచ్చితంగా పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్ తెలిపారు. రోడ్డు భద్రతపై రూపొందించిన చిన్న చిన్న వాల్ పోస్టర్లు, ప్రమాద దృశ్యాలు, వాటి కారణాలు నివారణ చర్యలను వివరించారు. ప్రయాణం సురక్షితం కావాలంటే ట్రాఫిక్ రూల్స్ పాటించడం అలవాటు కావాలి అని పిలుపునిచ్చారు. రోడ్డు దాటే పాదచారులకు గౌరవం ఇవ్వడం, జీబ్రా లైన్ల వద్ద ఆగడం, తప్పు దోవ ప్రయాణాలు చేయవద్దని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్టు ప్రాణాలను రక్షించే కవచమని అన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు రూపొందించిన బ్రోచర్లు ప్రదర్శించారు.

## వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలోపాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా



**కొనకనమిట్ల, నవంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని సలనూతల(గాజులపల్లి) గ్రామంలో సోమవారం జరిగిన వైసీపీ నాయకులు దివంగత సానికొమ్ము సుబ్బారెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పాల్గొన్నారు. సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అక్కి దాసరి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, రిటైర్డ్ ఈఆర్ఓ అన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు బైరెడ్డి కొండారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం ప్రదేశాన్ని పరిశీలించిన ఫోరెన్సిక్ టీమ్





**నాగులుప్పలపాడు, నవంబర్ 24, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన నాగులుప్పలపాడు బీసీ కాలనీలో నివాసముంటున్న గుర్రపుశాల హైమావతిని వీర రాఘవులు కత్తితో పైశాచికంగా దాడి చేయడంతో ఆమె రిమ్స్‌లో చావుబతుకుల మధ్య పోరాడుతూ ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఫోరెన్సిక్ టీం సిబ్బందితో సంఘటన స్థలాన్ని సోమవారం నాడు పరిశీలించి హత్యాయత్నానికి ప్రయత్నించిన కత్తితోపాటు రక్తపు మరకలను సామాగ్రిని పరిశీలించి ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు టీమ్‌తో పాటు స్థానిక ఎస్సై రజియా సుల్తాన బేగం సిబ్బంది పాల్గొన్నారు.

## నాగులపాడులో పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

### - 37 మందికి ఉచిత సైకిళ్ళు పంపిణీ - 30లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభం

### - గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్ - పలు సమస్యలను పరిష్కరించిన మంత్రి గొట్టిపాటి









**అద్దంకి , నవంబరు 24,ప్రభాతవార్త**

అద్దంకి మండలంలోని నాగులుపాడు గ్రామంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 37 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రూ.30 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన యస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన మంత్రి ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కూటమి నేతలు, టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో కరి పరమేష్ నాయకత్వంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున హాజరై మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు స్వాగత నిరాజనాలు పలికారు. దారి పొడవున పెద్ద ఎత్తున పూలు చల్లుతూ, మంత్రికి సాదర స్వాగతం పలికారు.

## వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం



**వేటపాలెం, నవంబర్ 24, ప్రభాతవార్త**

వేటపాలెం మండలం పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం, పందిళ్ళపల్లి, రైతు సేవ కేంద్రాలలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సూచనల మేరకు మండల వ్యవసాయాధికారిణి ఎం.సరిత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాలలో నిర్వహించే సర్వేలో రైతులు తమ పూర్తి వివరాలను సిబ్బందికి అందజేసి సహకరించాలన్నారు. వ్యవసాయానికి సంబంధించిన తాజా పూర్తి సమాచారం కోసం ప్రతి రైతు ఆండ్రాయిడ్ ఫోన్లో ఫార్మర్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

## సెయింట్ ఆన్స్ నందు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహణ

### - అలింబిక్ ఫార్మాసిటికల్స్




**వేటపాలెం, నవంబర్ 24, ప్రభాతవార్త**

సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో ముంబాయి ప్రధాన కేంద్రంగాకలిగిన అలింబిక్ ఫార్మసూటికల్స్ లిమిటెడ్ వారు వీధి ఏ,ఫార్మసీ విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఫార్మాసూటికల్ కంపెనీలో ఒకటైన అలింబిక్ ఫార్మ సూటికల్స్‌లిమిటెడ్ 1907లో స్థాపించబడిన బహుళజాతికంపెనీ క్యాంపస్ రూక్రూట్‌మెంట్‌కు హాజరైన ప్రతినిధులు మొదటగా కంపెనీ ఆవిర్భావం, అలింబిక్ ఫార్మ సూటికల్స్ లిటిటెడ్ ఉత్పత్తి కేంద్రాలు, కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలు, ఎంపిక కాబోయే విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలు, బాధ్యతలు, కంపెనీ కల్పించే సౌకర్యాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ ప్రాంగణ ఎంపికలలో బి.ఫార్మసీ నుండి 100 మంది, ఎంబీఏ విభాగం నుండి 50 ఈ ప్రాంగణ ఎంపికలకు హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు తెలిపారు. ఈ కళాశాల ప్రాంగణ ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి మూడు లక్షల జీతం, ఇతర అలవెన్స్‌లు ఇవ్వబడతాయని ఎంపికల అధికారి ఎస్.పూర్ణచంద్రరరావు తెలిపారు.

## జనసేన పార్టీ ప్రమాద భీమా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం



**చీరాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రమాదవశాత్తు మరణించిన చీరాల బండపాలెం చెందిన ముత్తుకూరి వెంకట బాల సాయి వారి కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయలు చెక్కులు స్వయంగా శ్రీకొణిదెల నాగబాబు అందజేయడం జరిగింది. జనసేన పార్టీ అధినేత ఆదేశాల మేరకు చీరాల నియోజకవర్గం లో జనసేన పార్టీ నాయకులు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా జోన్ కమిటీ సభ్యులు ఆలా శ్రీధర్ గత సంవత్సరం సభ్యత్వం నమోదు చేయటం జరిగింది. మంగళగిరి తాడేపల్లి అన్నపూర్ణ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నందు శ్రీ పవన్ కళ్యాణ్ సభ్యులకు ఈ రోజు 5 లక్షలు అందజేయడం జరిగింది. చీరాల నియోజకవర్గం జనసైనికులు తరుపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు పవన్ కళ్యాణ్ మరెన్నో కార్యక్రమాలు చేయాలని, భీమా పథకం పొందిన సభ్యులు తల్లి ముత్తుకూరి మల్లేశ్వరి తండ్రి ముత్తుకూరి నాగేశ్వరరావు తెలియజేశారు. పవన్ కళ్యాణ్‌కి రుణపడి ఉంటామని అన్నారు. జనసేన పార్టీ కొణిదల నాగబాబుకి పీఏసీ చైర్మన్ నాదెళ్ళ మనోహర్ కి హరిప్రసాద్‌కి, షేక్ రియాజ్‌కి, ఆలా అనిల్‌కి, పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం చీరాల నియోజకవర్గం తరుపున జనసేన సీనియర్ నాయకులు సెంట్రల్ ఆంధ్ర జోన్ కమిటీ సభ్యులు అలా శ్రీధర్ రుణపడి ఉంటామని తెలిపారు. చీరాల కత్తుల గోపి, జి.నవీన్, జనసేన నాయకులు, జనసేన జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## మన్నేపల్లి లక్ష్మీ వెంకట హర్షిణిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కదిరి కుటుంబ సభ్యులు

**సీఎస్‌పురం, నవంబర్ 24, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సీఎస్‌పురం పట్టణానికి చెందిన మాజీ మండల తెలుగు యువత అధ్యక్షులు మన్నేపల్లి రవికుమార్ కుమార్తె లక్ష్మీ వెంకట హర్షిణి పుష్పాలంకరణ వేడుకలకు ఆదివారం కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు సతీమణి రాణి కుమార్తె శిల్ప హాజరై చిన్నారి లక్ష్మీ వెంకట హర్షిణిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన రాయుడు, మహేంద్ర, మన్నేపల్లి రవికుమార్, మన్నేపల్లి సురేష్, మన్నేపల్లి నవీన్, బోయిన లక్ష్మయ్య, బోయిన మహేంద్ర, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



25-11Pg5 9TH_25-11Pg5.qxd 24/Nov/25 9:45 PM Page 1



# సిఎం ఎవరైనా హైకమాండ్ నిర్ణయమే!

## సిఎంగా నేను, డిప్యూటి సిఎంగా డికే కట్టుబడాల్సిందే: సిద్దరామయ్య



**బెంగళూరు, నవంబరు 24:** కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ప్రచారాలు జోరందుకున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు రెండు వర్గాలకు చెందిన నేతలు హస్తినను చుట్టేస్తుండటంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. దీనిపై సిద్ధరామయ్య సోమవారంనాడు ఆచితూచి స్పందించారు. కాంగ్రెస్ అధిష్ఠానం కోరుకుంటే తాను ఐదేళ్లు సీఎంగా కొనసాగుతానని చెప్పారు. తుది నిర్ణయం పార్టీ కేంద్ర నాయకత్వానిదేనని, అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తానూ, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అంగీకరించాల్సి ఉంటుందని చెప్పారు. నాలుగైదు నెలల క్రితమే మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం అంగీకరించిందని, అయితే ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసేంత వరకూ ఆగాల్సిందిగా తాను సూచించానని సిద్ధరామయ్య చెప్పారు. ఇప్పుడు హైకమాండ్ ఏమి చెప్పినా ఆ ప్రకారమే నడుచుకుంటామని అన్నారు. రెండున్నరేళ్లకు అధికార బదలాయింపుపై ఒప్పందం ఏదైనా ఉందా అని అడిగినప్పుడు అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని ముక్తసరిగా ఆయన సమాధానమిచ్చారు. మరోవైపు, డీకే శివకుమార్‌కు విధేయులైన పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానం పెద్దలను కలుసుకునేందుకు ఆదివారం రాత్రి ఢిల్లీ వెళ్లారు. ఎమ్మెల్యేలు హెచ్‌సీ బాలకృష్ణ (మాగడీ), కేఎం ఉదయ్ (మద్దూరు), నయన మోటమ్మ (ముదిగేరి), ఇక్బాల్ హుసన్ (రామనగర), శరత్ కుమార్ బచే గౌడ (హోసకోటే), శివగంగ బసవరాజ్ (చన్నగిరి)లు ఢిల్లీ వెళ్లిన టీమ్‌లో ఉన్నారు. మరికొందరు డీకే అనుకూల ఎమ్మెల్యేలు కూడా హస్తినకు వెళ్లొచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం బెంగళూరులో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఢిల్లీకి తిరిగి వెళ్తుండగా, సీనియర్ నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటన నుంచి తిరిగి రానున్నారు. గత వారంలోకూడా డీకే విధేయ ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లి ఖర్గేను కలిసారు. సిద్ధరామయ్య సైతం ఖర్గేతో బెంగళూరులో సుదీర్ఘ మంతనాలు జరిపారు. అయితే, మంత్రివర్గ విస్తరణను ముందుగా చేపట్టాలని సిద్ధరామయ్య కోరుతుండగా, నాయకత్వం అంశాన్ని ముందుగా తేల్చాలని డీకే శివకుమార్ కోరుతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటకలో సీఎం మార్పుపై ఊపందుకున్న ఊహాగానాలకు ఇటీవల తెరపడినట్లే పడినా వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చినట్లు కనిపిస్తోంది. ఇటు సీఎం సిద్ధరామయ్య వర్గం, అటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గం ఎవరికి వారే మొండిపట్టు మీద ఉన్నారు. ఐదేళ్లు తానే సీఎంనని సిద్ధరామయ్య, సిద్ధరామయ్యే పూర్తికాలం సీఎంగా ఉంటారని డీకే శివకుమార్ బయటికి ప్రకటించినా లోపల మాత్రం లొసుగులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏకంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వచ్చి రెండు వర్గాల మధ్య సయోధ్యకు ప్రయత్నించడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. ఈ క్రమంలో తాజాగా సిద్దరామయ్య మాట్లాడుతూ.. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను, సిద్ధరామయ్య కట్టుబడి ఉండాలని అన్నారు. అధిష్ఠానం నిర్ణయాన్ని ఇద్దరం అంగీకరించి తీరాల్సిందేనని చెప్పారు. హైకమాండ్ నిర్ణయానుసారమే తాము నడుచుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఐదు నెలల క్రితం తాము హైకమాండ్‌ను కలిసినప్పుడు మంత్రి వర్గాన్ని విస్తరించాలని సూచించారని, అందుకు తాను రెండున్నరేళ్ల పాలన ముగిసిన తర్వాత విస్తరణ చేస్తామని చెప్పానని, ఆ మేరకు ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ కోసం కసరత్తు చేస్తున్నామన్నారు.



### అయోధ్య రామమందిరంపై

# నేడు ధర్మధ్వజ వేడుక

### హాజరుకానున్న ప్రధాని మోడీ

### అటునుంచి కురుక్షేత్రకు పిఎం

### బ్రహ్మ సరోవర్‌లో ప్రత్యేక పూజలు

**న్యూఢిల్లీ, నవంబరు 24:** అయోధ్యలో రామమందిరం శిఖరంపై మంగళవారం ధర్మధ్వజారోహణ వేడుక జరుగనుంది. ఈ ధర్మ ధ్వజారోహణ వేడుక కోసం 100 టన్నుల పూలతో రామయ్య సన్నిధిని అలంకరించారు. భారీగా భక్తులు అయోధ్యకు తరలివచ్చారు. రామ మందిరం ప్రధాన నిర్మాణ పనులన్నీ పూర్తయిన సందర్భంగా ఆలయం గర్భగుడిపై కాషాయ రంగులోని 191 అడుగుల ధర్మ ధ్వజాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎగురవేయనున్నారు. ఈ అరుదైన అవకాశం ప్రధాని సొంతం చేసుకున్నారు. దీనిపై ఓం, సూర్యుడు, కోవిదర చెట్టు చిహ్నాలు ఉంటాయి. అయితే, ఓం అనేది ఆధ్యాత్మిక ధ్వని. సూర్యుడు రాముడి సూర్యవంశ వంశానికి సూచిక. మందార, పారిజాత మొక్కలను రిషి కశ్యపుడు సంకరం చేస్తే కోవిదార్ చెట్టు పుట్టింది. మేవార్ చిత్ర రామాయణంలో అయోధ్య శ్రీరాముడి జెండా పెయింటింగ్ ఉండటాన్ని ప్రముఖ సాంస్కృతిక వ్యవహారాల పరిశోధకుడు లలిత్ మిశ్రా గుర్తించారు. వాల్మీకి రామాయణం అయోధ్య కాండలోనూ ఈ జెండా గురించి ప్రస్తావన ఉందని ఆయన ధ్రువీకరించారు. ఇప్పుడు ఆ సమాచారం ప్రకారమే జెండాను రూపొందించి అయోధ్య రామయ్య సన్నిధిలో ఎగురవేయబోతున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం ఉదయం అయోధ్యలో రామాలయ శిఖిరంపై ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొననంతరం, హర్యానాలోని కురుక్షేత్రను సందర్శిస్తారు. అక్కడ శ్రీకృష్ణుని పవిత్ర శంఖం గౌరవార్థం నిర్మించిన 'పాంచజన్య' ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆయన మహాభారత అనుభవ కేంద్రాన్ని సందర్శిస్తారు. అలాగే తొమ్మిదవ సిక్కు గురువు శ్రీగురు తేజ్ బహదూర్‌జీ 350వ షహీద్ దివస్ సందర్భంగా ప్రధాని మోడీ నివాళి అర్పిస్తారు. ప్రత్యేక నాణెం, స్మారక స్టాంపును విడుదల చేయనున్నారు. ఆ తర్వాత బ్రహ్మ సరోవర్‌లో పూజలు నిర్వహించనున్నారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 5 వరకు కురుక్షేత్రలో జరుగుతున్న అంతర్జాతీయ గీతా మహోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొననున్నారు.

### భారత్ అమ్ముల పొదిలో మరో అస్త్రం

# వాటర్ క్రాఫ్ట్ 'ఐఎన్‌ఎస్ మహే'!



**ముంబయి, నవంబర్ 24:** భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ ఐఎన్‌ఎస్ మాహె సోమవారం నౌకాదళం సర్వీసులో చేరింది. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది దీన్ని నేవీకి అప్పగించారు. కొచ్చిన షిప్‌యార్డులో నిర్మించిన ఈ ఐఎన్‌ఎస్ మాహెలో 80 శాతం స్వదేశీ సాంకేతికతను వినియోగించారు. సైలంట్ హంటర్‌గా పిలిచే ఈ నౌక వెస్టర్న్ సీబోర్డు ఆధీనంలో కార్యకలాపాలు కొనసాగించనుంది. మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం మాహె పేరును ఈ నౌకకు పెట్టారు. దీని పై భాగంలో 'ఉరుమి'ని ఏర్పాటు చేశారు. ఇది కలరియపట్టులో ఉపయోగించే ఒక రకమైన ఆయుధం. పొడవైన సన్నని కత్తి ఇది. చురుకుదనం, కచ్చితత్వం, యుద్ధ సమర్థతను ఇది సూచిస్తుంది. ఈ నౌక రాకతో సముద్ర తీరాలపై భారత ఆధిపత్యం మరింత పటిష్టం కానుంది. జలాంతర్గాములను వేటాడేందుకు, తీర ప్రాంతంలో గస్తీని నిర్వహించేందుకు దీన్ని అధునాతన సామర్థ్యాలతో నిర్మించారు. సముద్ర గర్భంలో నిఘాతో పాటు రెస్క్యూ మిషన్లలోనూ ఈ నౌక పాల్గొననుంది. ధ్వని తక్కువగా ఉండే ఈ వాటర్ క్రాఫ్ట్ నీటిలో చాలా నిశ్శబ్దంగా కదులుతుంది. దీంతో శత్రు జలాంతర్గాములు దీని రాకను గుర్తించలేవు. అందుకే దీన్ని 'సైలెంట్ హంటర్'గా పిలుస్తున్నారు. ఇందులోని సోనార్ సిస్టమ్ అదనపు ఆకర్షణ. శత్రు జలాంతర్గాములు, మైన్స్, సముద్రంలో ఇతర ముప్పులను కనిపెట్టేందుకు ఈ వ్యవస్థే నౌకకు కళ్లు, చెవులుగా పనిచేస్తుంది. డిఆర్డీవో అభివృద్ధి చేసిన అభయ్ హల్ మౌంటెడ్ సోనార్ వ్యవస్థను ఇందులో ఏర్పాటుచేశారు. దీంతో నౌకచుట్టూ ఉన్న ప్రాంతాలను నిరంతరం గమనించే వీలు ఉంటుంది. జలాంతర్గాముల శబ్దాలు, వాటి కదలికలను ఇది వేగంగా గుర్తిస్తుంది. ఇందులోని లో ఫ్రీక్వెన్సీ వేరియబుల్ డెప్త్ సోనార్ వ్యవస్థ సాయంతో సమునరదంలో చాలా లోపలి వరకు నిఘా వేసేందుకు వీలు లభిస్తుంది. ఈ నౌక నుంచి ఓ కేబుల్ విడిపోయి సముద్ర గర్భంలో శత్రు ముప్పును పసిగడుతుంది. ఈ నౌకలో ఐఆర్‌ఎల్ యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ లాంఛర్, యాంటీ సబ్‌మెరైన్ మైన్స్, రిమోట్ కంట్రోల్ గన్ వంటి ఆయుధ వ్యసవ్థలు ఉన్నాయి. తక్కువ లోతు ఉండే ప్రాంతాల్లో ఇది చాలా సమరనదంగా పనిచేయగలదు. గంటకు 25 నాటికల్ మైళ్ల వేగంతో వెళ్లగలదు. ఈ నౌకలో 57 మంది సిబ్బంది పనిచేస్తారు.

# రెండు ఘోర ప్రమాదాలు

### రెండు బస్సులు ఢీ - ఎనిమిది మంది మృతి



**చెన్నై,నవంబరు 24:** తమిళనాడు రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరి గింది. రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తెన్కాసి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అతివేగమే ప్రమాదానికి కారణంగా స్థానికులు చెబుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురై నుంచి సెంకోట్టైకు వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు, తెన్కాసి నుంచి కోవిల్పట్టి వైపు వెళ్తున్న మరో బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా సుమారు 28 మంది గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరోవైపు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మధురై నుంచి సెంకోట్టైకు వెళ్తున్న బస్సు డ్రైవర్ నిరక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

### లోయలో పడిన బస్సు ఐదుగురు మృతి, పలువురికి గాయాలు



**డెహ్రాడూన్, నవంబరు 24:** ఉత్తరాఖండ్‌లో ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. తెహ్రీ జిల్లాలోని నరేంద్రనగర్ ప్రాంతంలో ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు కుంజాపురిహిండోలఖల్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి 70 మీటర్ల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాద సమయంలో బస్సులో 30 నుంచి 35 మంది వరకూ ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. బస్సు ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


## షాంఘై ఎయిర్‌పోర్టులో అరుణాచల్ మహిళకు అవమానం



**షాంఘై, నవంబరు 24:** చైనా మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ భారతీయ మహిళను షాంఘై విమానాశ్రయంలో 18 గంటల పాటు నిర్బంధించి తీవ్రంగా వేధించింది. ఆమె పాస్‌పోర్ట్‌పై, పుట్టిన ప్రదేశంగా అరుణాచల్ ప్రదేశ్ అని ఉండటమే ఇందుకు కారణం. ఆ రాష్ట్రం తమ భూభాగమని వాదిస్తూ, ఆమె భారత పాస్‌పోర్ట్ చెల్లదని చైనా ఇమ్మిగ్రేషన్ అధికారులు దురుసుగా ప్రవర్తించారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పేమా వాంగ్ థోంగ్‌డోక్ అనే మహిళ ఈ నెల 21న లండన్ నుంచి జపాన్ వెళ్లేందుకు షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో విమానం మారాల్సి వచ్చింది. అయితే, ఆమె పాస్‌పోర్ట్‌ను పరిశీలించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు, పుట్టిన ప్రదేశంగా అరుణాచల్ ప్రదేశ్ ఉండటంతో ఆమెను అడ్డుకున్నారు. అరుణాచల్ ప్రదేశ్ చైనాలో భాగం, కాబట్టి మీ భారత పాస్‌పోర్ట్ చెల్లదు అని వాదించి, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చైనా అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనను ఎగతాళి చేశారని, చైనా పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని హేళనగా మాట్లాడారని బాధితురాలు సోషల్‌మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 18 గంటల పాటు ఆహారం, ఇతర సౌకర్యాలు నిరాకరించి, జపాన్ వెళ్లాల్సిన విమానాన్ని కూడా ఎక్కనివ్వలేదని ఆమె తెలిపారు. చివరికి యూకేలోని తన స్నేహితురాలి ద్వారా షాంఘైలోని భారత కాన్సులేట్‌ను సంప్రదించడంతో వారి జోక్యం తర్వాత ఆమెను విడిచిపెట్టారు. ఈ ఘటన భారత సార్వభౌమత్వానికి జరిగిన అవమానమని, దీనిపై చైనాను నిలదీయాలని ఆమె ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకొని, తనకు జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని కోరారు. అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తున్న విషయం తెలిసిందే.

## సంక్షిప్తంగా..

### ఉక్రెయిన్‌కు కృతజ్ఞత లేదన్న ట్రంప్.. థాంక్స్ చెప్పిన జెలెన్‌స్కీ



**వాషింగ్టన్, నవంబరు 24:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో శాంతి ప్రణాళికను ఒప్పించేందుకు ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. దీనిలో భాగంగా ఆయన ఉక్రెయిన్ ప్రభుత్వానికి కొంచెం కూడా కృతజ్ఞత లేదంటూ ట్రూత్‌లో పోస్టు చేశారు. మరోవైపు ఆంక్షలు ఉన్నా ఐరోపా దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూనే ఉన్నాయని ఆరోపించారు. తాను అధికారంలో ఉంటే ఉక్రెయిన్-రష్యా యుద్ధం అసలు జరిగేదే కాదని పేర్కొన్నారు. ఈ పోస్టు సంచలనం సృష్టించింది. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన స్పందనను ఎక్స్ వేదికగా బలంగా వినిపించారు. తొలుత ఆయన అమెరికాకు ధన్యవాదాలు తెలిపారు. జావెలిన్ క్షిపణులు ఇచ్చి ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలు కాపాడారని చెప్పారు. తాము శాంతి, దౌత్యం, అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

### అఫ్గాన్‌లో పెట్టుబడులు పెట్టే భారత కంపెనీలకు ఉచిత భూములు!



**కాబూల్, నవంబరు 24:** భారత్‌తో తమకున్న దశాబ్దాల మైత్రీబంధాన్ని పురస్కరించుకుని ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం తమ దేశంలో పెట్టుబడులు పెట్టే భారతీయ కంపెనీలకు ఉచితంగా భూములు కేటాయిస్తామని ప్రకటించింది. దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు భారత పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఈ మేరకు భారత కంపెనీలను ఆహ్వానించింది. ఉచితంగా భూములు ఇవ్వడంతో పాటు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని రకాల మౌలిక సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చింది. భారత కంపెనీలు తమ దేశంలో పరిశ్రమలు స్థాపించి, ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని ఆఫ్ఘనిస్థాన్ విజ్ఞప్తి చేస్తోంది.

### ఢిల్లీ వాయుకాలుష్యనిరసనల్లో హిడ్మా పోస్టర్లు




**న్యూఢిల్లీ, నవంబరు 24:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. ఇండియా గేట్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఆందోళనలో నిరసనకారులు పోలీసులపై పెప్పర్ స్ప్రేతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కొందరు ఇండియా గేట్ వద్ద నిరసనకు దిగారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కమాండర్ మాద్వి హిడ్మా పోస్టర్లను కూడా వారు ప్రదర్శించారు. ఇండియా గేట్ వద్ద నిరసనలకు అనుమతి లేదని, జంతర్ మంతర్ వద్దే ఆందోళనలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని పోలీసులు నిరసనకారులకు సూచించారు.

### ఐసియులో బంగ్లా మాజీ ప్రధాని ఖలీదాజియా



**ఢాకా, నవంబరు 24:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధ్యక్షురాలు బేగం ఖలీదా జియా (79) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా ఆమెను కుటుంబ సభ్యులు నిన్న రాత్రి ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఖలీదా జియాకు యాంటీబయాటిక్స్‌తో తక్షణ చికిత్స ప్రారంభించినట్లు ఆమెకు చికిత్స అందిస్తున్న వైద్య బృందం వెల్లడించింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం క్రిటికల్‌గానే ఉన్నప్పటికీ, త్వరలోనే మెరుగయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె చికిత్సకు అమెరికాలోని ప్రఖ్యాత జాన్స్ హాప్కిన్స్ ఆసుపత్రి నిపుణులు కూడా వర్చువల్‌గా సహాయం అందిస్తున్నారు.


## అమెరికా ఆంక్షల ప్రభావం - భారీగా పెరిగిన చమురు ట్యాంకర్ల ధరలు



**వాషింగ్టన్, నవంబరు 24:** రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ముడిచమురు కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చమురు రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు అమాంతం పెరిగాయని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇవి ఐదేళ్ల అత్యధికానికి చేరుకున్నాయని వెల్లడించాయి. పుతిన్ అనుచితంగా చేస్తున్న యుద్ధానికి ప్రతిగా రష్యాలోని అతిపెద్ద చమురు కంపెనీలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌లపై ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ఆంక్షలు నవంబరు 21 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఈ సంస్థల నుంచి ప్రధానంగా చమురు కొనుగోళ్లు జరుపుతోన్న భారత, చైనీస్ రిఫైనరీలు ఇప్పటికే అప్రమత్తమయ్యాయి. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించుకున్నాయి. ఆ సమయంలో డిమాండు అనుగుణంగా మధ్యప్రాచ్యం, అమెరికా ఉత్పత్తిదారుల నుంచి దిగుమతి పెంచాయని ఆ కథనాలు పేర్కొన్నాయి. నిర్దిష్ట మార్గాల్లో మధ్యప్రాచ్యం నుంచి చైనాకు 2 మిలియన్ బారెల్ల చమురును రవాణా చేయగల క్యారియర్ల ధర గత వారం నాటికి రోజుకు 1,37,000 డాలర్లకు పెరిగింది. అంటే ఈ యేడాదిలో 576 శాతం పెరిగిందని వెల్లడించాయి. 2020 తర్వాత ఇదే అత్యధిక ధర కావడం గమనార్హం. ఇదిలా ఉంటే... సమీం భవిష్యత్‌లో రష్యా నుంచి మన దేశ చమురు దిగుమతులు గణనీయంగా తగ్గొచ్చని, అయితే అవి పూర్తిగా ఆగిపోవని విశ్లేషకులు అంటున్నారు. ఈ యేడాది రష్యా నుంచి మన దేశ ముడిచమురు దిగుమతులు రోజుకు సగటున 1.7 మిలియన్ బ్యారెల్లుగా ఉన్నాయి. రిఫైనరీ సంస్థలు రాయితీ కొనుగోళ్లను అధికం చేయడంతో గత నెలలో ఇవి రోజుకు 1.8-1.9 మిలియన్ బ్యారెల్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే డిసెంబరు, జనవరిలో మాత్రం దిగుమతులు గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమీప కాలంలో రోజుకు 4 లక్షల బ్యారెల్లకు పరిమితం కావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సింధ్‌ప్రావిన్స్ ఏదో ఒకరోజు భారత్‌లో విలీనం

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ,నవంబరు 24:** పాకిస్థాన్‌లోని సింధ్ ప్రాంతం ఏదో ఒక రోజు తిరిగి భారతదేశంలో కలవొచ్చని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌లో అంతర్భాగమైన సింధ్‌తో భారత్‌కు విడదీయరాని నాగరికత, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయన కొత్త చర్చకు తెరలేపారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిన్న విశ్వ సింధీ హిందూ ఫౌండేషన్ నిర్వహించిన "సశక్త్ సమాజ్ సమృద్ధ్ భారత్" కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భౌగోళికంగా సింధ్ ప్రస్తుతం మనతో లేకపోవచ్చు. కానీ నాగరికత పరంగా అది ఎప్పుడూ భారతదేశంలో అంతర్భాగమే. చరిత్రలో సరిహద్దులు ఎన్నోసార్లు మారాయి. ఎవరు చెప్పగలరు, భవిష్యత్తులో సింధ్ మళ్లీ మన దేశంలో కలవొచ్చేమోనని ఆశాభావం వ్యక్తం చేశారు. సింధ్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కె. అద్వానీని ప్రస్తావిస్తూ.. దేశ విభజనను సింధీ హిందువులు మానసికంగా ఎప్పటికీ అంగీకరించలేదని అన్నారు. సింధు నది పవిత్రత గురించి మాట్లాడుతూ, హిందువులకు సింధు నది ఎంత పవిత్రమో, అక్కడి ముస్లింలు కూడా ఆ నది నీటిని మక్కాలోని జమ్ జమ్ నీటితో సమానంగా భావించేవారని అద్వానీజీ రాశారు" అని గుర్తుచేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) కూడా ఎలాంటి సైనిక చర్య లేకుండానే భారత్‌లో విలీనమవుతుందని తాను గతంలో మొరాకోలో చేసిన వ్యాఖ్యలను రాజ్‌నాథ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. పీఓకే ప్రజలే పాకిస్థాన్ నుంచి విముక్తి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు.

## భారత్ అంధ మహిళా క్రికెట్ జట్టు విజయం గర్వకారణం



విజయవాడ, నవంబరు 24,ప్రభాతవార్త ప్రతినిధి: భారత అంధ మహిళల క్రికెట్ జట్టు...తొలి టి20 వరల్డ్ కప్ విజేతగా నిలవడం దేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు కొనియాడారు. వారి అంకిత భావం స్ఫూర్తిదాయకమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్రికెట్ బృందానికి అభినందనలు తెలిపారు. భారత జట్టు గెలుపుపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్,శాప్ చైర్మన్ రవినాయుడు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన తెలుగు తేజం పి.కరుణకుమారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

### గెలుపు చారిత్రాత్మకం : నారా లోకేష్

భారత అంధ మహిళల క్రికెట్ జట్టు టి20 వరల్డ్‌కప్ గెలవడం చారిత్రాత్మకమని మంత్రి నారా లోకేష్ కొనియాడారు. జట్టు సభ్యులకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. 'ఇది దేశానికి అత్యున్నత గౌరవాన్ని తెచి ్చన సందర్భం.అంతర్జాతీయ వేదికపై వారు చూపిన ధైర్యం,ధృఢ సంకల్పం ఆనందదాయకం' అని పేర్కొన్నారు.

## 'కరుణకుమారి ప్రతిభ రాష్ట్రానికే గర్వకారణం'

విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: టి20 వరల్డ్‌కప్ ఫైనల్‌లో నేపాల్‌పై అద్భుత విజయాన్ని సాధించిన భారత జట్టుకు దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుభాకాంక్షలు తెలిపారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని కరుణకుమారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆమెకు ప్రభుత్వం తరపున ప్రత్యేక శిక్షణ ఇప్పించి ప్రోత్సహించామని పేర్కొన్నారు. ఆమె ప్రతిభ రాష్ట్రానికే గర్వకారణమన్నారు.

## కౌశల్య టీచర్ బోధన ప్రశంసనీయం: నారా లోకేష్

విజయవాడ, నవంబరు 24 పభాతవార్త ప్రతినిధి: ఆటపాటలతో అలరిస్తూ సామెతలు, సూక్తులతో అనంతపురం జిల్లా పైదొడ్డి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల టీచర్ బుకె రామిరెడ్డిపల్లి కౌసల్య చేస్తున్న బోధన ప్రశంసనీయమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'ఇంగ్లీష్ మేడ్ ఈజ లెట్స్ లెర్న్ విత్ టెక్నిక్స్ అనే విధానంలో ఆంగ్లం, గణితం సబ్జెక్టులను ఆమె సులువుగా నేర్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఆమె చేస్తున్న కంటెంట్ బాగుంది' అని ఎక్స్‌లో మంత్రి నారా లోకేష్ పేర్కొనా ్నరు.

## ఇంటర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్పం'

విజయవాడ. నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు "సంకల్పం" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్య బోర్డు 50 రోజులపాటు ఈ కార్యక్రమం చేపట్టాలని ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ పిరంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. నేటి నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం అమలు చేయాలని తెలిపారు. కళాశాలలను 5 గంటల వరకు నిర్వహించాలని వెల్లడించారు. బ్రాంచ్‌ల ఆధారంగా నిర్వహించాల్సిన టైమ్ టేబుల్‌ను కూడా విడుదల చేశారు. ఉదయం 9:10 నుంచి మధ్యాహ్నం 12:40 గంటల వరకు సిలబస్ పూర్తి చేయాలని, మధ్యాహ్నం 1:20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిలబస్ రివిజన్, ట్యూటోరియల్ వర్క్, స్లిప్ టెస్టులు మాత్రమే నిర్వహించాలని పేర్కొన్నారు. డిసెంబరు 15 నుంచి 20వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. స్టడీ అవర్స్ జరుగుతున్న సమయంలో జిల్లా అధికారులు వారానికి మూడు కళాశాలలను, ప్రాంతీయ అధికారులు రెండు కళాశాలలను సందర్శించి ఈ కార్యక్రమం అమలుపై పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆదేశించారు.

## పంట కాల్వలో గోనెసంచిలో మృతదేహం

విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ కృష్ణాజిల్లాలో గోనెసంచిలో మృతదేహం కలకలం రేపింది. జిల్లాలోని వత్సవాయి మండలంలో ఈ ఘటన జరిగినట్లు చెబుతున్న పోలీసుల వివరాల ప్రకారం... ఎన్టీఆర్ కృష్ణాజిల్లా వత్సవాయి మండలంలోని మంగొల్లు - దేశవాయి గ్రామాల మధ్య ఉదయం వ్యాహాళికి వెళ్ళిన రైతులకు పంటకాలువలో ఓ గోనెసంచి కనబడింది. దానిని విప్పి చూడగా అందులో ఓ మృతదేహం కనబడటంతో భయభ్రాంతులకు గురైన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు... ఆ మృతదేహం ఓ మహిళదిగా తేల్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ మహిళ ఎవరు అనే విషయంపై వివరాలు సేకరిస్తున్నారు. మహిళను చంపి గోనెసంచిలో తెచ్చి పంట పొలాల మధ్య వదేయడం స్థానికంగా కలకలం రేపింది.



## స్పేస్ ఆన్ వీల్స్.. వినియోగించుకోవాలి

విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికతపై విద్యార్థులు, యువతలో ఉత్సుకతను పెంపొందించేందుకు ఇస్రో అంతరిక్ష పరిజ్ఞానంపై సమగ్రంగా దృశ్యరూపం కల్పించేందుకు స్పేస్ ఆన్ వీల్స్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్పేస్ ఆన్ వీల్స్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ విజయవంతంగా ముందుకు సాగుతోందని నగర విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా ఆదివారం, సోమవారం రెండురోజుల పాటు ఈ ప్రదర్శనను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. భారతదేశ తొలి ఉపగ్రహ వాహక నౌక నుంచి తాజాగా ఇస్రో ప్రయోగాల వరకు, లాంచ్‌ప్యాడ్స్, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తదితర విషయాలపై పరిజ్ఞానాన్ని పెంచేలా ప్రదర్శనలు ఉన్నాయన్నారు. వివిధ నమూనాలను చూడటం, వాటి విషయాలను తెలుసుకోవడం ద్వారా అంతరిక్ష విజ్ఞానం విశాసానికి వీలవుతుందన్నారు. సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను వివరించడంతో పాటు అంతరిక్ష రంగంపై విద్యార్థులకు ఆసక్తిని కలిగించేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో షార్ టెక్నికల్ అధికారి కిరణ్ పాల్గొన్నారు. స్పేస్ ఆన్ వీల్స్ సందర్శనకు వస్తున్న విద్యార్థులకు కిరణ్ భారత అంతరిక్ష విజయయాత్ర గురించి వివరిస్తున్నారు.

# మన్యంలో నల్ల రాయి కనుమరుగు?!

● పెరిగిపోతున్న అక్రమ తవ్వకాలు ● సొమ్ము చేసుకుంటున్న బీనామీలు ● అనుమతులొకచోట.. తవ్వకాలు మరోచోట ● మార్కెట్లో గిరాకీతోనే బరితెగింపు ● అక్రమ క్వారీపై దర్యాప్తు చేస్తాం: జిల్లా మైనింగ్ అధికారి



ఉమ్మడి విశాఖపట్నం, నవంబరు 24 ప్రభాతవార్త: అల్లూరి సీతా రామరాజు జిల్లాలో మైనింగ్ మాఫియా రాజ్యమేలుతోంది. మాఫియా కన్ను పడి నల్ల రాయి క్వారీలు బక్కచిక్కిపోతున్నాయి. క్వారీ తవ్వకాలు అక్రమంగా యథేచ్ఛగా నిర్వహిస్తూ.. జేబులు నింపేసు కుంటున్నారు. పరపతి పెట్టుబడిగా పెట్టి గిరిజనుల పేరిట నల్ల రాయి క్వారీలు మంజూరు చేయిస్తూ బినామీల దందా కొనసాగిస్తున్నారు. మైనింగ్ అధికారుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను కరిగించేస్తూ.. కాసులు కొల్లగొడుతున్నారు. అక్రమ మైనింగ్‌కి కేంద్రంగా వెలుగొందుతున్న జి.మాడుగుల మండల పరిధిలోని జి. నిట్టపుట్టు, ఈదుల బయలు గ్రామాల సమీపంలో ఉన్న నల్ల రాయి క్వారీని.. సింగర్భా పంచాయతీ పేరు మీద అనుమతులు తీసుకొని అడ్డగోలు తవ్వకాలు చేసున్నా.. మైనింగ్ అధికారులు ఎందుకు నియంత్రించలేకపోతున్నారో అర్థం కాని పరిస్థితి. లక్షల్లో ముడుపులు తీసుకుంటుండడంతోనే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే వాదన బలం వినిపిస్తోంది. ఓ పక్క అక్రమ తవ్వకాలు చేపడుతూ.. సినీ ఫక్కీలో ప్రభుత్వానికి బినామీ నిర్వాహకులు సవాలు విసురుతున్నారు. అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి.. జేబులు నింపుకుంటున్న విషయన్ని అప్పటి పాడేరు ఎమ్మెల్యే కొత్తగుల్లి భాగ్యలక్ష్మి ్మ ఫిర్యాదు మేరకు విశాఖ జిల్లా అనకాపల్లిలో మైనింగ్ అధికారులు ఆక్రమ తవ్వకాలు గుర్తించి అపరాధ రుసుం విధించారు. తవ్వకాలు తక్షణమే నిలిపేయాలని ఆదేశించారు. వాహనాలను సైతం పోలీస్ స్టేషన్‌లో పెట్టించి నోటీసులు జారీచేయడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో క్వారీ నిర్వాహకులు కొంతకాలం తవ్వకాలు నిలిపివేశారు. ఆ తరువాత వ్యూహాత్మకంగా వ్యవహరించి పోలీస్ స్టేషన్ నుంచి వాహనాలు తీసుకుపోయారనే ఆరోపణలు వున్నాయి. కాగా.. ప్రభుత్వానికి గతంలో చెల్లించాల్సిన బకాయిని ఎగ్గొట్టడమే కాకుండా, ఆదాయానికి కూడా గండి కొట్టేందుకు ఎత్తు వేశారు. బినామీ పేరుతో తవ్వకాలు మొదలు పెట్టినా అధికారులు ఎవరూ అడ్డు చెప్పకపోవడంతోనే కొండలను డోలిసేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా పాడేరు డివిజన్ ఏజెన్సీలో నాలుగు క్వారీలు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయని, అవి జి.నిట్టాపుట్టు, కొట్నాపల్లి, దేవపాలెం, మఠం క్వారీలు మాత్రమే ఉన్నాయని సాక్షాత్తు జిల్లా మైనింగ్ అధికారి ఆనంద్ పేర్కొన డం... ఈదురబయలు క్వారీ మైనింగ్ అధికారుల దృష్టిలో లేకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఈ క్వారీలో సుమారు ఏడాదిన్నరగా బ్లాస్టింగ్‌లు చేసి నల్లరాయి తీస్తూ కొట్లాది రూపాయలు వ్యాపార లావాదేవీలు జరిగినా కొండను పూర్తిగా తవ్వేసినా అధికారుల దృష్టిలో లేకపోవడంపై విడ్డూరంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

### అక్రమ క్వారీపై దర్యాప్తు చేస్తాం :జిల్లా మైనింగ్ అధికారి స్పష్టీకరణ

జి.మాడుగుల మండలంలో జి.నిట్టాపుట్టు క్వారీకి మాత్రమే అనుమతి ఉందని, ఈదుల బయలులో అక్రమ క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయని వచ్చిన వార్త కథనంపై దర్యాప్తు చేస్తామని, అక్రమ తవ్వకాలు జరిగితే చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి ఆనంద్ స్పష్టం చేశారు. జి.మాడుగుల మండలంలో జి.నిట్టాపుట్టు క్వారీకి మాత్రమే అనుమతులు ఉన్నాయని అక్రమంగా జరుగుతున్నట్టు వస్తున్న దానిపై ఏ సర్వే నెంబర్‌లో ఈ క్వారీ ఉందో రెవెన్యూ వారిని సంప్రదించనున్నట్లు జిల్లా మైనింగ్ అధికారి ఆనంద్ పేర్కొన్నారు.

# నర్సీపట్నంలో చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలు




నర్సీపట్నం, నవంబరు 24 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలను సోమవారం నర్సీపట్నంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 30 అడుగుల చింతకాయల విజయ్ భారీ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కటౌట్‌కు క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేసి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి, తీన్మార్ డప్పుల మోతలతో, బాణసంచా పేలుస్తూ సంబరాలను అంబరాన్నంటేలా నిర్వహించారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాలం మురళీకృష్ణ మాట్లాడుతూ, చింతకాయల విజయ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విజయ్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నైజం ఉన్న నాయకుడని, "చెప్పాడంటే చేస్తాడు అంతే" అని కొనియాడారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని గొప్ప పదవులు చేపట్టాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రుత్తల కృష్ణ, రావణపల్లి రిజర్వాయర్ చైర్మన్ రాజేశ్వరరావు, టిడిపి వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమంలో లేబర్ కోడ్స్ కీలకపాత్ర

**కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్**



విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్ కార్మికుల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తాయని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ తెలిపారు. కార్మికుల గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ సామాజిక భద్రత రంగంలో 9 చట్టాలను ఏకీకరించి కొత్త లేబర్ కోడ్ తెచ్చారన్నారు. ముఖ్యంగా అసంఘటిత రంగం, గిగ్ వర్కర్లు, ఇతర రకాల వర్కర్లకు సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని వెల్లడించారు. ఇపిఎఫ్, ఇఎస్ఐసి ప్రయోజనాలను అన్ని రంగాలకూ విస్తరించామన్నారు. తల్లి, తండ్రి, భార్య, పిల్లలు మాత్రమే కాకుండా అత్తామామలకు ఇఎస్ఐసి వైద్య సేవలు పొందేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఫ్యాక్టరీ నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో ప్రమాదం జరిగినా ఇఎస్ఐసి పూర్తి ప్రయోజనాలు వర్తిస్తాయని, మహిళలకు 26 వారాల మాతృత్వ సెలవు, అవసరమైతే ఇంటి నుంచి పని (వర్క్ ఫ్రం హోమ్) చేసే సౌకర్యం కల్పించామని తెలిపారు. 51 శాతం సభ్యత్వం ఉన్న ట్రేడ్ యూనియన్‌కు చట్టబద్ధ గుర్తింపు ఇస్తున్నామని చెప్పారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగుల వలే అన్ని ప్రయోజనాలూ వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఉద్యోగం కోల్పోయిన వారికి వర్కర్ రీ స్కిల్లింగ్ ఫండ్ నుంచి 15 రోజుల వేతనం అందిస్తామన్నారు. 300 మందికిపైగా ఉద్యోగులున్న సంస్థల్లో తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరన్నారు. కనీస వేతనం కన్నా తక్కువ చెల్లించే అవకాశాన్ని పూర్తిగా నిరోధించామని, ఓవర్ టైమ్‌కు రెట్టింపు వేతనం తప్పనిసరి చేసినట్లు చెప్పారు. పురుషులు, మహిళలకు సమాన వేతనం ఇవ్వాలన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించడం చట్టబద్ధమైన బాధ్యతగా పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికీ వార్షిక హెల్త్ చెకప్, అపాయింటెమెంట్ లెటర్, పెద్ద సంస్థల్లో సేఫ్టీ కమిటీలు తప్పనిసరన్నారు. వలస కార్మికులకు జర్నీ అలవెన్స్, పిడిఎస్ పోర్టబిలిటీ అందుబాటులో ఉందని తెలిపారు. డిజిటల్ మీడియా, డబ్బింగ్ ఆర్టిస్టులు కూడా కార్మిక రక్షణ పరిధిలోకి వస్తారని చెప్పారు. మహిళలకు రాత్రిపూట పనికి భద్రతా చర్యలతో అనుమతి, పని అనంతరం ఇంటి వరకూ భద్రతగా చేర్చే బాధ్యత యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు.

# ఇంధన పరిరక్షణ అవార్డులకు దరఖాస్తులు

● ఇంధన వినియోగ రంగాలు, సంస్థలు పాల్గొనాలి ● ఇంధన సామర్థ్యంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సంస్థలను గుర్తించేందుకు ఎస్ఈసిఏ2025 ఏర్పాటు ● ఎపిఎస్ఇసిఎం సిఇఓ ఎస్.నాగలక్ష్మి వెల్లడి

విజయవాడ, నవంబర్ 24 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రధాన ఇంధన వినియోగ రంగాలైన పరిశ్రమలు, విద్యాసంస్థలు, పట్టణ, స్థానిక సంస్థలు రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డు 2025(స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డు (ఎస్ఈసిఏ) పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఏపీజెన్కో మేనేజింగ్ డైరెక్టర్ ఏపీఎస్ఈసిఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఇంధన శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసిఎం) ఎస్ఈసిఏ 2025 ను వరుసగా ఐదో ఏడాది నిర్వహిస్తున్నట్లు సిఈఓ తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని ప్రధాన ఇంధన వినియోగ రంగాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించి, ఇంధన నిర్వహణ, ఆధునిక సాంకేతికతల వినియోగం, కార్బన్ ఉద్గారాల తగ్గింపు వంటి రంగాల్లో విశేష పురోగతి సాధించిన సంస్థలను గుర్తించడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఈ పోటీ ద్వారా మరెన్నో పరిశ్రమలు, సంస్థలను ఆధునిక ఇంధన పొదుపు విధానాలను అనుసరించేలా ప్రోత్సహిస్తోందని సిఈఓ తెలిపారు. ఇంధన వినియోగం, కనెక్టెడ్ లోడ్ ఆధారంగా అర్హత ఉన్న సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సిఈఓ కోరారు. ఎస్ఈసిఏ 2025లో భాగంగా ఏడాదికి 30,000 ఎంటీఓఈ (మెట్రిక్ టన్ ఆయిల్ ఈక్విటలెంట్)కు పైగా ఇంధన వినియోగం ఉన్న థర్మల్ పవర్ ప్లాంట్లు, సిమెంట్ పరిశ్రమలు, 1,000 ఎంటీఓఈకు పైగా వినియోగం ఉన్న ఫార్మా పరిశ్రమలు, 50 కిలోవాట్లు మరియు అంతకంటే ఎక్కువ కనెక్టెడ్ లోడ్ ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు (ప్రభుత్వ, ప్రైవేట్), హోటళ్లు పాల్గొనవచ్చని తెలిపారు. అదేవిధంగా ఏపీఎస్ఆర్టీసి బస్ డిపోలు, బస్ స్టాండ్లు, పట్టణ, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు కూడా పాల్గొనవచ్చని సిఈఓ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహాయ సహకారాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. విజయానంద్ మార్గనిర్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, తద్వారా ఇంధన సామర్థ్య చర్యలు రాష్ట్రంలో వేగంగా ముందుకు సాగుతున్నాయని సిఈఓ పేర్కొన్నారు.ఇంధన పరిరక్షణ అవార్డు పోటీలో పాల్గొనే సంస్థలను వారు తీసుకున్న ఇంధన పొదుపు చర్యలు, స్పెసిఫిక్ ఎనర్జీ కన్సంప్షన్ తగ్గింపు, అత్యుత్తమ సాంకేతికతలు, ఇంధన సామర్థ్య నిర్వహణ పద్ధతులు వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారని సిఈఓ తెలిపారు. ఎస్ఈసిఏ అవార్డు 2025లో పాల్గొనడం వలన రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభించడమే కాకుండా, మరిన్ని సంస్థలు ఇంధన సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రేరణ పొందుతాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న సంస్థలు ఎస్ఈసిఏ 2025కు సంబంధించిన దరఖాస్తులను అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తు మార్గదర్శకాలు, ప్రమాణాలు, ఫార్మాట్లు అన్నీ ఈ వెబ్ పోర్టల్‌లో (పోర్టల్ చిరునామా) అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ వచ్చే నెల 5వ తేదీ అని తెలిపారు. రాష్ట్ర ఇంధన భద్రత, సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు అన్ని రంగాలు చురుకుగా పాల్గొనాలని, ఈ ముఖ్య కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని ఏపీ జెన్కో ఎండి, సిఈఓ నాగలక్ష్మి విజ్ఞప్తి చేసారు.

## 5వేల మినీలు అంగన్వాడీలుగా మార్పు

**- రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి**

విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో 5వేల మినీలను అంగన్వాడీలుగా మార్పు చేశామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 217 మందికి అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించామని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. పిల్లల పోషణ,ఆరోగ్యం, ప్రీ స్కూలు సేవలను బలోపేతం చేస్తున్నామని, అందులో అంగన్వాడీ సిబ్బంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో అంగన్వాడీ సేవలను మరింత విస్తరించాలన్నారు. అంగన్వాడీ టీచర్ల వేతనం పెంచి,గ్రాట్యుటీ ఇచ్చిన ఘనత సిఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని స్పష్టం చేశారు. చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులకు పోషకాహారం అదించడంలో రాజీలేదని వెల్లడించారు.

## వైఎస్సార్సీ నేతల భాష సరికాదు

**ఎపి గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు**




గుంటూరు, నవంబర్ 24 ప్రభాతవార్త ప్రతినిధి: సభ్య సమాజం తలదించుకునేలా వైసీపీ నేతల భాష ఉందని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ఒకే న్యాయం ఉంటుంది. సంపన్నుడైనా, నిరుపేదైనా చట్టం ముందు అందరూ సమానమే అన్నారు గతంలో భారత ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావు, అలాగే లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రముఖ నాయకులు ఎటువంటి హడావుడి లేకుండా తమ మీద వచ్చిన కేసులపై సామాన్యుల మాదిరి కోర్టులకు హాజరయ్యారు. కానీ నేడు జగన్మోహన్ రెడ్డి చట్టాలకు అతీతుడిలా వ్యవహరించారన్నారు. 11 సీబీఐ ఛార్జిషీట్లు, 9 ఈడీ ఛార్జిషీట్లలో తీవ్రమైన ఆర్థిక నేరంలో ఎ1 గాఉండి రూ.43 వేల కోట్లకు పైగా అవినీతి నిర్ధారించబడి 6 సంవత్సరాల తర్వాత కోర్టుకి హాజరవుతూ జగన్ రెడ్డి వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు.

## మళ్ళీ మొదటికొచ్చిన సింహాచల కండ్రిగ భూ వివాదం



తొట్టంబేడు, నవంబర్ 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ రిజర్వ్ ఫారెస్టు వివాదం మళ్ళీ మొదటి కొచ్చింది. ఇక్కడ భూ వివాదాలకు సంబంధించి అటవీశాఖ పనులకు అటంకం కల్గిస్తున్నట్లు భావించి ఇక్కడ సోమవారం 144 సెక్షన్‌ను విధించినట్లు అటవీ క్షేత్రాధికారి లోకేష్ సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ సెక్షన్ మొక్కలు నాటే వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఈసందర్బంగా లోకేష్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని సింహాచల కండ్రిగలో అటవీశాఖకు చెందిన భూములున్నట్లు వివరించారు. ఇనగలూరు రిజర్వ్ ఫారెస్టులో వ్యవసాయ భూములకు పట్టాలున్నాయంటూ కొందరు రైతులు శాఖ చేపట్టిన చెట్లు నాటే కార్యక్రమాలకు ఆటంకం కల్గిస్తున్నారని వివరించారు. గతంలో ఇదే విధంగా వర్షాలకు ముందు ప్లాంటేషన్‌ను ంజూన్ నెలలో సింహాచల కండ్రిగ గ్రామానికి చెందిన కనుమూరి కోటయ్య, కె. శంకరయ్య, బి.ప్రసాద్,. ఈ సాంబయ్య, తగ్గింపాటి తిరుపాల్‌లపై కేసు నమోదు చేసినట్లు అధికారి లోకేష్ వివరించారు. వారు అటవీశాఖ అధికారులను అడ్డుకోవటం బెదిరించటం చేస్తున్నారని వివరించారు. రైతులకు అక్కడ కాకుండా ఇతర చోట భూములు చూపిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చి వారికి ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించినప్పటికి సంతృప్తి చెందక పనులకు ఆటంకం కల్గిస్తున్నట్లు వివరించారు. ఇనగలూరు రిజర్వ్ ఫారెస్టులో మొత్తం 120 ఎకరాల్లో అటవీశాఖ అధికారిప్లాంటేషన్‌కు నిర్ణయించి నిధులు కేటాయించారన్నారు. సుమారు 70 ఎకరాల్లో చెట్టు నాటే కార్యక్రమాలు పూర్తి చేసిన తరువాత మళ్ళీ పేచీ ఎపెట్టి లొల్లి చేస్తున్నారని లోకేష్ వివరించారు. మిగిలిని భూముల్లో వర్షాకాలానికి ముందే చెట్టు నాటాల్సి ఉండగా అక్కడ పనులు చేసుకుంటున్న అటవీశాఖ సిబ్బంది విధులకు ఆటంకం కల్గిస్తున్నారని ఆయన వివరించారు. సింహాచల కండ్రిగకు చెందిన ఓ హింసాత్మక గుంపు ఇనగలూరు రిజర్వ్ పారెస్టులో తొటల పనిని అడ్డుకుంటున్నారని శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తున్నారని ఇది మంచిది కాదన్నారు. ఇక్కడ శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే అవకాశం ఉందన్నారు. పచ్చని చెట్లను పరిరక్షించిపర్యావరణాన్ని కాపాడుటకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తే కొందరు స్వార్థపరుల చర్యలతో విధులకు ఆటంకం కల్గుతుందని లోకేష్ వివరించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (144పిఆర్‌పిసి) సెక్షన్ 163 కింద తనకు ఇవ్వబడిన అధికారాలను వినియోగించి ఇనగలూరు రిజర్వ్ ఫారెస్టు చట్టుపక్కల నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమావేశమవ్వటానికి నిషేధించి ఉత్తర్వులు జారి చేసామన్నారు. మొక్కల నాటే కార్యక్రమాలు పూర్తి అయ్యే వరకు ఉత్తర్వులు అమలు జరుగుతాయని వివరించారు. ఎవరైనా ఉత్తర్వులు ఉల్లంఘిస్తే నిబంధనల మేరకు శిక్షకు గురౌతారని లోకేష్ ప్రకటించారు. ఈ మేరకు నిర్ణయాన్ని జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, శ్రీకాళహస్తి తహశీల్దార్, పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించినట్లు అటవీశాఖాధికారి లోకేష్ వివరించారు.




## వైభవంగా పట్టాభి అవార్డుల ప్రదానం

అమరావతి, నవంబరు 24.ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకులు డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో స్థాపించిన పట్టాభి కళాపీఠం 15వ వార్షికోత్సవం,పట్టాభి అవార్డుల ప్రదానోత్సవం గుంటూరు బ్రాడీపేటలోని కొరటాల భవన్ లో జరిగింది. సభకు కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వివిధ రంగాలలోని 11 మంది మహిళామణులను ఎంపిక చేసి పట్టాభి అవార్డుతో సత్కరించడం జరుగుతోందని అన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన అఖిల భారత పంచాయితీ పరిషత్ (దిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డా. జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ, పట్టాభి సీతారామయ్య ఆంధ్రా బ్యాంకును స్థాపించి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత వలివేటి శుభావతి మాట్లాడుతూ కళాపోషకులు, కళాభిమానుల ప్రోత్సాహమే కళాకారులను ఉత్తేజ పరుస్తుందని అన్నారు. జిల్లా అటవీ శాఖాధికారి హిమశైలజ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా పట్టాభి అవార్డ్ దక్కడం ఆనందంగా ఉందని అన్నారు. వివిధ రంగాలలో ప్రముఖులైన వలివేటి శుభావతి, డా.లలితా సింధూరి, డా. లావణ్య, డా. ప్రశాంతి లక్ష్మీదేవి, కె.అనూరాధ, ధారా శ్రీలక్ష్మి, వి. నాగరత్నం, హిమ శైలజలకు పట్టాభి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాటక రచయిత కావూరి సత్యనారాయణ, డా.ఆంద్రూ తదితర ప్రముఖులు ప్రసంగించారు.

25-11P g7exHMNWJQE 11_25-11P g7exHMNWJQE.qxd 24/Nov/25 11:58 PM Page 1



# ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

● డిపిఆర్ తయారు చేయండి ● జిల్లా కలెక్టర్‌కు సిఎం ఆదేశం

● రింగ్‌రోడ్డుకు ప్రతిపాదనలకు ఓకే ● మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి వెల్లడి



అనంతపురం, నవంబర్ 24 ప్రభాతవార్త బ్యూరో: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని తీర్చిదిద్దాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్ప నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురంలో సోమవారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయని, ఈ వేడుకలు ఎంతో దిగ్విజయంగా పూర్తి అయినట్లు ఆయన తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పుట్టపర్తికి విచ్చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పుట్టపర్తిని ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. స్థానిక పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విన్నపం మేరకు పుట్టపర్తి బుక్కపట్నం ,కొత్తచెరువు మండలాలను కలుపుతూ ఒక రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు బుక్కపట్నం చెరువులో బోటింగ్ ,సత్యసాయి బాబా విగ్రహం ఏర్పాటు, టూరిజం గెస్ట్ హౌస్‌లు కల్పిస్తూ ఒక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఒక డిపిఆర్ ప్రాజెక్టు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు. శతజయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా పుట్టపర్తికి విచ్చేసిన రాష్ట్రపతి ఉపరాష్ట్రపతి ప్రధాని తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రులతోపాటు మహారాష్ట్ర సీఎం వివిధ రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర మంత్రులు ప్రధాన న్యాయమూర్తుల వివిధ ప్రముఖులు , సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులకు, సత్యసాయి భక్తులకు, సత్యసాయి సేవా సభ్యులకు ,ఇక్కడికి విచ్చేసినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై విచారణ జరపాలి

## గ్రీవెన్స్ సెల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



అనంతపురం, నవంబర్ 24 ప్రభాత వార్త బ్యూరో: గత వైసిపి ప్రభుత్వంలో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ నిధుల వ్యయంపైన చేపట్టిన పనులపైన తగిన విచారణ జరిపించాలని అనంతపురం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు ప్రత్యేకంగా సోమవారం ఫిర్యాదు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బాల్యం రాజేష్ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో అనంతపురం పార్లమెంటు నియోజకవర్గాలకు కేటాయించిన ఎంపి నిధుల వ్యయంపైన, చేపట్టి పూర్తిచేసిన పనులపైన, 2019 నుండి 2024 వరకు విడుదల చేసిన ఎంపీ నిధులకు సంబంధించి పూర్తి సమగ్ర విచారణ జరిపించాలని రాజేష్ కోరారు. అదేవిధంగా గత వైసిపి ప్రభుత్వంలో మాజీ పార్లమెంటు సభ్యుడు తలారి రంగయ్య సిఫార్సు మేరకు శెట్టూరు మండలంలోని యాటకల్లు గ్రామంలో శ్రీరామస్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించిన మొత్తం నిధులను పనిని చేపట్టకుండానే డ్రా చేసుకున్నారని తెలిసింది. దీనిపైన కూడా పూర్తి సమగ్ర విచారణ జరిపించి, తగిన చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా మెజిస్ట్రేట్ అయినా కలెక్టర్‌ను సంప్రదించి, కలెక్టరేట్ గ్రీవెన్స్ లో కోరినట్లు రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అర్హులందరికీ ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం



గుంటూరు, నవంబరు 24 ప్రభాతవార్త: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమంగా సొంతవారికే ఇళ్ల కేటాయింపులు చేస్తే ఇప్పుడు ఎటువంటి అక్రమాలు, అవినీతి లేకుండా అత్యంత పారదర్శకంగా ఆవాస్ యాప్ ద్వారా నూతన ఇళ్లకు దరఖాస్తులు, కేటాయింపులు జరుగుతున్నాయని మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పీతల సుజాత వివరించారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సుజాత మీడియాతో మాట్లాడుతూ... "గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర-రాష్ట్ర కూటమి ప్రభుత్వం కలిసి పిఎంఏవై- ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకంను అమలు చేస్తోంది. పేదల స్వప్నాలను సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోంది అని పేర్కొన్నారు. 2029 నాటికి ప్రతి పేదవారికి సొంత ఇల్లు ఉండాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రతీకార రాజకీయాలు, విలాసవంతమైన ప్యాలెస్‌ల నిర్మాణమే అజెండాగా పెట్టుకొని విధ్వంస రాజకీయాలకు తెరలేపాడని మండిపడ్డారు. పేదలకు ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఒక్క శాతం కూడా నెరవేర్చలేదు. 5 దేశాల్లో ప్యాలెస్‌లు కట్టుకున్నాడు తప్పించి పేదల ఇళ్ల నిర్మాణాలపై శ్రద్ధే పెట్టలేదని ఆరోపించారు.

# శ్రామికవర్గంపై లేబర్ కోడ్‌ల పేరుతో దాడి

● సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

● 26న దేశవ్యాప్త ఆందోళనకు సిపిఎం మద్దతు



విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: నాలుగు లేబర్‌కోడ్ అమలు కోసం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేయడం శ్రామికవర్గంపై దాడని, దీన్ని రాష్ట్రాలు కూడా కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేయడం అప్రజాస్వామికమని, వాటి హక్కులనూ కాలరాయడమేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు అన్నారు. సోమవారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. యజమానులకు పూర్తి అనుకూలంగా లేబర్ కోడ్‌లు తెచ్చి, అమలు చేయాలని రాష్ట్రాలను ఒత్తిడి చేస్తూ నోటిఫికేషన్ తెచ్చిందని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ కోడ్‌లు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని చెప్పారు. వీటిల్లో కనీస వేతనం నిర్వచనాన్ని అస్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. కార్మిక యూనియన్లకు సమ్మె చేసే హక్కును, వేతనాల కోసం యజమాన్యంతో చర్చించే హక్కునూ లేకుండా చేశారని విమర్శించారు. కార్మికశాఖను పనికిరాని సంస్థగా మార్చేశారని, అధికారులను ఫెసిలిటేటర్లుగా పేర్కొన్నారని తెలిపారు. గిగ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించలేదని తెలిపారు. కార్మిక రంగం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని, దాన్ని కూడా కేంద్రం పరిధిలోకి తీసుకుంటోందని విమర్శించారు. కేరళ వంటి రాష్ట్రాల్లోనూ ఇలాంటి అప్రజాస్వామిక చట్టాలు అమలు చేయాలని ఒత్తిడి చేస్తోందని, వీటిని అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈనెల 26న కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనను సిపిఎం పూర్తిగా సమర్థిస్తుందని తెలిపారు.

విశాఖపట్నం దగ్గరలోని తర్లువాడలో పెడుతున్న అదానీ గూగుల్ డేటా సెంటర్ వివరాలను వెంటనే బయటపెట్టాలని రాఘవులు డిమాండు చేశారు. రాష్ట్రానికి ఉపయోగమే అయితే వివరాలు ఎందుకు బయపెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన సంజీవని అమలు చేయడమంటే ఆరోగ్య సేవలను ప్రైవేటుపరం చేయడమేనని రాఘవులు విమర్శించారు. దీనికి సంబంధించిన విషయాలను కూడా ప్రభుత్వం దాచేస్తోందన్నారు.

### అపరేషన్ ఖగార్ పేరుతో గిరిజనులపై దాడి

ఎన్‌కౌంటర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులను కాల్చి చంపుతోందని, ఆపరేషన్ ఖగార్ పేరుతో గిరిజన ప్రజానీకంపై యుద్ధం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు అడవి, సహజ వనరులు, ఖనిజాలపై కన్నేశాయని, వాటికోసం మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల పేరుతో గిరిజనులను తరిమేసి, అడవులను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కేంద్రం చేస్తున్న కుట్రల్లో భాగమే మావోయిస్టుల హత్యలని రాఘవులు ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ బూటకమని, వేర్వేరు చోట్ల తలదాచుకున్న వారందరినీ పట్టుకెళ్లి కాల్చిచంపుతున్నారని అన్నారు.

# చిన్న పరిశ్రమల అభివృద్ధికి ఎన్ఐఆర్‌డిసి 'ఇండ్ యాప్'

## 8 మంత్రిత్వ శాఖల సహకారంతో రూపకల్పన




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 24:** భారత ప్రభుత్వ సూక్ష్మ,చిన్న మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం పనిచేసే నేషనల్ ఇండస్ట్రీస్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ కౌన్సిల్ ఎంఎస్ఎంఈ వాడుక పరిధిని పెంచేందుకు దేశీయంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఇన్‌డి యాప్ రూపకల్పనను సోమవారం ప్రకటించింది. 8 మంత్రిత్వ శాఖల మద్దతుతో ఇన్‌డి యాప్,భారత దేశం అంతటా ఎంఎస్ఎంఈ రంగంలోని వ్యవస్థాపకుల కోసం ప్రత్యేకంగా సృష్టించారు. ఈ అప్లికేషన్‌ను రూపొందించిన నోడల్ బాడీగా, వనరులు, మద్దతు విధానాలకు యాక్సెస్‌ను క్రమబద్ధీకరించడానికి ఎన్ఐఆర్‌డిసి ఇతర ప్రభుత్వ సంస్థలతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తుంది. ఈ సహకార వ్యవస్థ, పారిశ్రామిక సౌకర్యాలు, విధాన అమలుకు సమగ్రమైన పరిపూర్ణమైన విధానం ఉందని నిర్ధారిస్తుంది.'డిజిటల్ మద్దతుతో భౌతిక విస్తరణను సమగ్రపరచడం ద్వారా, ఇండ్ యాప్ పారదర్శకత, సామర్థ్యం,సమ్మిళిత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఒక పటిష్ఠమైన ఇంటర్‌ఫేస్‌ను సృష్టిస్తుంది. ఈ హైబ్రిడ్ ఎంగేజ్‌మెంట్ మోడల్ చిన్న చిన్న సంస్థలు కూడా జాతీయ, ప్రపంచ అవకాశాలను పొందగలిగేలా నిర్ధారిస్తుంది, వృద్ధి, ఆవిష్కరణల కోసం వ్యక్తిగత,వర్చువల్ మార్గాలను ఉపయోగించుకుంటుంది' అని ఎన్ఐఆర్‌డిసి జాతీయ చైర్మన్ శంభు సింగ్ పేర్కొన్నారు. సబ్‌స్క్రిప్షన్ ఆధారిత మోడల్‌లో అందుబాటులో ఉన్న ఈ యాప్ ప్లే స్టోర్, యాప్ స్టోర్ రెండింటిలోనూ డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఇప్పటికే అందుబాటులో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్ వ్యాపారాలు ప్రభుత్వ పథకాలపై తాజా సమాచారాన్ని పొందడానికి సహాయ పడుతుంది, ఎంఎస్ఎంఈ రంగంలోని వ్యా పార కార్యక్రమాలపై నోటిఫికేషన్‌లు, నెట్ వర్కింగ్ పేజీ ఇతర సామాజిక మాధ్యమాల మాదిరిగానే వ్యవస్థాపకులు ఇతర వ్యాపార యజమానులతో సంభాషించడానికి సహకరి స్తుంది. ఎన్ఐఆర్‌డిసి రూపొందించిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఇండి యాప్ భారతదేశం ప్రధాన సాంకేతిక ఆవిష్కరణగా చూడవచ్చు, అప్లికేషన్ బహుళ రంగాల, బహుళఉపయోగకరమైన నమూనా నేడు దేశానికి అత్యంత అవసరమని నమ్ముతున్నాను. అధికార విధానాల ద్వారా కేంద్రీకరించడంలో నావిగేషన్‌ను సరళీకృతం చేయడంలో, ప్రభుత్వ కార్యక్రమాల నుండి ప్రయోజనం పొందడానికి అవసరమైన సమయం కృషిని యాప్ గణనీయంగా తగ్గిస్తుంది అని ఎన్ఐఆర్‌డిసి వైస్‌చైర్మన్ లలిత్ వర్మ అన్నారు. ఈ యాప్‌ను ఈ నెల 26వ తేదీన అదికారికంగా ప్రారంభించనున్నారు

# పెషావర్ కానిస్టేబుల్ హెడ్‌క్వార్టర్స్‌పై ఆత్మాహుతి దాడి

## ముగ్గురు సిబ్బంది మృతి.. ఇద్దరు మిలిటెంట్ల హతం



**పెషావర్(పాకిస్థాన్), నవంబరు 24:** పాకిస్తాన్‌లో గుర్తుతెలీని వ్యక్తులు ఏకకాలంలో పాకిస్తాన్ ఫ్రాంటియర్ కానిస్టేబ్యులరీ స్థావరంపై దాడులు నిర్వహించారు. పెషావర్‌లోని సద్దర్ మెయిన్ రోడ్డులో ఉన్న ఎఫ్‌సి హెడ్‌క్వార్టర్స్‌పై దాడులు ఏకకాలంలో జరగడంపై ఆర్మీ అప్రమత్తం అయింది. రెండుచోట్ల పేలుళ్ల జరగడం, వెను వెంటనే కాంపౌండ్‌లో కాల్పులు ఎదురుకాల్పులు జరగడం వంటివి చోటుచేసుకున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది ఈ దాడుల్లోచనిపోయారు. దీనితో ఈ హైసెక్యూరిటీ జోన్‌ను లాక్‌డౌన్‌లో ఉంచు తున్నట్లు ప్రకటించారు. పాకిస్తాన్ ఫెడరల్ కానిస్టేబ్యులరీ విభాగం ఫెడరల్ పారామిలిటరీ ఫోర్స్‌గా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుంది. దేశం మొత్తంగా శాంతిభద్రతల నిర్వహణ అనేది ఈ మంత్రిత్వశాఖ పరిధిలోనే ఉంటుంది. నిఘా వేగుల సమాచారం అనుసరించి దాడులు ముందుగా ఎఫ్‌సి ప్రధాన ద్వారం వద్ద ఆత్మాహుతి దాడితో ప్రారంభం అయ్యాయి. ఆ తర్వాత మోటారు సైకిల్ స్టాండ్‌వద్ద అత్యంత తీవ్రస్థాయి పేలుడు చోటుచేసుకుంది. ఈ రెండుసార్లు పేలుళ్ల అత్యంత భయాందోళనలు రేకెత్తించాయి. ముగ్గురులేదా ఐదుగురు ఆగంతకులు ఎఫ్‌సి సెక్యూరిటీ సిబ్బందిపై మూకుమ్మడి దాడికి యత్నించినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనలతో సద్దర్ పరిసర ఏరియాలకు ఉన్న రూట్లన్నింటినీ మూసివేసినట్లు ప్రకటించారు. ఇప్పటివరకూ ఇద్దరిని హతమార్చామని అధికారులు ప్రకటించారు. ఈనెల 11వ తేదీ కూడా ఇస్లామాబాద్‌లోని జిల్లాకోర్టు బయట ఆత్మాహుతి బాంబరు పోలీస్ వాహనండీకొట్టి పేల్చివేయడంతో12 మంది చనిపోగా 27 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈదాడికి పాల్పడింది మేమే అని టిటిపి ప్రకటించింది.

# ఎపి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ




గుంటూరు, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా 'మాఏపి' అత్యంత ప్రతిష్టాత్మకగా 2026 జనవరి 4న తెనాలిలో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ను కన్వీనర్, సినీ దర్శకుడు దిలీప్ రాజా విడుదల చేశారు. మాఏపి కార్యాల్నయలో సోమవారం జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు కేవ్నల ఆంధ్రప్రదేశ్ లోని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు మాత్రమే రాష్ట్రవ్యాప్తంగా ఈ షార్ట్ ఫిలిం పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఇతర రాష్ట్రాల ఎంట్రీలకు ప్రవేశం లేదన్నారు. 15 నిమిషాల నిడివి మించకుండా డ్సిశబర్ 25 లోగా షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలను "మా ఏపీ కార్యాలయం, ఆలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి 522 202" చిరునామాకు పెన్‌డ్రైవ్‌తో నటీనటుల ఆధార్ కార్డులు, ఫోటోలు జతపరచి పంపించవలసిందిగా ఆయన తెలిపారు. కథాంశాలలో ఏమతాన్ని, కులాన్ని, రాజకీయ పార్టీలను విమర్శించకుండా కంటెంట్ ఉండాలని దిలీప్ రాజా వివరించారు. సమాజంపై విషం చిమ్ముతున్న కొన్ని వ్యవస్థలు, తల్లిలాంటి దేశ భద్రతకు సవాళ్ళుగా నిలిచిన కొన్ని శక్తులపై కెమెరా కన్ను పెట్టాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే కథాంశాలను ఎంపిక చేసుకునే పూర్తి స్వేచ్ఛ దర్శక నిర్మాతలదేనని ఆయన స్పష్టం చేశారు. విజేతలకు సూపర్ స్టార్ కృష్ణ స్మారక ప్రథమ బహుమతిగా 50 వేల రూపాయలు, మహానటి సావిత్రి స్మారక ద్వితీయ బహుమతికి 30 వేలు, కొంగర జగ్గయ్య స్మారక తృతీయ బహుమతికి 20 వేలు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జము నల పేరుతో రెండు కన్సోలేషన్ బహుమ తులకు 20 వేల రూపాయల నగదు బహు మతులు అందజేస్తామని కో కన్వీనర్, దర్శ కుడు అచ్చన శ్రీనివాస యాదవ్ పేర్కొన్నారు. తెనాలిలో ఈ షార్ట్ ఫిల్మ్ షూటింగులు తీసుకునే యూనిట్లకు లొకేషన్‌లు, ట్రాక్ ట్రాలీ, బేబీ, జూనియర్, 2 కెవి లైట్లు, రిఫ్లెక్టర్లు ఉచితంగా మాఏపి అందిస్తుందన్నారు. ఉత్తమ నటుడు, నటి లాంటి వ్యక్తిగత బహుమతులను స్వర్గీయ గోవిందరాజుల సుబ్బారావు, కాంచనమాల, ఏవీయస్, చక్రపాణి, బొల్లిముంత శివరామ కృష్ణ, మోదుకూరి జాన్సన్, సభారంజని, వల్లూరి వెంకట్రామయ్య చౌదరి, ఏవీ సుబ్బారావు, కన్నెగంటి నాసరయ్య, ఆకుల వెంకయ్యల పేరిట విజేతలకు పర్మినెంట్ షీల్డ్, ప్రశంసాపత్రం అందుకుంటారని శ్రీనివాస యాదవ్ వివరించారు. కాగా ఎంట్రీ ఫారంతో పూర్తి నియమనిబంధనలు తెలుసుకునేందుకు ఎంపఏఏ-పియుఎస్ఐఓఎస్‌జివెమెయిన్.కామ్‌కు మెయిల్ చేసి తెలుసుకోవచ్చుని లేదా పై చిరునామాను సంప్రదించవచ్చుని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శకుడు గాజులపల్లి రాముడు,మా ఏపి సభ్యులు పినపాటి సురేష్ బాబు,మంచాల విజయ కిషోర్, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్, రోటేరియన్ కన్నెగంటి మురళి, కాకుమాను యర్రబాబు, కన్నెగంటి మధు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటం విరమణకు వచ్చే ఫిబ్రవరి 15 వరకు గడువివ్వండి

## - కేంద్రానికి మావోయిస్టుల లేఖ

విజయవాడ, నవంబరు 24 ప్రభాతవార్త: సాయుధ పోరాట విరమణకు తమకు మరో మూడు నెలల గడువు కావాలని మావోయిస్టు పార్టీ మహా రాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ స్పెషల్ జోనల్ కమిటీ కేంద్రానికి లేఖ రాసింది. ఈ 22వ తేదీన రాసిన లేఖ సోమవారం నాడు వెలుగు చూసింది. మూడు రాష్ట్రాల స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ ఈ లేఖ రాశారు. దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులను అంచనా వేసిన తరువాత ఆయుధాలను త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సోను దాదా తీసుకున్న నిర్ణయానికి పార్టీలోని అందరు మద్దతు ఇస్తున్నట్లు అనంత్ తన లేఖలో తెలిపారు. స్పెషల్ జోనల్ కమిటీతో పాటు ఇతర విభాగాలకు చెందిన సభ్యులు ఆయుధాలను విడిచిపెట్టి ప్రభుత్వ పునరావాసం, నూతన ప్రణాళికను అంగీకరించాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందు కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు తమకు సమయం ఇవ్వాలని ఆయన కోరారు. మావోయిస్టు పార్టీ ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు కట్టుబడి వుందని, సమిష్టిగా ఆయుధాల త్యజించడంపై నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం పడుతుందని, ఈ విషయంలో అందరి తో చర్చించాల్సి వుందని, ఇందుకోసం 2026 ఫిబ్రవరి 15వ తేదీ వరకు తమకు గడువు కావాలని అనంత్ కోరారు. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని, మావోయిస్టుల లొంగుబాటుపై కేంద్రం 2026 మార్చి 31వ తేదీ వరకు గడువు విధించిందని, అప్పటి వరకు మూడు రాష్ట్రాలు తమ విషయంలో కొంత సంయమనం పాటించాలని ఆయన కోరారు. ఈ క్రమంలో త్వరలో జరగాల్సిన పిఎల్‌జిఎ వారోత్సవాలలో ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించబోమని, ఇదే సమయంలో పోలీసుల కూంబింగ్ ఆపాలని, దాడులను నిలిపి వేయాలని ఆయన కోరారు. పార్టీ సందేశం మావోయి స్టు పార్టీలోని అన్ని కేడర్‌లలోని వారికి చేరేలా ప్రభుత్వ ప్రసార సాధనాలలో విస్తృతంగా ప్రచారం కల్పించాలని అనంత్ కోరారు. ఈ లోగా మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు కొంతమంది ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులతో సమావేశమయ్యే అవకాశాన్ని తమకు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమయం లో పోలీసుల తరపున మావోయిస్టులపై ఎలాంటి దాడులు వుండకుండా చూడాలని, అప్పుడే తమ ప్రయత్నం అమల్లో వచ్చేందుకు అవకాశం వుం టుందని ఆయన తెలిపారు.

# అత్యాచారం కేసులో నిందితుడికి 12యేళ్ల జైలు

## విజయనగరం కోర్టు తీర్పు

విజయవాడ/ విజయనగరం, నవంబరు 24 ప్రభాతవార్త ప్రతినిధి: విజయనగరం జిల్లా గరివిడి పోలీసు స్టేషనులో 2019 సం.లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడు గరివిడి మండలం, బొండపల్లి గ్రామంకు చెందిన సవిరిగాన సూర్యనారాయణ (45)కు విజయనగరం 5వ ఎడిజె కం మహిళా కోర్ట్ న్యాయమూర్తి ఎన్. పద్మావతి 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2,000లు జరిమానా విదిస్తూ నవంబర్ 24న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే.. విజయనగరం జిల్లా, గరివిడి మండలం, బొండపల్లి గ్రామంకు చెందిన ఒక మహిళ 19-09-2019దిన తన పశువులశాలలో పశువులకు మేత వేస్తుండగా అదే గ్రామానికి చెందిన సవిరిగాన సూర్య నారాయణ, (45) వెనుక నుండి వచ్చి ఆ మహిళను అత్యాచారం చేశాడన్నారు. ఈ విషయమై సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి గరివిడి పోలీసు స్టేషను ఎస్ఐ కే.కృష్ణప్రసాద్ 20-09-2019న కేసు నమోదు చేసారన్నారు. అనంతరం, అప్పటి చీపురుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రాజుల నాయుడు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. నిందితుడు సవిరిగాన సూర్యనారాయణ(45)పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం 5వ ఎడిజె కం మహిళా కోర్ట్ న్యాయమూర్తి ఎన్.పద్మావతి 12 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2,000లు జరిమానా విధిస్తూ నవంబర్ 24న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసులు తరుపున ఫోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటరు జి.సత్యం వాదనలు వినిపించారన్నారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసి, నిందితుడిని శిక్షి ంచబడే విధంగా సమర్థ వంతంగా పని చేసిన చీపురుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు, సిఎంఎస్ ఎఎస్ఐ పి.మల్లేశ్వరరావు, కోర్టు కానిస్టేబులు జి.ఎల్. నాయుడు, పిపి జి.సత్యం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# బెంగళూరులో యువతి హత్య



**చౌడేపల్లి, నవంబరు 24, ప్రభాతవార్త:** కర్ణాటక రాజధాని బెంగళూరులో యువతి హత్య జరగడంతో అందుకు కారణంగా అనుమానిస్తున్న మూలాలు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో వున్నాయని ప్రచారం జరగడంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రికి చెందిన ప్రేమ్‌హర్షవర్ధన్ అనే లోకవర్ధన్ డిగ్రీ నుంచి ఎంబిఏ వరకు తిరుపతిలోనే విద్య నభ్యసించాడు. చదువు పూర్తయిన ప్పటికీ మూడే ళ్లుగా ఉద్యోగ వేటలో అక్కడే వున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం మదనపల్లి నుంచి బోయ కొండ మీదుగా తన సొంత గ్రామం పెద్దకొండా మర్రికి వచ్చినట్లుగా అతని స్నేహితులు తెలుపుతున్నారు. రాత్రి 7గంటల ప్రాంతంలో తాను మరణిస్తున్నాననీ, శవాన్ని గ్రామానికి సమీపంలోని పెద్దచెరువులో తీసుకోవాలని కుటుంబ సభ్యులు సెల్‌ఫోన్ నుంచి మెసేజ్‌లు చేసాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో రాత్రిరాత్రే పోలీసులు చెరువు వద్దకు చేరుకొని మొత్తం గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో వారు వెనుతిరిగారు.

ఆ సమయంలో కొందరు నాయకులు మిస్సింగ్ కేసు నమోదు చేయాలని పోలీసుపై ఒత్తిడి తెచ్చారు. ఇదిలా వుండగా సోమవారం మధ్యాహ్నం ఒక మెసేజ్ అందరిలో కలకలం సృష్టించింది. ప్రేమహర్షవర్ధన్ అనే గోవర్ధన్ అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బిక్కింగారిపల్లి దేవీశ్రీ(21)ని బెంగళూరులో హత్య చేసినట్లుగా సోషియల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

అంతే కాకుండా ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించడంతో నిజంగా యువతిని హత్యచేసి పరారీపై వచ్చిన వ్యక్తి ఇక్కడ ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ డ్రామా ఆడినట్లుగా కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ హర్షవర్ధన్ అనే గోవర్ధన్ పట్టుబడితే తప్ప అసలు విషయం బయటపడదని ఇంకొందరు అంటున్నారు.



# దుర్గమ్మ సేవలో శాసనసభ స్పీకర్

ఇంద్రకీలాద్రి, నవంబరు 24 ప్రభాతవార్త: దుర్గమ్మవారిని సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయన ఖడ్గమాల సేవలో పాల్గొన్నారు. అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అదికారులు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు విజయవాడకు చెందిన వంగపండు శంకర్ కుటుంబసభ్యులు సతీమణి సత్యవతి పేరిట రు1లక్ష విరాళాన్ని సోమవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

25-11pg10 12 ONG_25-11pg10.qxd 24/Nov/25 9:50 PM Page 1



# సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో భారత్ విక్టరీ

## దక్షిణ కొరియాపై 1-0తో గెలుపు



**న్యూఢిల్లీ:** సుల్తాన్ అజ్లాన్ షా కప్ 2025 ప్రారంభ మ్యాచ్‌లో భారత్ దక్షిణ కొరియాను ఓడించింది. మలేషియాలోని ఇపోలో దక్షిణ కొరియాపై 1-0 తేడాతో విజయం సాధించి భారత్ అజ్లాన్ షా కప్ ప్రచారాన్ని ప్రారంభించింది. మొదటి క్వార్టర్ చివరి నిమిషంలో మహ్మద్ రహీల్ చేసిన ఒంటరి గోల్ వర్షం కారణంగా భారత్‌కు విజయాన్ని అందించింది. వరుసగా కురిసిన భారీ వర్షం కారణంగా ఆరు గంటలకు పైగా సమయం తర్వాత చివరికి ఈ మ్యాచ్ సాయంత్రం ఆలస్యంగా ప్రారంభమైంది. షెడ్యూల్ అంతరాయం కలిగి ఉన్నప్పటికీ, భారత్ ఆటను త్వరితగతిన పూర్తి చేసింది. 15వ నిమిషంలో దిల్‌ప్రీత్ సింగ్ కుడి వైపున ఒక తెలివైన కదలికను ప్రారంభించి, రహీల్‌కు ఖచ్చితమైన పాస్‌ను అందించడంతో వారికి పురోగతి లభించింది. ఫార్వర్డ్ ఆటగాడు క్లీన్, యాంగిల్ డ్రాగ్ ఫ్లిక్ చేసి భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. దక్షిణ కొరియాకు ఎక్కడా అవకాశం లేకుండా భారత్ ప్రయత్నించింది. భారత్ మిడ్‌ఫీల్డ్, బ్యాక్‌లైన్ రెండింటిలోనూ కాంపాక్ట్‌నెస్‌ను కొనసాగించడంతో కొరియన్లకు స్పష్టమైన స్కోరింగ్ అవకాశాలను పరిమితం చేసింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కోసం రెండవ శ్రేణి జట్టును రంగంలోకి దించిన భారత్, ప్రారంభంలో ఆధిక్యం సాధించిన తర్వాత ఆట వేగాన్ని నిర్వహించడంలో క్రమశిక్షణను ప్రదర్శించింది. ఆరేళ్ల విరామం తర్వాత సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో పాల్గొంటున్న భారత్‌కు ఈ విజయం సానుకూల పునరుజ్జీవనాన్ని కల్పించింది.

# మహిళల కబడ్డీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు భారత్



**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్-2025 సెమీఫైనల్లో ఇరాన్‌పై 33-21 తేడాతో విజయం సాధించింది. ఢాకాలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో తమ అజేయ విజయాన్ని కొనసాగించి మహిళల కబడ్డీ ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ల సమన్వయం, బహుముఖ రైడింగ్ యూనిట్ ద్వారా అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఇరాన్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ క్రమశిక్షణా ట్యాక్లింగ్ మరియు సమర్థవంతమైన రైడింగ్ ద్వారా ప్రారంభంలోనే ఒత్తిడిని ప్రయోగించింది. ఇరాన్ వేగాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. దీంతో భారత రక్షణ రేఖను ఛేదించడానికి ఇరాన్ ఇబ్బంది పడింది. మ్యాచ్ ముందుకు సాగుతున్న కొద్దీ భారత్ సకాలంలో రైడ్‌లు, కాంపాక్ట్ డిఫెండింగ్‌తో తమ ప్రయోజనాన్ని పెంచుకుంది. ఇది ఇరాన్ స్కోరింగ్ అవకాశాలను పరిమితం చేసింది. ఈ విజయంతో 2012 ప్రారంభ ఎడిషన్‌లో విజయం సాధించిన తర్వాత, రెండవ మహిళల కబడ్డీ ప్రపంచ కప్ టైటిల్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మరో బలమైన ప్రదర్శనతో ఢాకాలో తమ ఆధిపత్య పోరును ముగించాలని భారత్ పట్టుదలతో ఉంది. కాగా నాకౌట్ దశకు చేరుకునే భారత్ ఇప్పటికే ఆధిపత్యాన్ని నొక్కి చెప్పింది. థాయిలాండ్‌పై 65-20 తేడాతో ఘన విజయం సాధించి ఆ జట్టు టైటిల్ డిఫెన్స్‌ను ప్రారంభించింది. బంగ్లాదేశ్, జర్మనీ (63-22), ఉగాండా (51-16)లను ఓడించి, నాలుగు మ్యాచ్‌లలో 4 విజయాలు, అత్యధిక పాయింట్ల తేడాతో లీగ్ దశను ముగించింది.

# షూటింగ్‌లో ప్రాంజలికి స్వర్ణం



**న్యూఢిల్లీ:** డెఫ్లింపిక్స్ 2025లో భారత్ షూటర్ ప్రాంజలి ప్రశాంత్ ధుమాల్ షూటింగ్ ఈవెంట్‌లో స్వర్ణం సంపాదించింది. దీంతో మూడో పతకాన్ని గెలుచుకున్నట్లయింది. టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణం గెలుచుకోవడం ద్వారా ప్రశాంత్ తన అత్యుత్తమ ప్రచారానికి మరో టైటిల్‌ను జోడించింది.

అభినవ్ దేశ్వాల్ తో కలిసి మిక్స్‌డ్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రజతం తర్వాత ఈ విజయం ఆమెకు ఈ క్రీడల్లో మూడవ పతకంగా నిలిచింది. ఆమె 600 స్కోరుకు 573 స్కోరుతో కొత్త అర్హత ప్రపంచ రికార్డు మరియు డెఫ్లింపిక్స్ రికార్డును నెలకొల్పిన తర్వాత టాప్ క్వాలిఫైయర్‌గా ఫైనల్‌లోకి ప్రవేశించింది.




# కాశ్మీర్ ఛాలెంజ్ కప్‌లో..

# ఫైనల్ బెర్తుకు జైపూర్ పోలో..

**న్యూఢిల్లీ:** కాశ్మీర్ ఛాలెంజ్ కప్-2025లో థండర్‌బోల్ట్‌పై ఘన విజయంతో జైపూర్ పోలో ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. జైపూర్‌కు చెందిన మహారాజా సవాయి పద్మనాభ్‌సింగ్ అద్భుతమైన ప్రదర్శనఇచ్చాడు. 9గోల్స్ సాధించి జైపూర్ పోలో జట్టును కాశ్మీర్ ఛాలెంజ్ కప్‌లో థండర్ బోల్ట్ జట్టుపై 13-2.5 తేడాతో నిర్ణయాత్మక విజయానికి నడిపించాడు. తొలి చుక్కర్ నుంచే పద్మనాభ్ జైపూర్ జట్టుపై నిరంతరం ఒత్తిడి తెచ్చాడు. అతనికి 3 గోల్స్ చేసిన ప్రణవ్ కపూర్,1 గోల్ చేసిన దక్షిణాఫ్రికా లాన్స్ వాట్సన్‌ను సపోర్ట్ లభించింది. దీంతోజైపూర్ మొత్తం స్కోరును 132.5కి తీసుకువచ్చారు. గట్టిపోటీ ఉన్నప్పటికీ, థండర్‌బోల్ట్ జట్టు ధైర్యంగా పోరాడింది. లెఫ్టినెంట్ కల్నల్ విశాల్ చౌహాన్ ఒక్క గోల్ చేశాడు. వారి 1.5 హ్యాండిక్యాప్‌తో సహా, థండర్‌బోల్ట్ మొత్తం 2.5 గోల్స్‌తో ముగించింది. ఇక ప్రారంభం నుంచే జైపూర్ ఆధిక్యంలో కొనసాగించి, అన్ని చుక్కర్లలో స్థిరమైన ఆధిక్యాన్ని కొనసాగించింది. పద్మనాభ్ యొక్క అద్భుతమైన తొమ్మిది గోల్స్ ప్రదర్శన మ్యాచ్‌ను విజయ తీరాలకు నడిపించింది. అంతకు ముందు హోరాహోరీ పోలో మ్యాచ్‌లో జైపూర్ పోలో 8-7 తేడాతో కనోటా పోలోపై గెలుపొంది కాశ్మీర్ ఛాలెంజ్ కప్ ప్రచారాన్ని ప్రారంభించింది. లాన్స్ వాట్సన్ 4 గోల్స్, పద్మనాభ్ 4 గోల్స్ సాధించి జైపూర్ ఆధిక్యాన్ని కొనసాగించడంలో సహాయపడ్డారు. కనోటా పోలో జట్టు కెప్టెన్ హుర్ర్ అలీ 4 గోల్స్ చేశాడు. డినో ధంకర్ 2 గోల్స్ చేయగా, క్రిస్ ప్రతాప్ సింగ్ కనోటా 1 గోల్ చేసి ఆటను చివరి విజిల్ వరకు పోటీగా ఉంచాడు. మొదటి చుక్కర్ తర్వాత జైపూర్ 3-1తో ఆధిక్యంలో ఉండి, రెండవ ఆట ముగిసే సమయానికి 6-5తో ఆధిక్యాన్ని కొనసాగించింది. చివరి చుక్కర్ తీవ్రమైన పోటీ ఏర్పడినా జైపూర్ 8-7తో మ్యాచ్‌ను గెలుచుకుంది.

# డేవిస్ కప్ వరల్డ్ ఛాంపియన్ ఇటలీ

**న్యూఢిల్లీ:** డేవిస్ కప్-2025, ప్రపంచ ఛాంపియన్‌గా ఇటలీ నిలిచింది. బోలోగ్నాలో జరిగిన బెస్ట్ ఆఫ్‌త్రీ టైలో స్పెయిన్‌పై 2-0 తేడాతో విజయం సాధించింది. ప్రారంభ మ్యాచ్‌లో పాబ్లో కారెనో బస్టాను 6-3, 6-4 తేడాతో ఓడించాడు. ఆ తర్వాత కోబోల్లి 1-6, 7-6(5), 7-5 తేడాతో జౌమ్ మునార్‌ను ఓడించి ఫిలిప్పో వోలాండ్రి జట్టుకు విజయాన్ని నమోదు చేశాడు. ఆరుసార్లు విజేతగా నిలిచిన స్పెయిన్‌పై విజయం ఇటలీకి నాల్గవ డేవిస్ కప్ టైటిల్‌ను అందించింది. 1976, 2023, 2024లో విజయాలు సాధించింది. తదుపరి 1971 ఈవెంట్ తర్వాత ఛాలెంజ్ రౌండ్ రద్దు చేయబడటంతో ఇటలీ వరుసగా మూడు డేవిస్ కప్ టైటిళ్లను గెలుచుకున్న మొదటి ప్రపంచ దేశంగా కూడా నిలిచింది. ఈ రెండు జట్లలోనూ కీలక ఆటగాళ్లు లేకపోవడం విశేషం. స్పెయిన్ జట్టు కార్లోస్ అల్కరాజ్‌ను కోల్పోగా, ఇటలీ జట్టు జానిక్ సిన్నర్ మరియు లోరెంజో ముసెట్టి లేకుండా ఆడింది. కానీ బెరెట్టిని, కోబోల్లి ఆ సందర్భానికి అద్భుతంగా ఆడారు.



ఓపెనర్‌ను ప్రారంభించడానికి వరుస టైట్ సర్వీస్ గేమ్‌ల తర్వాత, బెరెట్టిని కారెనో బస్టాను 5-3 ఆధిక్యంలోకి తీసుకెళ్లి, సెట్‌ను కేవలం 30 నిమిషాల్లోనే సులభంగా ముగించాడు. ఇక రెండవ సెట్ 4-4తో సమమైంది. అయితే నిర్ణయాత్మక సమయంలో మళ్ళీ గోల్ చేసి, మ్యాచ్‌ను 5-4 ఆధిక్యాన్ని సంపాదించాడు.

# టీమిండియా చెత్త ప్రదర్శన

## 314 రన్స్ ఆధిక్యంలో సౌతాఫ్రికా

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో రెంటో టెస్టులో టీమిండియా చెత్త ప్రదర్శనతో ఫ్లాప్ అవుతోంది. గువాహటి వేదికగా తొలుత టీమిండియా బౌలర్లు తేలిపోగా, బ్యాటర్లు కూడా తామేమీ కాదన్నట్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో సౌతాఫ్రికా పట్టు బిగించింది. మూడో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 26 పరుగులు సాధించింది. ర్యాన్ రికెల్టన్ (13), ఐడెన్ మార్‌క్రమ్ (12)లు క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం సౌతాఫ్రికా 314 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకముందు 9/0 ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ మరో 192 పరుగులు జోడించి 10 వికెట్లు కోల్పోయింది. టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకు ఆలౌట్ కావడంతో సౌతాఫ్రికా 288 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ (59; 97 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేయగా, వాషింగ్టన్ సుందర్ (48; 92 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కేఎల్ రాహుల్ (22), కుల్దీప్ యాదవ్ (19) పర్వాలేదనిపించగా, ధ్రువ్ జురెల్ (0), సాయి సుదర్శన్ (15), రిషబ్ పంత్ (7), రవీంద్ర జడేజా (6), నితీశ్ కుమార్ రెడ్డి(10)లు విఫలం అయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ 6 వికెట్లు, సైమన్ హార్మర్ 3 వికెట్లు, కేశవ్ మహరాజ్ ఓ వికెట్ సాధించాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా ఫాలో ఆన్ ఆడాల్సిన దుస్థితిలో ఉంది. అయితే సఫారీ జట్టు కెప్టెన్ తెంబా బవుమా మాత్రం తాము బ్యాటింగ్ చేయాలనే నిర్ణయం తీసుకోవడంతో టీమిండియా ఊపిరి పీల్చుకుంది.





# బ్రిటన్‌కు గుడ్‌బై చెబుతున్న ఆర్సిలర్ మిట్టల్




**లండన్, నవంబరు 24:** ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ నివాస్ మిట్టల్ బ్రిటన్‌కు వీడ్కోలు పలకనున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి. కీర్ స్టార్మర్ ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త పన్ను విధానం కారణంగా ఆయన ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం యూకేలోని సంపన్నులలో చర్చనీయాంశంగా మారింది. యూకేలో 226 ఏళ్లుగా అమల్లో ఉన్న 'నాన్‌డోమ్' (నాన్‌డొమిసైల్) పన్ను విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం ప్రకారం, యూకే నివాసితులు తమ విదేశీ ఆదాయంపై బ్రిటన్‌లో పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ వెసులుబాటును తొలగించడంతో మిట్టల్ వంటి ఎందరో సంపన్నులు యూకేను వీడి, పన్నుల స్వర్గధామాలైన ఇతర దేశాల వైపు చూస్తున్నారు. ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సంస్థ అయిన ఆర్సెలార్ మిట్టల్‌లో మిట్టల్ కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. సండే టైమ్స్ రిచ్ లిస్ట్ 2025 ప్రకారం, మిట్టల్ సంపద 15.4 బిలియన్ పౌండ్లతో యూకేలో ఎనిమిదో అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. ఆయన కుమారుడు, కంపెనీ సిఇఒ ఆదిత్య మిట్టల్ భవిష్యత్ పెట్టుబడుల కోసం దుబాయ్ వైపు దృష్టి సారించినట్లు సమాచారం. ఆయన దుబాయ్‌కి మకాం మార్చే అవకాశం ఉందని తెలిసింది. ఇకపై పెట్టుబడులన్నీ దుబాయ్‌లోనేపెట్టే యోచనలో మిట్టల్ ఉన్నట్లు బ్రిటన్ పత్రికలు ఘోషించాయి. బ్రిటన్‌లో ఉన్నప్పటికీ వారి శాశ్వత నివాసం ఇతర దేశాల్లోఉంటే విదేశీఆదాయంపై బ్రిటన్‌లో వారు పన్నులు కట్టనక్కర్లేదు. అయితే ఇప్పుడు ఈవిధానాన్ని తొలగించాలని స్టార్మర్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో పన్నుల భారం నుంచి తప్పించుకునేందుకు సంపన్నులు దేశం వీడుతున్నారు. కాగా, రాజస్థాన్‌లో జన్మించిన మిట్టల్ బ్రిటన్‌లో 8వ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఆస్తుల విలువ 15.4 బిలియన్ పౌండ్లుగాఉంది. ఆర్సెలార్ మిట్టల్‌సంస్థలో లక్ష్మీమిట్టల్ కుటుంబానికి 40 శాతం వాటాఉంది. సంపన్నులు ఇలా దేశాన్నివీడటం బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని నష్టాలు!

**ముంబయి, నవంబరు 24:** అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల ధోరణులు కనిపించినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. రోజంతా ఒడుదొడుకులతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 331.21 పాయింట్లు నష్టపోయి 84,900.71 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ కూడా 108.65 పాయింట్లు క్షీణించి కీలకమైన 26,000 మార్కు దిగువన 25,959.5 వద్ద ముగిసింది. నిఫ్టీ 26,000 దిగువన ముగియడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచిందని, దీనివల్ల సూచీలు 25,800-25,750 స్థాయిల వరకు పడిపోయే అవకాశం ఉందని ట్రేడర్లు అంచనా వేసారు. మార్కెట్ తిరిగి పుంజుకోవాలంటే నిఫ్టీ తప్పనిసరిగా 26,150 స్థాయిని దాటాలని వారు అభిప్రాయపడ్డారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్ లాభపడగా బిఇఎల్, టాటా స్టీల్, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్ వంటివి ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ సూచీ 2.05 శాతం పతనంతో రియల్ ఎస్టేట్ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. మెటల్, కెమికల్ స్టాక్స్ కూడా నష్టపోయాయి. అయితే, మార్కెట్ ట్రెండ్‌కు విరుద్ధంగా నిఫ్టీ ఐటీ సూచీ 0.41 శాతం లాభపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. మరోవైపు, రూపాయి విలువలో కొంత రికవరీ కనిపించింది. వారాంతంలో చరిత్రాత్మక కనిష్ఠ స్థాయి 89.65కు పడిపోయిన రూపాయి, ఈరోజు 35 పైసలు బలపడి 89.20 వద్ద ట్రేడింగ్ ముగించింది. రానున్న రోజుల్లో రూపాయి 88.75-89.50 శ్రేణిలో కదలాడవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇక ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ రూ.1,23,341గా కొనసాగాయి. డాలర్‌సూచీ పరంగాచూస్తే రూపాయి 89.20వద్ద ముగిసింది. బ్రెంట్‌ముడిచమురు 37 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 62.19 డాలర్లుగా నడిచింది. ఇక స్టాక్స్‌పరంగాచూస్తేకర్ణాటక బ్యాంకు 5.21శాతం పెరిగితే ఆర్కేఇసి ప్రాజెక్టులు 19.46శాతం పెరిగాయి. దిలీప్ బిల్డ్‌కాన్ 2.97శాతం పెరిగింది. ఎన్‌బిసిసి షేర్లు కూడా 3.33శాతంపెరిగాయి. ఇక లెమన్ ట్రీ హోటల్స్ 3.03శాతం క్షీణించాయి. హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ 2.10 శాతం పెరిగితే లూపిన్ 1.60శాతం క్షీణించింది. నాట్కోఫార్మా కూడా 2.59శాతం షేర్లుపతనం అయ్యాయి. బిఆర్ గోయల్ ఇన్‌ఫ్రా షేర్లు 2.57శాతం దిగువన ట్రేడ్ అయినట్లు సాక్ మార్కెట్ డేటా స్పష్టంచేస్తోంది.







# రష్యానుంచి భారత్‌కు భారీ తగ్గింపు ఆఫర్!

**న్యూఢిల్లీ,నవంబరు 24:** రష్యా చమురు వ్యాపారంలో అమెరికా ఆంక్షలు కొత్త మార్పులు తెస్తున్నాయి. రష్యా దిగ్గజకంపెనీలు రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై ఆంక్షలు అమలవుతుండటంతో క్రూడాయిల్‌ధరలు రికార్డుస్థాయికి తగ్గాయి. దీనితో భారత్‌కు చమురుసరఫరాచేసే విధానాలు మారాయి. మన రిఫైనరీలకు భారీ లాభాలను తెస్తుందని నిపుణుల అంచనా. రష్యానుంచి భారత్‌కువచ్చే ముడిచమురుధరలు గతరెండేళ్లలో ఎన్నడూలేనంత తక్కువకకు చేరాయి. రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా ఆంక్షలు విధించాక లాభదాయకంగా ఉన్న అక్కడి చమురువ్యాపారం తారుమారైంది. రష్యాప్రధాన చమురు అయిన ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు ధరకంటే బ్యారెల్‌కు ఏడు డాలర్లవరకూ తగ్గింపుతో భారత్ రిఫైనరీలకు అందించేందుకు సన్నద్ధంఅయ్యారు. ఆంక్షలు లేపుడు ఈ తగ్గింపు మూడు డాలర్లుగా ఉండేది. ఈకొత్త ఆఫర్ డిసెంబరులో లోడ్‌చేసి జనవరిలో భారత్‌చేరే చమురుకు వర్తిస్తుంది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంప్రారంభించాక తక్కువధరల కారణంగా రష్యా చమురును భారత్ భారీగా కొనుగోలుచేసింది.

# ఐదేళ్లలో జిడిపిలో 20శాతానికి ఉత్పత్తిరంగ వాటా!




**న్యూఢిల్లీ, నవంబరు 24:** భారత్ ఉత్పత్తిరంగా స్థూల దేశీయ ఉత్పత్తి అంటే జిడిపిలో 13శాతంనుంచి 20శాతానికి పెరుగుతుందని ఈక్విరస్ క్యాపిటల్ అంచనావేసింది. 2030 నాటికే జిడిపిలో 20శాతం వాటాతో ఉంటుందని వెల్లడించింది.అంటే జిడిపిలో ఐదోవంతు వాటాకు పెరుగుతుంది. డిమాండ్ పెరుగుతుండటం, పాలసీ సంస్కరణలు తీసుకురావడం, గ్లోబల్ వాల్యూచైన్స్‌కు భారత్ ఏకీకరణ కావడం దీర్ఘకాలిక ప్రయోజనాలతో చైనాకు చెక్‌పెట్టుకోవడం వంటివాటితో ఉత్పత్తిరంగం మెరుగవుతోంది. ఇకసుంకాలు బెడదలనేది మినహాయిస్తే భారతీయ కార్పొరేట్లు వచ్చే ఐదేళ్లలో భారీ వృద్ధిని నమోదుచేయగలరని ఈక్విరస్ క్యాపిటల్ ఎండి మునీష్ అగర్వాల్ అన్నారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, గతిశక్తి, ఇన్‌ఫ్రా విస్తరణపథకాలు వంటివి ఉత్పత్తిరంగానికి కీలక వృద్ధి పునాదులని విశ్లేషించారు. దీనికితోడు సుస్థిర మూలధనవ్యయం, రానున్న రోజుల్లో నిర్మాణాత్మక పథకాలతో లాభాలు రావడం వంటివికూడా జిడిపిలో ఉత్పత్తిరంగ వాటా పెరుగుదలకు దోహదంచేస్తోంది. బిఎస్ఇ ఇండస్ట్రియల్ సూచీ గత 2022 జులైలో సెన్సెక్స్, ఇతర విభాగ సూచీలను కూడా అధిగమించిన అంశాన్ని గుర్తుచేసారు. ఇక 32 పారిశ్రామిక ఐపిఒలు వచ్చి 663.2 బిలియన్ డాలర్లు సమీకరించాయి. ఇక విలీనాలు, సమీకరణలు, ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు ఐదేళ్ల గరిష్టానికి చేరుకని 1432.8 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఈక్విరస్ క్యాపిటల్ అంచనావేసింది. యాంత్రీకరణ, రోబోటిక్స్, కృత్రిమ మేధ వంటివి మరింత టెక్నాలజీ ఆధునాతన వ్యవస్థలని, మెషిన్ లెర్నింగ్ అనేది పారిశ్రామికవిభాగాలకు ఇపుడు కీలకం అవుతుందని ఆయన వెల్లడించారు. ఇపుడు చిన్న యూనిట్లు కూడా రోబోటిక్స్ అమలుకు సిద్ధం కావడం ఉత్పత్తిరంగ వృద్ధిని సూచిస్తున్నట్లు ఈక్విరస్ వెల్లడించింది.

# డాలర్ వర్సెస్ రుపీ 89.20



**ముంబయి, నవంబరు 24:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ ఈరోజు లాభాలతో ప్రారంభమైంది. ఈ ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి 26 పైసలు బలపడి 89.14 వద్ద మొదలైంది. శుక్రవారం నాటి ముగింపు ధర 89.41తో పోలిస్తే మెరుగుపడింది. చివరకు 89.20వద్ద కరెన్సీ ట్రేడింగ్ ముగిసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) జోక్యం చేసుకోవడంవల్లే రూపాయివిలువలో ఈ సానుకూల మార్పు కనిపించిందని కరెన్సీ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 21న రూపాయి విలువ 89.49 వద్ద చారిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే. భారత ఈక్విటీల నుంచి విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడం, అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న అనిశ్చితి, ఆ సమయంలో ఆర్‌బిఐ నుంచి స్పష్టమైన జోక్యం లేకపోవడం వంటి కారణాలతో రూపాయి భారీగా పతనమైంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై పురోగతి లేకపోవడంతో అమ్మ కాల ఒత్తిడి పెరిగి, రూపాయి విలువ 89.60 వద్ద సరికొత్త ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయింది. ఇటీవల కాలంలో రూపాయి విలువలో తీవ్ర ఒడుదొడుకులను నివారించేందుకు ఆర్‌బీఐ డాలర్ విక్రయాలు చేపట్టడంతో కొంతమేర కట్టడి అయింది. సమీప భవిష్యత్తులో రూపాయి 89.21శ్రేణిలో కదలాడొచ్చని అంచనా.



# 'సందేసర'సోదరులకు సుప్రీం ఊరట!

**న్యూఢిల్లీ, నవంబరు 24:** బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పరారైన ఆర్థిక నేరగాళ్లు నితిన్, చేతన్ సందేసర సోదరులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. సుమారు 1.6 బిలియన్ డాలర్ల బ్యాంకు మోసంకేసులో వారు మూడోవంతు మొత్తాన్ని, అంటే 570 మిలియన్ డాలర్లు చెల్లిస్తే వారిపైఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో ఇది ఒక కీలక మైలు రాయిగా నిలిచిపోనుంది. సందేసర సోదరులతరఫున ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. తమ క్లయింట్లు 570మిలియన్ డాలర్లుచెల్లించి, కేసులను ముగించుకోవ డానికి సిద్ధంగా ఉన్నారని కోర్టుకు తెలిపారు. ఈ ప్రతిపాదనకు అంగీకరించిన న్యాయస్థానం, ఆ మొత్తాన్ని చెల్లించేందుకు డిసెంబర్ 17ను తుది గడువుగా నిర్ణయించింది.ఫార్మా, ఎనర్జీ రంగాల్లో వ్యాపారాలు చేసిన సందేసర సోదరులు, బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టి 2017లో అల్బేనియా పాస్‌పోర్ట్‌తో దేశం విడిచి పారిపోయారు. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి 14 మంది పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల జాబితాలో కేంద్ర ప్రభుత్వం వీరి పేర్లను కూడా చేర్చింది. ఈ తాజా తీర్పుతో, కొంత మొత్తం చెల్లించి కేసుల నుంచి బయటపడేందుకు ఇతర ఆర్థిక నేరగాళ్లు కూడా ప్రయత్నించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, దీనివల్ల బ్యాంకులు భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందన్న ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps